తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జూన్ 2020 వెల రూ.5/-

ఉభయ దేవేరులతో
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు
శ్రీనివాసమంగాపురం



# తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగిన జ్యేష్ఠాభిషేకం దృశ్యాలు

















# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।
భీష్మమేవాభిరక్షన్తు భవన్తః సర్వ ఏవ హి ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-11వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** చ= కాబట్టి; సర్వేషు అయనేషు= అన్ని వ్యూహద్వారములందు; యథా భాగమ్= మీమీస్థానములందు; అవస్థితాః= నిలచియున్నవారై; భవన్తః= మీరు; సర్వ ఏవ= అందరునూ; హి= కావున; భీష్మమ్ ఏవ= భీష్మపితామహునే; అభిరక్షన్తు హి= రక్షింతురు గాక!

**భావం:** కావున మీరందరునూ మీ మీ స్థానములలో సుస్థిరముగా నిలిచి, అన్ని ప్రక్కల నుండి నిశ్చయముగా భీష్మ పితామహుని రక్షించుచుండుడు.

## నీవు పరిపూర్ణుడవు స్వామీ!

నే నేమిఁ జేయగలేను నీవు పరిపూర్ణుఁ డవు
హీనుఁడ నే నధికుడ వన్నిటా నీవు ॥

దండము వెట్టుట నాది తప్ప లోఁగొనుట నీది
నిండి నీ వెప్పుడు దయానిధివి గాన,
అండఁ జేరుకొంట నాది అందుకు నూఁ కొంట నీది
దండియైన దేవ దేవోత్తముఁడవు గాన ॥ (1)

శరణు చొచ్చుట నాది సరుగఁ గాచుట నీది
పరమ పురుష శ్రీపతివి నీవు
విరులు చల్లుట నాది వేవేలిచ్చుట నీది
పొరి నీవు భక్త సులభుఁడ వటు గాన ॥ (2)

దాసుఁడ ననుట నాది తప్పక యేలుట నీది
ఆసదీర్చె వరదుఁడ వటుగాన
నీ సేవ యొక్కటి నాది నిచ్చలు గై కొంట నీది
యీసులేని శ్రీవేంకటేశుఁడవు గాన॥ (3)

(అధ్యాత్మ సంకీర్తన- 2-433 )

అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో 'జీవుని' సేవకత్వమును, 'దేవుని' రక్షకత్వమును విశదపరుస్తున్నారు.

'స్వామీ! నేను అల్పుడను. నీవు పరిపూర్ణస్వరూపుడవు. ఎట్టి శక్తిలేని నేను హీనుడైన జీవాత్ముణ్ణి. నీవు అన్ని విధాల గొప్పవాడవైన పరమాత్ముడవు. నీకు నమస్కరించుట నా పని. నా తప్పులు సరిదిద్ది క్షమించుట నీ పని. ఎందుకంటే, నీవు పరిపూర్ణుడైన కరుణానిధివి కదా! నీ నామములు పేర్కొనుటయే నా పని. పలుకుట నీ పని. నిన్ను శరణు వేడుట నా కర్తవ్యం. రక్షించడం నీ కర్తవ్యం. ఎందుకంటే నీవు శరణాగత తత్పరుడవు. పూలతో పూజించుట నా వంతు. నాకు వివిధ సంపదలనివ్వడం నీ పని. ఎందుకంటే నీవు భక్తసులభుడవు కదా!

నేను నీ దాసుడవటం నా కర్తవ్యం. నా పై దయ జూపి కాపాడడం నీ కర్తవ్యం. ఎందుకంటే దాసుల ఆశలు తీర్చే వాడివి కదా! ఈ విధంగా నిన్ను సదా సేవించుటయే నా పని. నా సేవలను ఎప్పుడూ అంగీకరించడమే నీ పని. ఎందుకంటే నీవు ఈర్ష్య లేని వాడవు కదా!'






# ధ్యానయోగం

– డా॥ లక్ష్మీనారాయణ

మానవజీవితం సమస్యల వలయం. ఒత్తిళ్లకు నిలయం. వీటి నుండి బయటపడేందుకు ఒకే ఒక మార్గం 'ధ్యానం'. ధ్యానమంటే ప్రయాణం. 'ధీ' అంటే బుద్ధి, 'యానం' అంటే ప్రయాణం. ధ్యానం చేసే విధానం గురువు ద్వారా తెలుసుకోవాలి. నేర్చుకొని అభ్యసించాలి. శ్వాస మీద ధ్యాస ఉంచితే అదే ధ్యానంలో లగ్నం చేస్తుంది. ఇష్టదైవాన్ని నిత్యం స్మరించడం ధ్యానం. భగవద్భావాన్ని మనసులోనే అనుభవిస్తూ మననం చేసుకొనేది 'భావధ్యానం'. రూప-నామ-గుణాల్ని నమ్మి చేసుకొనేది భావధ్యానం. నిరాకార నిర్గుణమైన అదృశ్యశక్తిని ధ్యానిస్తే అది 'నిర్గుణ ధ్యానం'.



ఏ విధమైన ఆలోచన లోనికి రానీయకుండా, నియంత్రణతో సకలేంద్రియ సంయమనంతో ఏకాగ్రతతో దృష్టి నిలిపి ఉండడం ధ్యానానికి కావల్సిన ప్రధానలక్షణం. అసలైన ధ్యానతత్పరునికి పదిమంది మధ్యకూర్చున్నా, హోరెత్తించే శబ్దాల మధ్య కూర్చున్న శబ్దం వినబడదు. మనుష్యులు కనబడరు. అయినా సాధకుడు ప్రశాంత వాతావరణంలో ధ్యానం చేసుకోవడమే శ్రేయస్కరం.

రోజూ దినచర్యలో భాగంగా ధ్యానమాచరించే వ్యక్తికి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మానసిక ఒత్తిళ్లు, మనో వ్యథ, క్షణికమైన ఉద్రేకం, ఉద్వేగం, మతిమరపుతనం, చిత్తచాంచల్యం తొలగిపోతాయి.

సంయమనం, సహనం, సంస్కారం అలవడతాయి. ధ్యానం చేసేటప్పుడు మౌనంగా ఉండడం వల్ల వాక్శుద్ధి కలుగుతుంది. వాక్కు నియంత్రణలో ఉంటుంది. ధ్యానం వల్ల పనిమీద ఏకాగ్రత ఏర్పడి కార్యసిద్ధి చేకూరుతుంది. దురాలోచనలు దూరమైపోతాయి. మనోవికారాలనేవి మనసులో చోటు చేసుకోవు. సాత్త్విక ప్రవృత్తి అలవడుతుంది. గర్వం నశిస్తుంది. ధ్యానసాధకుడు ఉపయోగకర గ్రంథాలు చదవాలి. భరతభూమిలో ధ్యానం ప్రయోజనం తెలుసుకున్న మహర్షులు అనంత మైన విజ్ఞానాన్ని జగతికి పంచారు.

మానవజీవితానికి సంపూర్ణసాఫల్యాన్ని అందించే మహోత్తరణోపాయమే ధ్యానం. ధ్యానమనేది మనిషిని మానసికంగాను శారీరకంగాను నిరంతరం ఆరోగ్యవంతునిగా ఉంచుతుందని మన సనాతనులు, విజ్ఞులు ఏనాడో తెలిపారు. ధ్యానం చేయడం ఏమంత కష్టమైన పనికాదు. దృఢసంకల్పం, దీక్ష, నిరంతరసాధన ఉంటే చాలు. నిర్ణీతసమయంలో క్రమం తప్పకుండా రోజూ ఒకే ప్రదేశంలో ధ్యానం చేయాలి. వృద్ధులేకాకుండా యువత బాలబాలికలు ధ్యానం చేసుకోవచ్చు. ఉద్రేకాలు, భావోద్వేగాలు మనోవికారాలు దూరం చేసుకోవడానికి ధ్యానమే సోపానం.



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకుడు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
సహాయకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 51    జూన్, 2020    సంచిక : 01


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ధ్యానయోగం | డా॥ లక్ష్మీనారాయణ | 04 |
| దేవతాశ్రేష్ఠునికి జ్యేష్ఠాభిషేకం | డా॥ ఈ.ఎ.శింగరాచార్యులు | 07 |
| పెరియాళ్వార్ల దివ్యవైభవము | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 09 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ పుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 11 |
| సందేహాలు - సమాధానాలు | ఆచార్య శివపురం మురళీధరరావు | 13 |
| అసురీ లక్షణాలు బంధాన్ని కలుగజేస్తాయి | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 14 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 16 |
| నమ్మాళ్వారు - తిరుమల | శ్రీ సుధన్వన్ | 18 |
| పుష్పార్చన | శ్రీ పీసాపాటి నాగేశ్వరశర్మ | 20 |
| నామ మహిమ | శ్రీమతి కాత్యాయిని | 22 |
| దానగుణం | డా॥ ఎ.సచ్చిదానందమూర్తి | 24 |
| వైదిక వాఙ్మయం- స్త్రీలు | శ్రీమతి ఎస్.పద్మజ | 25 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| హృషీకేశ్ - ఒక ప్రముఖ దేవభూమి | డా॥ ఎస్.వేంకట కుమార్ | 33 |
| నిజమైన 'రత్నం' | మాస్టర్ యు.భరత్‌శర్మ | 36 |
| శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు-గరుడసేవ | డా॥ పి.టి.జి.రంగరామానుజాచార్య | 37 |
| స్వామిసేవలో.. తిరుమలనంబి | శ్రీ పి.కృష్ణబాలాజి | 38 |
| భగవంతుడు సమదర్శి | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 40 |
| శ్రీజగన్నాథ దర్శనం | ఆచార్య రాధాగోవిందత్రిపాఠి | 43 |
| హరిదాస వాఙ్మయంలో శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 46 |
| సూర్యధ్యానం | డా॥ ఎన్.వి.శ్రీనివాసరావు | 48 |
| ప్రకృతిమాత ప్రసాదించిన దివ్యౌషధం 'కలబంద' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 49 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య మరియు కిరణ్ భట్ | 51 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 53 |


ముఖచిత్రం : ఉభయదేవేరులతో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు, శ్రీనివాసమంగాపురం
వెనుక చిత్రం : తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి పుష్పయాగమహోత్సవం


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# 'ఆరోగ్యమే' మహాభాగ్యము

**ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ । ఆత్మైవహ్యాత్మనో బన్ధుః ఆత్మైవరిపురాత్మనః ॥**

"నిన్ను నువ్వే రక్షించుకోవాలి, నీ మంచిచెడ్డలు నువ్వే చూసుకోవాలి. నీకు మేలు– హాని చేసే మిత్రుడు, శత్రువు నీలోనే ఉన్నారు! కనుక మంచి మార్గం ఎంచుకొని జీవనయాత్ర సాగించు" అన్న గీతా వాక్యం ఎప్పుడూ మనం స్మరించుకోవాలి.

'ప్రకృతి'నే దైవంగా భావించే భారతీయులను సంప్రదాయవాదులుగా పరిగణించిన పాశ్చాత్య దేశాలకు 'కరోనా' నేపథ్యంలో నేడు భారతీయ సనాతన విధానాలే 'శరణ్య'మనిపిస్తున్నది. మన సదాచారమైన 'నమస్కారం' రెండు చేతులతో చేయడం గౌరవభక్తి భావాలకు ప్రతీక. ఈనాడు నమస్కరించడమే మంచి పద్ధతిగా భావించి ప్రపంచదేశాలలోని అందరూ మనల్ని అనుసరిస్తున్నారు. మునుపు మనపెద్దవాళ్లు మనం బయటనుంచి ఇంటికి రాగానే, స్నానంచేసి ఉతికిన దుస్తులు ధరింపజేయటం మనకు నేర్పిన సంస్కృతి. ఈ సంస్కృతినే మనం అంటువ్యాధుల నుండి కుటుంబాన్ని కాపాడే రక్షణగా భావింపవచ్చు. ఇదేరీతిలో ఇంటికి వచ్చే అతిథులను సైతం కాళ్లు, చేతులు కడుక్కురమ్మని చెప్పటం ఒక ఆచారం. ఎందుకంటే, దీనివలన ఎక్కడెక్కడో తిరిగి వచ్చినప్పుడు కాళ్లకు, చేతులకు అంటిన సూక్ష్మక్రిములను వదిలించుకున్నట్లు అవుతుంది. అట్లే, ఆహారం తీసుకునే ముందు, తర్వాత కూడా చేయడం మరింత ఆరోగ్యానికి మంచిది. అదే భారతీయత.

ఇక భోజనాది విషయాలకు వస్తే పళ్ళాలకన్నా, అరటి ఆకులలో భోజనం చేయడం అత్యంత ఆరోగ్యప్రదం. రాగిపాత్రలు, వెండిగ్లాసులలో నీరు త్రాగితే అన్ని సూక్ష్మక్రిములు నాశనమవుతాయని పరిశోధనలలో తేలింది. మన దేవాలయాల్లో వెండి పాత్రల్లో ఉపయోగించే తీర్థంలో తులసి, లవంగం పొడి, పచ్చకర్పూరం, ఏలకులపొడి మొదలైన వాటితో భక్తులకు తీర్థం ఇవ్వడం వల్ల, వారిని సూక్ష్మక్రిముల బారి నుండి కాపాడడమే కాక, అనేక రుగ్మతలను పోగొట్టే గుణం ఇది కలిగిస్తుంది. అందుకే తీర్థమిచ్చేటప్పుడు అర్చకస్వామి 'అకాలమృత్యుహరణం, సర్వవ్యాధినివారణం' అన్న మంత్రాన్ని పఠిస్తూ ఇవ్వడం జరుగుతుంది.


మనం ఆచరించే వాటిని చూసి ఎవరో ఏదో అనుకుంటారని మన ఆచారాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఆ విధంగా నిర్లక్ష్యం చేయడం వల్లనే మహమ్మారి 'కరోనా'లాంటి ఉపద్రవాలు వచ్చి ప్రపంచాన్ని అతలాకుతలం చేశాయి. అందుకే, మనం ఏర్పరచుకున్న మన సనాతన సంప్రదాయాలు, సదాచారాలను విస్మరించకూడదు. మన శ్రేయస్సు కోసం వాటిని పాటించాలి. మనలను మనం రక్షించుకోవాలి.

'కరోనా' ఉపద్రవసమయంలో తిరుమల తిరుపతి దేవస్థానములు విశ్వశ్రేయస్సు కోసం జపాలు, యజ్ఞాలు, పారాయణలు ముఖ్యంగా యోగవాశిష్ఠంలోని 'విషూచిక'గా పేర్కొన్న 'కరోనా'ను పారద్రోలడానికి, అట్లే ధన్వంతరీ మహామంత్ర పారాయణం దాదాపు 62 రోజులు చేయడం, అదేవిధంగా రామాయణాంతర్గత 'సుందరకాండ పఠనం' కొనసాగించడం సమస్త భక్త జనావళికి అభ్యుదయంగా ఆరోగ్యం కలిగించేదిగా భావించాలి. అందుకే **'ఆరోగ్యమే మహాభాగ్యమ'**ని పూర్వీకులు పేర్కొన్నారు.

ఇక ప్రభుత్వం కూడా 'కరోనా' బారిన పడకుండా ఉండేందుకు మార్గదర్శకాలను జారీ చేస్తూ, ఎప్పుడూ చేతులను శుభ్రపరచుకోవాలని, తప్పనిసరిగా ముఖములకు రుమాలు ధరించాలని, భౌతికదూరం పాటించాలని తెలియజేసింది.

**విధిగా వీటిని ఆచరిద్దాం... విశ్వ ఆరోగ్యానికి కట్టుబడదాం..!!**

***విశ్వకల్యాణగోవిందా! గోవిందా!! గోవిందా!!!***



# దేవతాశ్రేష్ఠునికి... జ్యేష్ఠాభిషేకం

డా॥ ఇ.ఎ. శింగరాచార్యులు


ప్రపంచ ప్రసిద్ధి గాంచిన క్షేత్రం తిరుమల. ఈ పుణ్య స్థలంలో స్వయంవ్యక్తమై ఆవిర్భవించిన స్వామి శ్రీవేంకటేశ్వరుడు. ఆ స్వామి ఉత్సవప్రియుడు. భక్తప్రియుడు. విశేషమైన గుణగణాల వల్ల ముఖ్యంగా భక్తరక్షణ వల్ల **'వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి'** అని ప్రసిద్ధి పొందినాడని చెప్పవచ్చు. తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తితో పాటు కొలువై ఉన్న అన్ని మూర్తులకు ఉత్సవాలు, సేవలు నిర్వహింపబడతాయి.

అసలు విష్ణుమూర్తి అంటేనే భోగప్రియుడు. అలంకారప్రియుడు. ఉత్సవప్రియుడు. భూలోక వైకుంఠంగా తిరుమలలో కలియుగ నాయకుడైన శ్రీవేంకటేశ్వరునికి జరిగే ఉత్సవాలలో అరుదైనది 'జ్యేష్ఠాభిషేకం'. గ్రీష్మతాపం తగ్గాలని, వర్షాలు విరివిగా కురవాలని కోరుకుంటూ వేంకటేశ్వర స్వామికి అభిషేకం నిర్వహిస్తారు. ప్రతినిత్యం దేవదేవునికి ఏదో ఒక ఉత్సవం జరుగుతూనే ఉంటుంది. తిరుమలలో జరిగే అన్ని ఉత్సవాలలో అత్యంత విశిష్టమైంది **'జ్యేష్ఠాభిషేకం'**. దీనినే **'అభిధేయకాభిషేకం'** అని కూడా వ్యవహరిస్తారు. అభిధేయక అంటే 'రక్షణ కవచం' అని అర్థం. విష్ణుమూర్తి కలియుగంలో వేంకటేశ్వరునిగా అవతరించే సమయంలో తన సహజమైన ఆయుధాలను ధరించి అవతరించారు. అందుకే స్వామికి జరిగే అభిషేకాదులలో ఆయన ధరించిన ఆయుధాల మెరుగు తరిగిపోకుండా పరిరక్షించే నిమిత్తం సంవత్సరానికి ఒకసారి అదీ జ్యేష్ఠమాసంలో ఈ అభిషేకం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది.

## మలయప్పస్వామికి ప్రత్యేకం

జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠానక్షత్ర సమయానికి ముగిసే విధంగా మూడురోజులపాటు జ్యేష్ఠాభిషేకం ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన మలయప్ప స్వామిని తొలిరోజు ప్రదక్షిణ మండపానికి తీసుకువస్తారు. అక్కడ వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి మేనిపై స్వర్ణకవచాన్ని తొలగింపచేస్తారు. అనంతరం, పంచామృతాలతో తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ సేవలు పూర్తి అయిన తర్వాత స్వామివారికి, దేవేరిమూర్తులకు **'వజ్ర కవచాన్ని'** అలంకరించి మాడవీథులలో ఊరేగిస్తారు. రెండోరోజు కూడా అభిషేకం నిర్వహించి స్వామివారికి ముత్యాల కవచాన్ని అలంకరింపచేస్తారు. ఈ సేవనే 'ముత్తంగిసేవ' అని అంటారు. ఇక చివరి రోజున స్వామి మూర్తులకు అభిషేకం చేసి **'బంగారుకవచాన్ని'** ధరింప చేసి ఊరేగింపు నిర్వహిస్తారు.






వీటన్నిటికీ ముందుగా ఉభయనాంచారులతో కూడి ఉన్న శ్రీమలయప్పస్వామివారు ఆనందనిలయాన్ని విడిచి సంపంగిప్రదక్షిణలో ఉన్న కల్యాణమండపంలోకి వేంచేస్తారు. అక్కడ ఋత్విక్కులు యాగశాలలో శాంతిహోమం నిర్వహిస్తారు. శతకలశ ప్రతిష్ఠ, ఆవాహన చేసి, పూజ– నివేదన–హారతులు ఇస్తారు.

ఈ క్రమంలోనే మలయప్పస్వామివారికి అర్ఘ్య పాద్యాదిక్రియలు నిర్వర్తించి కంకణధారణ చేస్తారు. శాంతి హోమాదులు, స్వామివారికి దేవేరికి హోమ తిలకం ధరింప చేస్తారు. ఆ తర్వాత 'స్నపనతిరుమంజనం' ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియలో జియ్యంగార్లు బంగారు శంఖాలతో అర్చక స్వాములకు శుద్ధజలాలను అందిస్తూ ఉంటే, ఆ జలంతో శ్రీవారికి అభిషేకం చేస్తారు.

అనంతరం పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం ఇత్యాది పంచసూక్తాలను వేదపండితులు పఠిస్తుండగా అభిషేకం కొనసాగుతూ ఉంటుంది. శుద్ధజలంతో అభిషేకం అయిన తరువాత పాలతో అభిషేకం చేస్తారు. ఆ తరువాత పెరుగుతో అభిషేకిస్తారు. తరువాత శతకలశాలను ఉపయోగించి అభిషేకం జరుపుతారు. ఇలా వరుసగా తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో అభిషేకం చేస్తారు. ఆ తర్వాత ఉత్సవ మూర్తులకు వస్త్రాలంకరణ చేసి నివేదన చేస్తారు. మూడవ రోజు స్వామివారికి సమర్పించిన బంగారుకవచం మళ్లీ సంవత్సరానికి వచ్చే జ్యేష్ఠాభిషేకంవరకు అలాగే ఉంచడం జరుగుతుంది. ఈ మూడు రోజులు శిరసాదిగా పాదాంతం వరకు అభిషేకాలు జరుపబడతాయి.

## శుక్రవారాభిషేకం

తిరుమల క్షేత్రంలో స్వామి మూలమూర్తికి శుక్రవారంనాడు అభిషేకం జరుగుతుంది. దీనికి జ్యేష్ఠాభిషేకానికి అవినాభావ సంబంధం ఉందని చెబుతారు. 'సామవై' అనే పల్లవరాణి లోహమూర్తులను తయారు చేయించి ఆలయానికి ఇచ్చింది. ఆమె ఆ విగ్రహాలను అక్షయనామ సంవత్సరం జ్యేష్ఠబహుళ తృతీయ శుక్రవారంనాడు ఆలయానికి సమర్పించింది.

అప్పటినుండి స్వామికి శుక్రవారం అభిషేకం చెయ్యడం ఆనవాయితిగా మారిందంటారు. అయితే, స్వామివారి అన్ని సేవలలోను పురాతనమైనదిగా జ్యేష్ఠాభిషేకాన్ని భావిస్తారు. పంచసూక్తాలు, దివ్యప్రబంధపారాయణం, పాశురాల పఠనం స్వామివారికి నైమిత్తికంగా జరుగుతాయి. ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో మూడురోజులపాటు జరిగే తిరుమల శ్రీనివాసుని 'అభిధేయకఅభిషేకం' కనులారా తిలకించవల్సిందే!

*ఓం నమో వేంకటేశాయ*

# పెరియాళ్వార్ల దివ్యవైభవము


ఆచార్య చక్రవర్తి రంగనాథన్



'ఆళ్వారు' అనగా లోతు ఎరిగినవాడని అర్థం. భగవద్భక్తి ప్రపత్తుల ఫలితం తెలిసికొని పరమానందాన్ని పొంది సముద్రపులోతు తెలుసుకొన్నవారు ఆళ్వార్లు. ఆళ్వార్లు భక్తి పరవశముతో భగవంతుని దివ్యమంగళవిగ్రహాన్ని గాంచి తాదాత్మ్యం చెందేవారు. వీరు పన్నిద్దరు. ఈ పన్నిద్దరాళ్వారులు శ్రీమహావిష్ణు అంశమున జన్మించారు. ఈ ఆళ్వారులలో **'పెరియాళ్వారు'** ప్రసిద్ధిని పొందినవారు.

ఒకానొక సమయంలో శ్రీరామానుజులు తిరుక్కచ్చినంబితో, పెరియాళ్వారు గురించి తెలుసుకోవాలని, వారు రచించిన 'తిరుపల్లాండు'ను గూర్చి తెలుసుకోవాలని కుతూహలంగా ఉందని తెలిపారు. అప్పుడు తిరుక్కచ్చినంబి పెరియాళ్వార్ల జీవితచరిత్ర గురించి ఈ విధంగా తెలియజేశారు.

పెరియాళ్వారు బాల్యనామము తెలియదు. వీరి యొక్క విష్ణు భక్తిని బట్టి ప్రజలు వీరిని 'విష్ణుచిత్తుడ'ని పిలిచేవారు. వీరు విల్లిపుత్తూరనే గ్రామంలో జన్మించారు. బాల్యము నుండీ విష్ణుచిత్తుడు శ్రీకృష్ణభక్తుడు. ఒకనాడు పాండ్యరాజాస్థానమునకు ఉత్తరదేశమునుండి ఉద్దండ సంస్కృత పండితుడొక్కడు వచ్చి తనతో వేదాంత తర్కము సమానంగా వాదించగల విద్వాంసులు ఎవరైనా రాజాస్థానంలో ఉన్నారా? అని ప్రశ్నిస్తాడు. వాస్తముగా ఆ రాజు తన ఆస్థానంలో అంతగొప్ప విద్వాంసులు లేకపోయినా లేరని చెప్పేందుకు అప్రతిష్టగా భావించి, విష్ణుచిత్తుని పిలిపించి, విష్ణుచిత్తునితో తన ఆస్థానములో ఉత్తరదేశమునుండి ఉద్దండ పండితుడు వచ్చాడని, వానిని నీవు వేదాంతతర్కములో ఓడించమని అంటాడు. తద్వారా మన రాజాస్థాన గౌరవాన్ని నిలబెట్టాలని తెలియజేస్తాడు. మీపై ఆ విశ్వాసము మాకున్నదని రాజు పలికాడు.



అప్పుడు విష్ణుచిత్తుడు 'రాజా! నేనెల్లప్పుడు స్వామి సేవ చేయుచు కాలం గడిపేవాడిని, కాని తమ అభీష్టమును నెరవేరుస్తానని' మాటిచ్చెను. అంతేకాక 'రాజు మాలాంటి భక్తులను ప్రోత్సహించాలని' చెబుతాడు.

అంతట విష్ణుచిత్తుడు శ్రీకృష్ణుని మనసులో తలచుకుంటాడు. తద్వారా అప్రతిహతమైన ధైర్యస్థైర్యాలను పొందుతాడు. యువకుడైన విష్ణుచిత్తుడు పండితునితో వేదోపనిషత్తులపై తర్కము చేయుట ఆరంభించెను. అప్పుడు రాజు సింహాసనారూఢుడై ఉండగా, పండితులు,


విద్వాంసులు, ఉద్యోగులు, పెద్దలతో రాజసభ కిక్కిరిసి ఉంది. ఉదయము మొదలు సాయం సమయం వరకు తెరపిలేని తర్కవాదము కొనసాగింది. విష్ణుచిత్తుడు వాని సమక్షంలో సింహకిశోరము వలె ప్రకాశించాడు. అపర సరస్వతి వలె భాసిల్లాడు. కడకు రానురాను సూర్యాస్తమయ కాలమునకు విష్ణుచిత్తునిదే పైచేయి అయినది. సూర్యోదయకాలంలో వెలవెలబోయిన చంద్రబింబంలా ఆ పండితుడు వివేకి కనుక తన ఓటమిని అంగీకరించాడు. ఆ పండితుడు 'విష్ణుచిత్తుడు మానవాకృతిలో ఉన్న వాగ్దేవి' అని ప్రశంసించాడు. అప్పుడు రాజు పరమానందముతో విష్ణుచిత్తునికి తన అర్ధరాజ్యము ఇస్తానని పలికాడు.

అప్పుడు విష్ణుచిత్తుడు, 'రాజా ఇందులో నా ప్రతిభ ఏమి లేదు. శ్రీకృష్ణుని భక్తుని అయినందువల్లననే నాకు జయము కలిగింది. దానికి స్వామియే కారణము. సర్వసంగ పరిత్యాగి అయిన నాకు రాజ్యమేల' అని పలికాడు. 'సర్వాంతర్యామియైన వైష్ణవ భక్తి ప్రపత్తుడను. శ్రీకృష్ణదేవాలయమే నా రాజ్యము. వారికి సేవ చేయుటలోనే నాకు అధికారము, ఆనందముంది' అని తెలిపాడు.

అప్పుడు పాండ్యరాజదంపతులు విష్ణుచిత్తుని అపార భక్తికి వైరాగ్యములకు మెచ్చి సాష్టాంగ దండ ప్రణామము లాచరించారు. 'మీ మాటను కాదనము, కాని మా కోరికను కూడా మన్నించండి' అని చెబుతూ, 'నా ప్రతిజ్ఞకు భంగం వాటిల్లకుండుటకై మీ శిరముపై రాజకిరీటము ధరింప చేసి మిమ్మల్ని పట్టపుటేనుగుపై కూర్చుండపెట్టుకొని పురవీథులలో మహోత్సవము జరిపి కృతార్థులౌతాము' అని రాజు తనను కృతార్థుడను చేయాలని, రాజు ఉత్సవమునకై ఉత్తర్వులు ఇచ్చెను.

విష్ణుచిత్తుడు పట్టపుటేనుగుపై స్వర్ణపీఠముపై ఆసీనుడై ఉండగా ప్రభువు, ఉద్దండ పండితులు సామంతుల వలె క్రింద నడుస్తుండగా వైభవోపేతముగా పురవీథులందు ఉత్సవము జరుగుచుండెను.

ఇట్టి వైభవమునకు పరమానందభరితుడైన విష్ణుచిత్తుడు సర్వము వైష్ణవమాయయని భావించాడు. ఆ పారవశ్యములో బిగ్గరగా శ్రీమన్నారాయణ మూర్తిని గురించి మంగళము (పల్లాండు) పాడసాగెను. అతడు విష్ణుభక్తి తాదాత్మ్యతతో పాడిన ఆ మంగళపాశురములే **'తిరుపల్లాండు'** అనే దివ్యప్రబంధమయినది.



**'పల్లాండు- పల్లాండు- పల్లాయిరత్తాండు- పల కోటి నూరాయిరమ్'** అనే పదములతో ప్రారంభమైన తిరుపల్లాండు భగవంతుని అనంత కల్యాణ గుణములకు మంగళమును పలుకుచున్నది. విష్ణుచిత్తుడు తిరుపల్లాండు గానము చేసాడు. తన జీవితాన్ని భగవంతుని సేవకై అంకితమిచ్చాడు.

**'ఆళ్వార్ తిరువడిగళే శరణమ్'**

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-14

# శ్రీకృష్ణభగవద్విజయం

డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు

**బ్రహ్మదత్తుడు :** అంబికా వల్లభునిగూర్చి అయిదు సంవత్సరాలు అఖండ తపస్సు చేసి వచ్చినందుకు అమితానందంగా ఉంది నందనులారా! వరదానశీలి అయిన ఆ శూలి ఏమనుగ్రహించాడు నాయనలారా?

**హంసుడు :** భవానీపతి భక్తసులభుడు గదా తండ్రీ! దివ్య శస్త్రాస్త్రాలతో మమ్ముల ననుగ్రహించాడు.

**డిభకుడు :** దివ్యమంత్ర కవచాల ననుగ్రహించి దీవించాడు తండ్రీ!

**హంసుడు :** అంతే కాదు జనకా! అవసరమైనప్పుడు ఆహవభూమిలో అండదండగా ఉండటానికి భృంగిరిటి, కుండోదరుడు అనే ప్రమథులను స్మరించమని కూడా అనుగ్రహించాడు స్మరహరుడు హరుడు.

**పెద్దరాణి :** అనుకున్నవి సాధించిన మిమ్మల్ని చూస్తుంటే అఖండభరతఖండానికే ఏలికలైనంత ఆనందంగా ఉంది తనయులారా!

**చిన్నరాణి :** మీరాకతో సాల్వనగరానికి సకలకళలు సమకూరాయి కుమారులారా!

అంతలో మిత్రసహుడు, జనార్దనుడు ప్రవేశించారు.

**హంసుడు :** రా మిత్రమా రా!

**డిభకుడు :** రా జనార్దనా రా!

జనార్దనుడు మిత్రులను కౌగిలించుకుని, తదుపరి రాజుకు, రాణులకు నమస్కరించాడు.

**జనార్దనుడు :** మిత్రులారా! అయిదేండ్లు మీకు దూరంగా ఉన్న నాకు అయిదుకల్పాలు నడిచినట్లుంది. మీ రాకతో మనస్సు మళ్లీ కుదుటపడింది. ఇంతకూ వెళ్లిన పని యేమయింది? ఆ ఇందుమౌళి అనుగ్రహించాడా?

**హంసుడు :** అనుగ్రహించాడు జనార్దనా! అనుగ్రహించాడు. ఆ కైలాసమందిరుడు శంకరుడు దివ్యశస్త్రాస్త్రాలు ప్రసాదించి సంపూర్ణంగా అనుగ్రహించాడు.

**మిత్రసహుడు :** గంగాధరుడు కరుణారసగంగాధరుడు. ఆ స్వామికి భక్తుల విషయంలో మైమరపు మెండు.

**డిభకుడు :** మఱి నీ దీక్షావిశేషా లేమిటి జనార్దనా?

**జనార్దనుడు :** ద్వారకావాసి భక్తచిత్తనివాసి. ఆ శ్రీకృష్ణపరమాత్మ స్వయంగా మా పూజామందిరంలో ప్రత్యక్షమయ్యాడు.

**బ్రహ్మదత్తుడు :** మహాసంతోషం. వరమేమి అనుగ్రహించాడు జనార్దనా?

**జనార్దనుడు :** ఆ శ్రీకాంతుడు స్థిరభక్తిని అనుగ్రహించాడు మహారాజా!

**హంసుడు :** మిత్రమా! జనార్దనా! భక్తివల్ల భుక్తి లభించునా? శస్త్రాస్త్రాలతో సామ్రాజ్యాలు సాధించాలి గాని. అయినా ద్వారకలో ఉన్న గోపాలుడు నీ మందిరాన ప్రత్యక్షమగుట కల్ల. నీవేదో భ్రమపడి ఉంటావు.

**జనార్దనుడు :** లేదు మిత్రమా! దర్శనమే కాదు ఆస్వామి యొక్క స్పర్శనం కూడా నాకు దక్కింది. ఆ పద్మనాభుడు తన చరణాలపై వ్రాలిన మా దంపతులను స్వయంగా లేవనెత్తి లాలించాడు.

**డిభకుడు :** పశులకాపరి భగవంతుడు ఎలా అవుతాడు మిత్రమా?

**జనార్దనుడు :** తప్పు చెలికాడా! అలా అనరాదు. శిశువుల లాలననుండి పశువుల పాలనవఱకు అంతా నిర్వహించేది ఆ లక్ష్మీకాంతుడే.

**హంసుడు** : నువ్వేమైనా చెప్పు మిత్రమా! ఆ పశుపాల కుణ్ని జనపాలకుని గాను, జగత్పాలకునిగాను మేమంగీకరించం.

**మిత్రసహుడు** : యువరాజా! భగవన్నింద ఇహపరాలకు చేటు తెస్తుంది. బలరామ శ్రీకృష్ణులు బాల్యంలో చల్లు లారగించి పశువులను కాచింది పాడిపంటల ప్రాధాన్యాన్ని ప్రకటించటానికే. ఇప్పటికీ బలరాముడు నాగలి ధరించటం, శ్రీకృష్ణుడు చక్రం ధరించటం వ్యవసాయ జీవనాన్ని విడనాడరాదనీ, కృషీవలునికి అగ్రాసనమివ్వాలనీ నొక్కిచెప్పటానికే. భరతఖండం వ్యావసాయికమనే రహస్యాన్ని విస్మరించగూడదని చాటటానికే.

**బ్రహ్మదత్తుడు** : అంతే కాదు కుమారులారా! రాజులైన వారు వ్యయప్రణాళికలో వ్యవసాయానికి పెద్దపీట వేయాలని సూచించటానికే ఆ సోదరులు కృషీవల చిహ్నాలను ఆయుధాలుగా ధరించి కృషి చేస్తున్నారు.

**డిభకుడు** : మీనమ్మకాలు మీవి. మా అభిప్రాయాలు మావి.

**పెద్దరాణి** : వాదోపవాదాలకు ఇది వేదిక కాదు. నాయనలారా! త్వరగా మీరు అంతఃపురాలకు వెళ్లి మాకోడళ్లకు భూశయనవ్రతదీక్ష విరమింపజేసి వేడుక కలిగించండి!

**చిన్నరాణి** : చకోరాల్లాగా మీ రాకకోసం వాళ్లు ఎదురు చూస్తున్నారు. వెళ్లి లాలించండి!

**హంసుడు** : అలాగే నమ్మా! వస్తాం మిత్రమా!

**డిభకుడు** : మళ్లీ కలుసుకుందాం జనార్దనా!

**జనార్దనుడు** : తప్పక.

హంసడిభకులు గంభీరంగా నడుస్తూ చెరొక వైపు తమ మందిరాలకు వెళ్లారు. కన్నబిడ్డలు వెళ్లిన వైపు కన్నవాళ్లు కన్నార్పకుండా చూస్తున్నారు. మిత్రులరాకతో జనార్దనుని చిత్తంలో నవోత్తేజం మొలకెత్తింది.

*(ఇంకా ఉంది)*

విశ్వదాభిరామం


## ఉప్పు - కర్పూరం

వేమన పద్యసూక్తి

**ఉప్పుకప్పురంబు నొక్కపోలిక నుండు;**
**చూడ చూడ రుచులజాడ వేరు;**
**పురుషులందు పుణ్యపురుషులు వేరయా!**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థము:** పోలిక= విధము; రుచులజాడ= రుచులవిధము; పుణ్యపురుషులు= పుణ్యాత్ములు.

**భావం:** ఉప్పు, కర్పూరం చూడటానికి ఒక్కలాగే ఉంటాయి. కాని రెండింటి రుచులలో తేడా ఉంటుంది. అలాగే మనుషులందరూ ఒక్కలాగే కనిపిస్తారు. కాని వారి వారి నడతల్లో, నడకల్లో తేడాలు స్పష్టంగా గోచరిస్తాయి. అప్పుడు తెలుస్తుంది వాళ్లు ఉత్తమపురుషులా, ఉత్తపురుషులా అని. కొందరు కేవలం తమ కోసం మాత్రమే బతుకుతూ ఉంటారు. కొందరు ఇతరులకు మేలు చేస్తూ లోకోపకారకంగా జీవిస్తారు. ఇటువంటి వారిని లోకం మరిచిపోదు. వారే ఉత్తములు.



**వివరణ:** ఉప్పు కర్పూరం పైకి ఒకే మాదిరిగా కన్పిస్తాయి. కాని పరిశీలిస్తే వాటిలోపలిగుణాలు వేరు. కర్పూరం పూజలవంటి ఉత్తమకార్యాలలో వినియోగింపబడుతుంది. ఔషధంగా అనేకబాధలు తీరుస్తుంది. సముద్రంనుంచి ఉప్పు సులువుగా ధారాళంగా లభిస్తుంది. కర్పూరం అరుదుగా దొరుకుతుంది. లోకంలో విలువ ఎక్కువ. మానవులలో ఉత్తములు కూడా అంతే.

– విద్వాన్ కట్టా నరసింహులు



# సందేహాలు - సమాధానాలు

ఆచార్య శివపురం మురళీధరరావు

**1) వేదవ్యాసుని 'అపాంతరతముడి'గా పిలుస్తారు? ఆ మాటకి అర్థం ఏమిటి?**

**- వెంకటరత్నం, గుంటూరు.**

'అంతరతమము' అంటే 'లోపల ఉన్న చీకటి' (అజ్ఞానం) అని అర్థం. ఆ చీకటిని తొలగించేవాడు 'అపాంతరతముడు'. అంటే అజ్ఞానాన్ని పారద్రోలేవాడు. వ్యాసుల వారు మనకు గురువు. వేదాలను, పురాణాలను, మహాభారతాన్నీ, బ్రహ్మసూత్రాలను మనకు అందించి, 'అజ్ఞానాన్ని' నాశనం చేయడానికి కావలసిన జ్ఞానసంపదను అందించాడు. అందుకే వారికి 'అపాంతరతముడు' అన్న పేరు సార్థకమైంది.

**2) మనకు ఏర్పడిన 'సంచిత, ప్రారబ్ధ, ఆగామికర్మలు' ఏ విధంగా తొలగుతుంది?**

**- రామ్‌కుమార్, హైదరాబాద్.**

అనేక జన్మలలో చేసిన పాపపుణ్యకర్మఫలాలే 'సంచితాలు'. అందులో ఈ జన్మానుభవానికి తెచ్చుకున్నది 'ప్రారబ్ధం'. పోతే-వర్తమాన అంటే ఈ జన్మలో చరించే కర్మఫలం 'ఆగామి'. ఇవి ఎలా తొలగుతాయంటే- అనుభవం వల్ల 'ప్రారబ్ధకర్మ' పోతుంది. ఎటువంటి ఫలాన్ని అపేక్షించకుండా అన్నీ కృష్ణార్పణంగా చేసే మంచి పనుల వల్ల 'సంచితకర్మ' తొలగిపోతుంది. 'ఆగామి' అనే కర్మ ఏర్పడదు. ఈ విధంగా మూడు కర్మలూ తొలగిపోతాయి.

**3) ఇటీవలికాలంలో కరోనా మహమ్మారి వలన 'వైద్యో నారాయణోహరిః' అన్న మాట ఎక్కువగా వినబడుతోంది. శ్లోకాన్ని పూర్తిగా తెలియజేయండి?**

**- శారద, హైదరాబాద్.**

శరీరే జర్జరీ భూతే వ్యాధిగ్రస్తే కళేబరే।
ఔషధం జాహ్నవీ తోయం వైద్యోనారాయణోహరిః॥

- అన్న శ్లోకం మనకు అనూచానంగా వస్తున్నది. క్రుంగి కృశించే లక్షణంగల, వ్యాధిగ్రస్తమైన ఈ శరీరానికి నిజమైన ఔషధం గంగాజలం, వైద్యుడు, నారాయణుడైన శ్రీహరియే. అంటే శరీరాన్ని పొందిన జీవుడు తనలోని జన్మజన్మలలో ఏర్పడిన పాపరాశిని శుద్ధిచేసుకోవడం ముఖ్యమైన కర్తవ్యం. అందుకు పవిత్రగంగా జలపానం, శ్రీహరిస్మరణ ముఖ్యం. పైగా గంగాస్మరణ, నారాయణస్మరణ మహిమాన్వితం, శక్తివంతమైనది.

ఈ శ్లోకం చదివినవారికి వైద్యుని లోపల ఉన్న 'ప్రతిభా'రూపమైన నారాయణశక్తి అనుకూలించి శ్రీహరి వైద్యుని సరియైన స్ఫురణతో ప్రేరేపిస్తాడు. వైద్యునిలోని వైద్యశక్తి సాక్షాత్తు శ్రీహరి రూపమే కదా! హరిస్మరణతో వ్యాధిగ్రస్తులను బాగుచేసేలా ప్రేరేపింపబడుతుంది.

అట్లే, గంగా స్మరణతో ఔషధం పవిత్రమై, ప్రభావశాలి అవుతుంది. అందుకే పరంపరాగతంగా వస్తున్న ఈ శ్లోకం ఎల్లరూ పఠించవలసిందే! పైగా పరానికి, ఇహానికి పనికి వచ్చే ప్రయోజనాలను కూడ కల్పిస్తుంది ఈ శ్లోకం.

**4) నామస్మరణ చేస్తే చాలు కదా? ఇతర మంత్రాలు, ఆచారాలు ధర్మాలు ఎందుకు? పురాణాల్లో ఈ విషయమే చెప్పారు కదా?** **- వెంకటకృష్ణ, తిరుపతి.**

నామస్మరణ చేస్తే చాలు. కాని ధర్మం ఆచారం విడిచిపెట్టకూడదు. శక్తివంచన లేకుండా ధర్మాచరణ చేస్తూ నామస్మరణ చేయాలి. నామస్మరణ ప్రాధాన్యం, భక్తిమార్గాలలో కూడా చెప్పబడింది. ఈ నామాలను జపతపాదులతో ఆచరించవచ్చు. 'రామ' నామస్మరణతో ముక్తి పొంది చిరంజీవి అయిన హనుమ లోకవిదితమే. నియమబద్ధ జీవనాన్ని సాగిస్తూ పరోపకార జీవనయానం చేస్తూ దైవనామస్మరణ చేసే భక్తులకు దైవం సదా తోడుగా ఉంటుంది.

## భగవద్గీత-యువత

# ఆసురీ లక్షణాలు బంధాన్ని కలుగజేస్తాయి

డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాసు

బంధము, మోక్షము అనే రెండు పదాలు ఆధ్యాత్మిక రంగంలో తరచుగా వినిపిస్తూ ఉంటాయి. అయితే ఈ పరిస్థితులు భౌతికజగత్తులో, అంటే సామాన్య జీవితంలో కనిపిస్తున్నా వాటిని గురించి ఎవ్వరూ ఎక్కువగా చెప్పుకోరు. అసలు బంధమోక్షాలు అంటే ఏమిటి? దొంగతనము, నేరము, హత్యవంటి ఎన్నెన్నో పనులకు కొందరిని పోలీసులు బంధిస్తూ ఉంటారు. వారి చేతులకు బేడీలు వేయడం, వారిని కోర్టులో హాజరు పరచడం, శిక్షను బట్టి జైలులో పెట్టడంవంటివి చేస్తారు. ఈ ఉదాహరణలు బంధానికి చక్కగా సరిపోతాయి.

అంటే, బంధంలో ఉన్న వ్యక్తి సామాన్యపౌరునిగా తిరగలేడు. స్వాతంత్ర్యాన్ని అనుభవించలేడు. తనవారితో కలిసి సుఖసంతోషాలతో ఉండలేడు, సుఖంగా నిద్రపోలేడు. ఇవే బంధం వలన కలిగే దుష్పరిణామాలు. ఇక మోక్షం గురించి ఆలోచిద్దాము. ప్రస్తుతం ప్రపంచమంతటా వ్యాపించియున్న మహమ్మారి 'కరొనా' వైరస్ బారిన పడ్డ వ్యక్తిని ఆసుపత్రిలో చేర్చి వైద్యం చేస్తున్నారు. భగవదనుగ్రహం వలన భారతదేశంలో ఆ వైరస్ నుండి బయటపడ్డ వాళ్ళే చాలామంది ఉన్నారు.

భారతదేశంలో ఇతర దేశాలతో పోలిస్తే ఆ రోగం నుండి విముక్తులైన వారి శాతము ఎక్కువగానే ఉంది. అంటే ఎవడైతే డాక్టరు మాట వింటూ తగిన రీతిలో వైద్యం చేసుకొంటాడో, పథ్యం చేస్తాడో వాడు రోగవిముక్తుడౌతాడు. అంటే రోగం నుండి మోక్షం పొందుతున్నాడు.

ఈ రకంగా బంధము, మోక్షము గురించి వివరాలు తెలుసుకున్న తరువాత నిజమైన బంధమోక్షాల గురించి ఆలోచించడము విజ్ఞుల లక్షణం. ఆ విషయం గురించే భగవద్గీత స్పష్టంగా పదహారవ అధ్యాయంలో వివరించింది. ఆసురీ లక్షణాలు బంధాన్ని కలుగజేస్తాయని గీతాచార్యుడు తెలియజేసాడు. అంటే ఆసురీగుణాలను కలిగి ఉంటే బంధం తప్పదని, బంధము కలిగితే దుఃఖాలు తప్పనిసరియని మనము అర్థం చేసికోవాల్సి ఉంటుంది. ఇంతకూ ఆసురీ గుణాలు ఎలా ఉంటాయనే ప్రశ్న వస్తుంది. దానికి సమాధానంగా భగవద్గీతలో (16.4) ఇలా చెప్పబడింది:

'ఓ పార్థా! గర్వము, పొగరు, అహంభావము, కోపము, పరుషత్వము, అజ్ఞానము అనే గుణాలన్నీ అసుర స్వభావము కలవారికి చెందినవి'.

'దైవీగుణాలు ముక్తికి కారణమైతే అసుర లక్షణాలు బంధమును కలుగజేస్తాయి. ఓ పాండుతనయా! నీవు దైవీ గుణాలతోనే జన్మించావు కనుక విచారించకు'.

ఆసురీగుణాలు నేరుగా మనిషిని నరకానికి చేరుస్తాయి. ఆ నరకం వాళ్ళకు ఈ జన్మలోనే కనిపిస్తుంది, కాగా ఈ జన్మ తరువాత వాళ్ళు వెళ్ళేది నిశ్చయంగా నరకానికే. ఎవరైతే తనకు ఉన్నట్టి చదువు, ధనము, సంపద, పరపతి, పదవి, జనబలము వీటిని చూసుకొని విచ్చలవిడి



తనాన్ని ప్రదర్శిస్తారో అదే గర్వము. ఇవన్నీ కూడ సాధారణంగా మనిషికి గర్వాన్నే కలిగిస్తాయి. ఇవన్నీ ఉన్నా కూడ వినమ్రంగా ఉండేవాడు భగవంతుని ప్రత్యేక కరుణను పొందినవాడే అయి ఉంటాడు.

ఈ గర్వము వలన అతడు పొగరుగా వ్యవహరిస్తాడు. నోటికి ఏది వస్తే అది పలకడం, చిన్నా పెద్దా వ్యత్యాసం లేకుండ వ్యవహరించడమే పొగరు. తనకు అడ్డే లేనట్లుగా చేసే వ్యవహారమే పొగరుబోతు వ్యవహారము. అటువంటివారికి ఎవరైనా ఎదురు తిరిగితే లేదా తగినంత గౌరవం ఇవ్వకపోతే వారి అహంభావము దెబ్బ తింటుంది. ఆసురీ స్వభావులు ప్రదర్శించే మరొక దుర్గుణమే అహంభావము.

అందుకే తమ అహంభావము దెబ్బతినగానే వారికి కోపం వస్తుంది, దాని వలన వారు పరుషంగా మాట్లాడతారు, పరుషంగా వ్యవహరిస్తారు. ఆ సమయంలో పెద్దా చిన్నా అనే విచక్షణ లేకుండ వారు అజ్ఞానంతో వ్యవహరిస్తారు. ఈ లక్షణాలు ఎవ్వరికైనా, ఏనాటికైనా, ఏదో ఒక పరిస్థితిలో కష్టాన్నే కలిగిస్తాయి, బంధాన్నే కలిగిస్తాయి. అంతేకాదు వారు నరకగాములే అవుతారు.

అందుకే యువత ఈ ఆసురీలక్షణాల నుండి బయటపడాలి. జీవితంలో విజయాలను సాధిస్తే ఆ విజయాలకు కారణమైనవారి ప్రోత్సాహాన్ని, సహాయాన్ని తలచుకొని వినమ్రులుగా ఉండడం నేర్చుకోవాలి.

అటువంటి స్వభావము మరిన్ని విజయాలకు కారణమౌతుంది. వినమ్రంగా ఉండేవారు ఏనాడు పొగరుగా వ్యవహరించరు. విద్యతో పాటుగా వినయం కలవాడిని లోకం ఎంతో మెచ్చుకుంటుంది. కోపం వలన ఒరిగేది ఏదీ ఉండదు. పైగా అది పరిస్థితులను పాడు చేస్తుంది, సంబంధాలను చెరుస్తుంది. 'నోరు మంచిదైతే ఊరు మంచిదే'నన్న సామెత అందరికీ తెలిసిందే. పరుషంగా లేకుండ వినమ్రంగా మాట్లాడేవాడికి లోకమంతా మర్యాద ఇస్తుంది.

కాబట్టి గీతా శ్లోకంలో చెప్పిన అసుర గుణాలన్నింటినీ ఒక్కొక్కటిగా తొలగించుకునే యువత నిశ్చయంగా విజయసీమలలోనే నడుస్తుంది. వారికి సర్వత్ర అభినందనలు, ఆహ్వానాలు, ఆతిథ్యాలు అన్ని లభిస్తాయి. అలా కాకుండ వారు పైన చెప్పిన అసుర గుణాలనే కలిగి ఉంటే బంధం తప్పదు, దుఃఖం తప్పదు, నరక క్లేశాలు తప్పవు, తస్మాత్ జాగ్రత్త!

## శ్రీకల్యాణశ్రీనివాసుని సాక్షాత్కారము

**ఏడుకొండల వేంకటేశుడు పద్మావతీదేవితో పరిణయం తర్వాత శ్రీనివాసమంగాపురంలో కొంతకాలం విడిది చేసాడని పురాణాల కథనం. ఇక్కడి శ్రీవేంకటేశ్వరాలయం సువిశాలమైనది. ఇక్కడి దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహం తిరుమల ఆలయంలోని విగ్రహంకంటే ఎత్తుగా మనకు అన్పిస్తుంది. ఈ ఆలయం నిర్మితమైన కాలానికి సంబంధించి చారిత్రక ఆధారాలు లేవు. పదకవితాపితామహుడు అన్నమయ్య మనుమడైన తాళ్లపాక చిన్నతిరుమలాచార్యుడు 16వ శతాబ్దంలో ఆలయ పునఃప్రతిష్ఠ జరిపినట్లు శాసనాల ద్వారా తెలుస్తున్నది. 1967 నుంచి ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం స్వాధీనం చేసుకుంది. జ్యేష్ఠమాసంలో మూడు రోజుల పాటు ఏటా సాక్షాత్కార వైభవోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి మొదటిరోజు సాయంత్రం తిరుచ్చివాహనం, రెండవరోజు హనుమద్వాహనం, మూడవరోజు గరుడోత్సవం జరుగుతుంది.**



*గత సంచిక తరువాయి భాగం.....*

గురువుగారు వేస్తున్న శిక్షలకు ఎదిరించి మాట్లాడ లేక, తనకు పడే శిక్షలను తప్పించే నాథుడు కనపడక కన్నీరు కారుస్తూ బాధపడేవాడు. చివరకు తీవ్ర నిరాశకు గురయ్యి ఊటుకూరు గ్రామదేవతైన చింతలమ్మ గుడిలో పుట్ట ఉన్నదనీ, అందులో త్రాచుపాము ఉన్నదనీ, ఊరి వారు ఆశ్చర్యంగా చెప్పుకుంటుంటే విని, ఆ పుట్టలో చేయి పెట్టి ప్రాణం త్యాగం చేద్దామని నిశ్చయించుకున్నాడు నారా యణుడు. ఆవేశంగా అనుకున్నదే తడవుగా ఆ చింతలమ్మ తల్లి ఆలయప్రవేశం చేసి, పుట్టలో చేయి పెట్టాడు. సర్వకాల సర్వావస్థలను ఎఱిగిన ఆ తల్లి బాలకుని చూసి చలించి పోయింది. మానవరూపంలో ప్రత్యక్షమై అతడిని వారిం చింది. పాము కాటు వేసి ఉంటే తాళ్లపాక వంశం అక్కడితో ఆగిపోయి ఇంతటి సంగీత సాహిత్యయజ్ఞం జరిగి ఉండేదా? సుప్రభాత సేవ నుండి పవళింపుసేవ వరకు సాగే గాన కైంకర్యభోగం శ్రీనివాసుడికి దక్కేదా? 32 వేల సంకీర్తనా సౌభాగ్యం తెలుగు వారికి దక్కేదా? సుమారుగా అయిదు తరాల సాహిత్య వారసత్వం నిలబడేదా? అందుకే భూతభవిష్యద్వర్తమానాలు తెలిసిన తల్లి చింత లమ్మ ఆ నారాయణుడిని వారించింది. ఎందుకు వచ్చాడో, అతని మనోగతమేమిటో తెలుసు కుని, 'నాయన! విచారించకు. సకల విద్యలకూ అధిదేవత అయిన సరస్వతీదేవి మామగారు కేశవ నామాన్ని ధరించి తాళ్లపాకలో కొలువై ఉన్నాడు. తామరసాప్త నయనుడైన ఆ శ్రీహరి ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేసి ఆయనను భక్తితో వేడుకో నీ మనోభీష్టం సిద్ధించగలదని చెప్పడమే కాకుండా...

**అదియునుఁగాక మూఁడవ తరంబునను**
**వదలని కీర్తి మీ వంశంబు నందు**
**పరమ భాగవతుఁడు ప్రభవించు శౌరి**
**వరమున జగదేక వల్లభుండగుచు;**
**(అన్నమాచార్య చరిత్ర ద్విపద, పుట. 86, 87)**

నీ వంశంలో నీ నుండి మూడవ తరంలో శాశ్వత యశస్వి, గొప్పభక్తుడు, లోకాలకు ప్రీతిని కలిగించేవాడు ఆ వైకుంఠుని వరప్రభావంతో జన్మించగలడని వరమిచ్చి అంత ర్ధానమయ్యింది.

ఆ వెంటనే నారాయణుడు తాళ్లపాక గ్రామానికి వెళ్ళి కోటి సూర్యకాంతులతో వెలుగులీనుతున్న ఆ కేశవ స్వామిని దర్శించుకొన్నాడు. ఆ స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, తనకు విద్యను ప్రసాదించమని 'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణంమమ' అంటూ శరణుకోరాడు.

భక్తులు అడగడమే ఆలస్యం, వెంటనే కొండలంత వరాలను గుప్పించే ఆ కోనేటిరాయడు తన వర ప్రభావంతో జన్మించిన కారణజన్ములను తరింపచేయకుండా ఉంటాడా? అడిగిందే తడవుగా 'తథాస్తు' అని దీవించాడు. తత్ఫలితంగా ఆ చదువుల తల్లి, హాటకగర్భురాణి, కైటభదైత్యమర్దనుని గాదిలి కోడలు అయిన సరస్వతీదేవి నారాయణుడి జిహ్వపై కొలువుతీరింది. కేవలం నారాయణుడినే కాదు తాళ్లపాక



వంశాన్నే కటాక్షించింది. కేశవస్వామి కరుణతో, ఆ సరస్వతీ దేవి కృపతో నారాయణుడికి విద్యాకౌశలమబ్బింది. అది మొదలుగా తనకు గురువుగారు బోధించే ప్రతీపాఠమూ నేర్చుకునేవాడు. క్రమ, శిఖా, జటా పాఠాలను ఎటువంటి తడబాటు లేకుండా ఒప్పజెప్పేవాడు. తన తోటి విద్యార్థులు, గురువు, శాస్త్రం తెలిసినవారూ అందరూ ఆశ్చర్యచకితులయ్యే విధంగా విద్యను ఆర్జించేవాడు. అలా విద్యార్జన గరపి, అందరి మెప్పులకు పాత్రుడయ్యి, సర్వజ్ఞుడనిపించుకొని తాళ్లపాకకు చేరుకున్నాడు.

## నారాయణసూరి

అంతటి సర్వజ్ఞ నామధేయాన్ని పొందిన నారాయణుడికి నారాయణసూరి అనే బిడ్డడు జన్మించాడు. ఈతను తండ్రిలాగే అన్ని విద్యలలో ఆరితేరి ప్రజలచేత 'సూరి' అనిపించుకున్నాడు. సూరి అంటే పండితుడు. నారాయణసూరి భార్య పేరు లక్కమాంబ. లక్కమాంబ భర్త మనసెరిగిన ఇల్లాలు. సాధ్వీమణి, పరమభక్తురాలు. తాళ్లపాకకు కూతవేటు దూరంలో ఉండే మాడుపూరులోని మాధవమూర్తి (అర్చావతారం) ఈవిడ పిలిస్తే పలుకుతాడని ప్రతీతి. ఈ పుణ్యదంపతుల దాంపత్యం లోకానికి ఆదర్శప్రాయంగా సాగుతోంది. ఆ పుణ్యదంపతులు ఒకనాడు తమకు పున్నామ నరకం నుండి కాపాడే, వంశోద్ధారకుడైన పుత్రుడు కావాలని తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి శరణు జొచ్చారు. తిరుమలకు వెళ్ళి గరుడ స్తంభం దగ్గర నిలుచుకొని 'కులముద్ధరించు తనయుణ్ణి' ఇవ్వమని స్వామిని వేడుకున్నారు.

"అడిగిన యపుడె యిష్టార్థంబు లెల్ల। నెడపక చేసేత నియనోపు వేల్పు" (అన్నమాచార్య చరిత్ర ద్విపద, పుట. 100) అయిన శ్రీవేంకటాచలపతి ఆ రోజున వారికి స్వప్నమున సాక్షాత్కరించి **'నందకాన్ని'** బహుమతిగా ఇచ్చాడు. అంతే ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు. కోటి జన్మలెత్తినా సాధ్యంకాని విష్ణుదర్శనం, యుగయుగాలు తపస్సు చేసినా లభించని స్వామి సందర్శనం, భక్త ప్రహ్లాదుడు, ధ్రువుడు, అంబరీషాదులకే సాధ్యమయిన శ్రీహరి నిజదర్శనభాగ్యం ఆ రోజు వారికి స్వప్నరూపంలో లభించింది. దంపతులలో కేవలం ఎవరికో ఒకరికి మాత్రమే స్వప్నసాక్షాత్కారం లభిస్తే అది యాదృచ్ఛికం. కానీ ఇరువురికీ ఒకే స్వప్నం వస్తే అది దైవసంకల్పం. అంతే తమ కల నెరవేరిందనే ఆనందం, తమ తపస్సు ఫలించిందనే సంతోషంతో తమ గ్రామం చేరుకున్నారు.


## అన్నమయ్య జననం

శ్రీవేంకటేశ్వర స్వామివారి అనుగ్రహ విశేషం చేత ఆ పుణ్యదంపతులైన నారాయణసూరి, లక్కమాంబలకు వైశాఖమాసం, విశాఖా నక్షత్రయుక్త శుభముహూర్తాన, మేలు కలిగించే మూడు గ్రహాలూ ఉచ్చస్థితిలో ఉండగా రాజీవనయను వరప్రసాదమున శక్తి మునికి పరాశరుడు జన్మించినట్లుగా శ్రీహరి ఖడ్గమైన **'నందకం'** అంశతో **అన్నమాచార్యుడు** ఉదయించాడు.

శ్రీ వేంకటేశ్వరుని వరప్రభావ సంజనితుడైన ఆ బిడ్డడికి జాతశౌచస్మార్తాది కర్మలను శాస్త్రోక్తంగా చేయించాడు నారాయణసూరి. ఆ బిడ్డడికి భగవంతుడైన విష్ణువు ఆజ్ఞాపించిన విధంగా, బ్రహ్మకు మరో పేరైన 'అన్నం' అనే పదం వచ్చేలా అన్నమయ్య అని నామకరణం చేశాడు.

లేక లేక కలిగిన బిడ్డ కావడం, పైగా శ్రీహరి వరప్రసాదం కావడం చేత ఆ బిడ్డను ఆ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. అన్నమయ్య, అన్నప్పా, అన్నమాచార్యా, అన్నయ్యా, అన్నా అని రకరకాలుగా పిలుచుకుంటూ, ప్రేమ అతిశయించగా ముద్దులాడుతుండేవారు.

*(ఇంకా ఉంది)*



# నమ్మాళ్వారు-తిరుమల

- శ్రీ సుధన్వన్

**వృషభే తు విశాఖాయాం కురుకాపురి కారిజమ్।**
**పాండ్య దేశే కలేరావౌ శఠారిం సైన్యపం భజే।।**

పన్నిద్దరు ఆళ్వారులలో ప్రధానమైన ఆళ్వారులుగా కీర్తించబడేవారు 'నమ్మాళ్వార్లు'. **శఠగోపుడు, వకుళాభరణుడు, పరాంకుశుడు** అని వీరికి అనేక నామాంతరములు కలవు. పాండ్యదేశమున కురుకాపురి అనబడే 'ఆళ్వారు తిరునగరి'లో కలియుగారంభంలో **విష్వక్సేనాంశ**గా అవతరించారు. తమిళపంచాంగం ప్రకారం వైశాఖ విశాఖం, సంస్కృతం ప్రకారం, వృషభమాసం, విశాఖం, ఆళ్వార్ల తిరునక్షత్రం.

చింతచెట్టు తొఱ్ఱ నుండియే సమస్త దివ్యదేశాలను, భగవంతులను తన దివ్యజ్ఞానదృష్టితో సాక్షాత్కరించుకొని ఆ దేవదేవుల యొక్క స్వరూపరూప గుణవైభవాలను తనివితీరా అనుభవించి, తదనుభవ పరీవాహంగా చతుర్వేదసార భూతములైన నాలుగు దివ్యప్రబంధాలను అనుగ్రహించడం



జరిగింది. ఋగ్వేదసారభూతమైన **'తిరువిరుత్తం'**, యజుర్వేదసారభూతమైన **'తిరువాశిరియం'**, సామవేదసారభూతమైన **'తిరువాయ్‌మొళి'**, అథర్వవేదసారభూతమైన **'పెరియ తిరువందాది'** అని తెలియజేస్తారు.

శ్రీమన్నారాయణ పరతత్త్వాన్ని సప్రమాణంగా తమ దివ్యప్రబంధముల ద్వారా నిరూపించినవారు నమ్మాళ్వార్లు.

## ప్రకృతవిషయము- తిరుమల క్షేత్రప్రాశస్త్యం

వీరు శ్రీవేంకటాచల వైభవాన్ని శ్రీవేంకటేశుని మాహాత్మ్యాన్ని అత్యద్భుతంగా తమ ప్రబంధాలలో కొనియాడారు. అందులో **తిరువాయ్‌మొళి** అనే దివ్యప్రబంధంలో 3వ శతకంలో 3వ దశకంలో **'ఒళివిల్ కాలమెల్లామ్ ఉడనాయ్‌మన్నా'** అని 11 పాశురముల ద్వారా తిరుమల వాస వైభవాన్ని కీర్తించిన విధానాన్ని మనమొకమారు కీర్తించుకుందాము.

### మొదటిపాశురంలో...

ప్రకృతి రామణీయకతతో తిరుమల క్షేత్రం శోభాయమానంగా ఉన్నది. గలగలమని ప్రవహించే సెలయేళ్లు గల తిరుమలలో 'శ్రీవైకుంఠవిరక్తాయ' అన్న రీతిగా తనకు తానుగానే వచ్చి వేంచేసి ఉండేవాడు, సుందరమైన దివ్య మంగళ విగ్రహం కలవాడు, అయిన శ్రీవేంకటేశునికి మనం సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలయందు నిరవధిక కైంకర్యాలను చేసి తరించాలి. రండి భక్తులారా! తిరుమలకు రండి. అందరూ భగవత్ కైంకర్యాన్ని పొందాలని ప్రతివారికి కూడా ఆ కైంకర్యప్రాప్తి కలగాలని కోరుతున్నటువంటి నమ్మాళ్వార్ల విశాల హృదయానికి మనమొకమారు నమస్కరించాలి.

### రెండవపాశురంలో...

పరమపదం కదా ప్రాప్యం. మరి తిరుమలకు ఎందుకు పిలుస్తున్నారు ఈ ఆళ్వార్లు అనే సందేహానికి సమాధానంగా నిత్యసూరులు సైతం పరమపరనాథునే వేంకటపతిగా వేంకటాచలంలో కొలువు తీరియున్నాడని తిరుమలకు వచ్చి కైంకర్యం చేయుచున్నారని తెలియ చేస్తున్నారు. నిరవధిక కీర్తి సంపన్నుడు, నల్లని మేఘం వలె ప్రకాశించువాడు, నిత్యసూరి నాయకుడు, తమ తాతముత్తాతలకు స్వామి అయినవాడు, తన కల్యాణగుణాలతో తనను

తన దాసులకు దాసునిగా చేసినవాడు, నిరంతరం పుష్ప సంపద వికాసంతో శోభిల్లే తిరుమలలో వేంచేసి ఉన్న ఆ స్వామికి అనుదినం కైంకర్యం చేయడమే మనకు ప్రాప్యం. అందుకోసం భక్తులారా! తిరుమలకు రండి! క్షేత్రవాసం చేయండి. క్షేత్రాధీశుని సేవించండి. 'తిరుమల వాసునికి కైంకర్యం చేయండి' అని ఎలుగెత్తి ఆళ్వార్లు పిలుస్తున్నారు. **'తిరుమల పుష్పమండపం'** అని ఈ పాశురంలో తెలియ చేయబడుతున్నది.

**మూడవపాశురంలో...**

శ్రీవేంకటేశుని సౌలభ్యగుణం తెలియచేయబడు చున్నది. పరమోదారుడు పరమపరనాథుడు. భక్తాను గ్రహార్థం కలియుగ ప్రత్యక్షదైవంగా వేంచేసియున్న స్థానం తిరుమల.

**నాల్గవపాశురంలో...**

శ్రీవేంకటేశుని వాత్సల్యగుణ ప్రతిపాదకమైన పాశురమని, ఆత్మగుణాలు లేని వాడు, పరమనీచుడైన తనను కరుణించుటకై తిరుమలలో వేంచేసి ఉన్న తిరుమలేశుని వాత్సల్యగుణాన్ని ఏమని చెప్పగలను అని తాదాత్మ్యం చెందాడు.

**ఐదవపాశురంలో...**

తిరుమలవాసుని ఔదార్యగుణ ప్రకటిత పాశుర మిది. వేదసంపన్నులచేత కీర్తించబడే శ్రీనివాసుడు నీచుడనైన తాను చేసే కైంకర్యాన్ని స్వీకరిస్తున్నాడంటే ఎంత ఉదారగుణ పరిపూర్ణుడో అని శ్రీవేంకటేశుని ప్రశంసించాడు.

**ఆరవపాశురంలో...**

నిరాటంక కైంకర్యానికి ఏది ఉపాయం అని తెలియజేసే పాశురమిది. 'నమః' అని ఉచ్చరించడమే పరమ సులభమైన ఉపాయం. తావన్మాత్రం చేతనే శ్రీనివాసుడు మన సమస్తపాపాలను సమూలంగా పోగొట్టును. అని నిరంతరం నమ్మి స్వయంగా ఆచరించి అందించి అభినంద నలు పొందారు.

**ఏడవపాశురంలో...**

ఉత్తమలాభప్రాప్తి శ్రీవేంకటేశుని ఆశ్రయించడం చేతనా? లేక వేంకటాచలాన్ని ఆశ్రయిస్తే చాలునా? అనే సందేహం కలిగినపుడు మనకు ఉత్తమఫలప్రాప్తి వేంకటా చలాన్ని ఆశ్రయిస్తే చాలు. 'వేంకటమ'నే ఈ పర్వతం సమస్త పాపాలను పోగొట్టి, సమస్తఐశ్వర్యాలను అభీష్టాలను సిద్ధింప చేస్తుంది. కనుకనే నిత్యసూరులు, యక్ష, గంధర్వ, కిన్నర, కింపురుషాదులు వేంకటాచలానికి వచ్చి కైంకర్యం చేస్తు న్నారు. చేసుకుంటూనే ఉన్నారు.

**ఎనిమిదవపాశురంలో...**

శ్రీవేంకటాచలం శ్రీమన్నారాయణునికి పరమప్రీతి పాత్రమైనది. గోవర్ధనగిరిధరుడు, త్రివిక్రమావతారస్వీకర్త, పరమపురుషుడు, పరమపదాన్ని పరిత్యజించి ఎంతో ఆదరంతో నిత్యనివాసం చేస్తున్న తిరుమల మనకు పరమ ప్రాప్యం. వేరొక ఫలాన్ని మనం ఆశించనక్కర్లేదు. 'ప్రపద్యే తం గిరిం' అని శ్రీదేశికుల శ్లోకానుసంధానం ఇక్కడ స్మరణీ యం. తిరుమలవాసాన్ని కోరడం మన ప్రధాన కర్తవ్యం.

**తొమ్మిదవపాశురంలో...**

తిరుమల సంబంధం వల్లనే భగవద్మహిమ ప్రకా శిస్తున్నది. గోవిందుడు శ్రీనివాసమూర్తిగా పూజలందు కోవడం, సకలజనుల చేత కీర్తించబడడమనేవి వేంకటాచల వాసం చేతనే సాధ్యం అవుతుంది.

**పదవపాశురంలో...**

పరమప్రాప్యం, భోగం తిరుమలనే అని విశ్వసి స్తారు.

ఆయుష్షు పూర్తయ్యేలోపు, వార్ధక్యం రాకమునుపే తిరుమల క్షేత్రానికి వెళ్లండి. శ్రీవేంకటేశుని ఆశ్రయించి తరించండి. భక్తులందరిని దర్శించమని తెలియచేయండి.

**ఫలశ్రుతి పదకొండవ పాశురం...**

భూలోకవాసులు సేవించే విధంగా తిరుమలలో వేంచేసి ఉన్న శ్రీవారిని దర్శిస్తే, తిరుమల నివాసం అనే మహాసంపదను పొందిసుఖంగా ఉజ్జీవించగలరు అని నమ్మా ళ్వార్ల ప్రార్థన. సర్వదా అనుసరణీయం ఆచరణీయం.

కనుక, తిరుమల సంకీర్తన, స్మరణ, భజన, వాసాదులు నవభక్తి సహితంగా సర్వమంగళకరములు అని ఈ దశకం యొక్క సారాంశం.

**'ఆళ్వార్ తిరువడిగళే శరణమ్'**



# పుష్పార్చన

శ్రీ పీసాపాటి నాగేశ్వరశర్మ

**అహింసా ప్రథమంపుష్పం, పుష్పమింద్రియనిగ్రహః**
**సర్వభూత దయాపుష్పం, క్షమాపుష్పం విశేషతః।**
**శాంతిపుష్పం, తపఃపుష్పం, ధ్యానపుష్పం తథైవ చ**
**సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్॥**

అహింస, ఇంద్రియనిగ్రహం, సర్వభూతదయ, క్షమ, శాంతి, తపస్సు, ధ్యానం, సత్యం అనే ఎనిమిది పుష్పాలు తనకు అత్యంత ప్రీతికరమని సాక్షాత్తు శ్రీవిష్ణు భగవానుడు పేర్కొన్నాడు.

సాధారణంగా ఆధ్యాత్మిక ఆసక్తి కలవాళ్లు పుష్పాలతో భగవంతుణ్ణి పూజిస్తారు. తెలియక చేసినదానికి పాపమంటకపోయిన, మనం చేసే పుణ్యకార్యాన్ని తెలుసుకొని చేయటం ద్వారా ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చు. తెలిసి ఆచరించిన పూజలు గొప్ప ఫలితాన్ని ఇస్తాయని పెద్దలు చెప్తారు.

గణేశునికి ఎర్రని పూలంటే ప్రీతి. సంకటాలు తొలగడానికి గరికతో పూజిస్తే మంచిది. వినాయకచవితి నాడు తప్ప మరెవరు తులసితో ఆయనను పూజించరాదు.

సరస్వతీమాతకు తెల్లనిపూలు జాజిమల్లెలు ఇష్టం. ఆ తల్లిని **'యా కుందేందు తుషారహారధవళా'** అని స్తుతించటం గమనించవచ్చు. లక్ష్మీ అమ్మవారికీ ఈ పూలే ఇష్టం. ఆ తల్లినీ **'ధవళతరాంశుక గంధ మాల్య శోభాం'** అని స్తుతిస్తూ ఉంటాం కదా!

గాయత్రి, దుర్గ, లలిత, అమ్మవార్లకు ఎర్రనిపూలు ఇష్టం. **'అరుణమాల్య భూషాం బరాం'**, **'జపాకుసుమ భాసురామ్'** అనే స్తుతులు వీటిల్ని నిరూపిస్తూ ఉంటాయి. అంతే గాక ఎరుపు ఆ అమ్మలకు ప్రీతి. లలితాదేవి పాదాలవద్ద ఎర్రనిపుష్పాలు, ఎర్రరాళ్ల కిరీటం, ఎర్రని ఆభరణాలు, ఎర్రని వస్త్రాలు ఉండడం ఆమెకు ఎరుపు పట్ల ప్రీతిని తెలియజేస్తాయి.

శ్రీమన్నారాయుణ్ణి కదంబపుష్పాలతో పూజ చేస్తే స్వర్గం లభిస్తుంది. అగసి పూలతో పూజ చేస్తే పదివేల యజ్ఞాలు చేసిన ఫలం లభిస్తుంది.

శ్రీకృష్ణుడు నీలమేఘశ్యాముడే అయినా నీలిరంగు పూలు ఆయన పూజకు పనికి రావు. మెట్ట తామర, పున్నాగ, మందార, కావిరేగు, ఒకే ఒక రెక్క ఉండే పూలు కృష్ణపూజకు పనికిరావు.

పార్వతీదేవికి ఉసిరిక ఆకులు ఇష్టం. దుర్గాదేవికి వైశాఖంలో వకుళపుష్పాలు, జ్యేష్ఠంలో నాగకేసరాలు, ఆషాఢంలో కరవీరాలు, శ్రావణంలో చంపకాలు, తామరలు, భాద్రపదంలో లొద్దుగలు, ఆశ్వయుజంలో బంధూక, కార్తికంలో అగస్త్యాలు, మార్గశిరంలో బిల్వపత్రాలు, పౌష్యంలో దూర్వాలు, మాఘంలో కుందాలు, ఫాల్గునంలో మాధవీపుష్పాలు, చైత్రంలో అశోకపుష్పాలు మొదలైన పూలు సేకరించి ఆయా మాసాల్లో చెప్పినరకాల పుష్పాలతో పూజిస్తే ఎంతో మంచిది.

శివునికి తామరపూలు, మారేడుదళాలు, శతపత్రం, శంఖపుష్పాలు, తుమ్మిపూలు ఇందులో అన్నీ ఇష్టమైనవే. ఆయా పూలల్లోని ఏదో ఒకదానితో లక్షపూలతో అర్చన చేస్తే శివుడు సంతృప్తితో ధనవృద్ధి చేస్తాడు. కోటిబిల్వ దళాలను సుగంధగంధంతో తడిపి కాని ఇట్లే శంఖతామర పూలతో కాని అర్చిస్తే రాజభోగాలు ప్రసాదిస్తాడు. యాభై వేల పుష్పార్చనతో రోగవిముక్తిని, ఆరోగ్యాన్ని, ఇరవైవేల



విద్యను కోరువాడు 'సుఖమును' త్యజించవలెను

పుష్పార్చనతో అనుకూల భార్య లేదా భర్తను లభింపజేస్తాడు. పన్నెండువేల ఐదువందల పుష్పార్చనతో విద్యాధికత, పది వేలపుష్పార్చన అమితకీర్తి, ఒకలక్ష అర్చనతో శరీర శుభ్రత ప్రాప్తిస్తాయి. రెండులక్షల పుష్పార్చనతో జన్మాంతం జ్ఞానసిద్ధి, మూడులక్షల పుష్పార్చనతో కర్మనాశనం, లక్ష ఉమ్మెత్త పుష్పార్చనతో పుత్రసంతానం, లక్ష అవిసి పుష్పార్చనతో గొప్పపేరు, లక్షతులసి అర్చనతో సిద్ధిబుద్ధి, మోదుగ పుష్పార్చనతో రోగ నిరోధం, కస్తూరి పుష్పార్చనతో భగవంతుని అనుగ్రహసిద్ధి కలుగుతుంది. జాజిపూల అర్చనతో వాహన సౌఖ్యం, కరవీర పుష్పపూజ రోగశాంతి, మంకెన పుష్పపూజ అలంకారం, గరికతో అర్చన ఆయుష్షు పెంచుతుంది. జిల్లేడు పూజ శత్రుజయాన్ని కల్గిస్తుంది.

సంపెంగ, మాలతి, గురువింద, మొల్ల, జపా కుసుమ, దిరిసెన, బంతిపూలు శివపూజకు అనర్హం. ఆత్మార్పణతో చేసే పూజలలో నిషిద్ధాలు లేకపోయినా స్నానం చేయకుండా పుష్పాలు అర్చన నిమిత్తం సేకరించటం, ఒకమారు వాడిన పూలు పూజకు పనికిరావు. తులసి, బిల్వపత్రాలు, అగస్త్య పుష్పాలు కోసిన తర్వాత ఐదురోజుల వరకు తాజాగా ఉంటాయి. కనుక, వీటికి నిషిద్ధం లేదు. శైవాగమం ప్రకారం ఇంట్లో పూలు లేకపోతే పూలమ్మేవారి పుష్పాలు కొని నిరభ్యంతరంగా అర్చనకు ఉపయోగించవచ్చు. పుష్పమాల, పుష్పరహస్యం, పుష్పమాహాత్మ్యం, పుష్ప నిరూపణ ప్రకరణం, పుష్పమాలాస్తవం, పుష్పవిధి, పుష్పరత్నాకరం, పుష్పచింతామణి అనే ఉద్గ్రంథాల్లో వీటిని గురించిన విషయాలు విస్తారంగా ఉన్నాయి.

అయితే, కొందరు వారంలో వారికి నచ్చిన ఆది వారం నుంచి శనివారంలోపల వారప్రాధాన్యం గల దేవతలకు పూజచేసి పుష్పాలతో అలంకరించి, వారం అయ్యే వరకు పూలుతీయరు. కాని, ఇట్లు చేయరాదు. దేవుని పటానికి పూలు లేకపోయినా ఫర్వాలేదు. కాని, వాడిపోయిన పూలు ఉంచరాదు. ఇవాళ అర్చన చేసిన పూలను మర్నాడు తప్పనిసరిగా తీసివేయాలి. వాటిని **'నిర్మాల్యం'** అంటారు. నిర్మాల్యం ఉండటం దోషకరం. కొందరు ఆ పూలను తీసివేసి విసిరి అవతల పారవేస్తారు. అవి ఎవరైనా త్రొక్కితే ఆ పాపం మనకే. ఎవరు త్రొక్కని చోట వాటిని వేయాలి.

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి।**
**తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః ॥**

**(గీత– 9–26)**

'భక్తితో ఆకు, పువ్వు, పండు, నీరు సమర్పించినా మనస్సుతో ఇచ్చింది స్వయంగా స్వీకరించి ఆనందిస్తాను' అన్నాడు భగవంతుడు.



పత్రం వల్ల విదురుడు, ఫలంతో శబరి, నీటితో రంతిదేవుడు, పుష్పంతో గజేంద్రుడు మోక్షాన్ని పొందారు. పుష్పానికి గల పవిత్రత వల్ల ఎందరో గురువులు పుష్పముతో బహువర్ణనలూ ప్రార్థనలు చేస్తారు. జగద్గురువులు శ్రీఆది శంకరులు తన శివానందలహరిలో...

"ఉమాపతివైన ఓ పరమేశ్వరా! చిత్తం అనే కమల పుష్పాన్ని నీకు అర్పించి సుఖంగా ఉండేందుకు జనులు తెలుసుకొనలేకున్నారని" ప్రబోధించారు.

మన పౌరాణిక గాథల్లో పుష్పయుద్ధాలు కూడా ఉన్నాయి. శ్రీకృష్ణుడు సత్యభామ కోరికపై దేవేంద్రునిపై దాడి చేసి పారిజాత పుష్పంకోసం పారిజాత వృక్షాన్నే స్వర్గం నుంచి తెచ్చిన వైనం, ద్రౌపది కోరికపై సౌగంధికా పుష్పం కోసం భీముడు యుద్ధం చేసి సాధించుటలాంటి వృత్తాంతాలున్నాయి. దైవానికి చేసే పుష్పార్చన పరమపవిత్రమే కాక అందరికీ దైవానుగ్రహాన్ని ప్రాప్తింప చేసేందుకు దోహదం చేస్తుంది.




# నామమహిమ...

శ్రీమతి కాత్యాయిని

నెల్లూరు జిల్లాలో మాది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. మా తాత బామ్మగార్లకు శ్రీవారిపై ఎక్కువ భక్తి ఉండేది. సాధ్యమైనంతకాలం వారు తిరుమలలోనే గడిపే వారు. వారిద్దరూ స్వామిభక్తులు. కొన్నాళ్ళకు బామ్మ చరమ దశలో ఉన్నప్పుడు ఆమెను స్వగ్రామానికి తీసుకుని వచ్చాం. దాదాపు వారిరువురు ఒకరి తర్వాత ఒకరు పరమపదించారు. వారు మరణానికి ముందుగా ఉన్నప్పుడు, అప్పుడే ప్రసవించిన మా పాపను చూసి ఆమె ఈ విధంగా చెప్పారు.

“మన ఇష్టదైవం శ్రీనివాసుడు. కలియుగ అవతార పురుషుడు. ఆయన పేరే నా పేరు. నీవు పాపకు ఆ పేరే పెట్టమనీ, నా మాట మీద మీకు ఏమాత్రం అభిమానం, ప్రేమ ఉంటే అదే చాలు” అన్నారు. మీ కోరిక తీరుస్తాము అని మేమంతా కళ్ళ నీళ్ళతో వారి చేతులు పట్టుకుని భరోసా ఇచ్చాము.

కొద్దిరోజుల తరువాత వారిరువురు స్వర్గస్థులయ్యారు. అప్పటికి మా పాపకు సంవత్సరం కూడా కాలేదు. కొద్దికొద్దిగా పెద్దదయిన మా పాప చాలా హుషారుగా చలాకీగా ఎదిగిపోయింది. దగ్గరి పట్టణంలోని కాన్వెంటులో చేర్చాము.

వరదలా పొంగుతున్న నాగరికత కాలప్రవాహానికి నేను సైతం లోనయి నా బిడ్డకు కాన్వెంటులో హాజరు రిజిస్టరులో పేరు వైశాలిగా నమోదు చేయించాను. తన స్నేహితులందరూ అదే తరహా శైలిలో అధునాతనమైన నామకరణాలతో సీతాకోకచిలుకల్లా తిరుగాడుతున్నారు. కొన్నేళ్లు సునాయాసంగా గడిచిపోయాయి.

ఆరవతరగతి పరీక్షలకు పిల్లలందరూ సిద్ధమౌతున్నారు. ఆ రోజున దరఖాస్తు ఫారం ఉన్నత పాఠశాలలో ఇచ్చి పరీక్షకు కూర్చోవాలి. అది జిల్లాస్థాయి పరీక్ష. ఆ పత్రంలో ఒకసారి పేరు, వయస్సు నమోదు చేస్తే ఇక ఆ వివరాలతోనే జీవితమంతా వ్యవహరింపబడతారు. ఎంతో తెలివితేటలతో రాణిస్తున్న మా పాపపై మా కుటుంబం ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంది.

కానీ, ఆ తెల్లవారి ఉన్నట్లుండి వైశాలి అకస్మాత్తుగా జ్వరాన పడింది. చూడని వైద్యులు లేరు. చేయని చికిత్స లేదు. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, యునాని, సిద్ధప్రకృతి మరెన్నో నాటు వైద్యాలు మంత్రతంత్రాలు ఉపయోగించాము. మూసిన కన్ను తెరవలేదు. వైద్యపరీక్షలు నిర్వహించినప్పటికీ వైద్యులకు మా పాపస్థితి అంతుపట్టలేదు. మాకు భయమేసింది.

దగ్గరకు వచ్చిన పరీక్ష ఇంతకాలం ఎదురు చూసిన సువర్ణావకాశం అందినట్టు అందకుండాపోతుందని ఒక బాధ. మరో వైపు బిడ్డయినా మాకు దక్కుతుందా! అన్న బాధ కడుపును కృంగదీసింది.

ఇంతలో రేపు పరీక్ష అనగా వెంటనే దరఖాస్తు ఫారం తీసుకొని వేంకటేశ్వరస్వామివారి పటం దగ్గర ఉంచగానే, వేంటనే మాకు బామ్మ చివరగా చెప్పిన మాటలు స్ఫురించాయి. మేము వేంటనే మా పాప పేరుని వేంకటాధ్వరిగా మార్చాము. జరిగిన తప్పిదానికి చెంపలేసుకుని మన్నించమని బామ్మను వేడుకొన్నాము. మాములుగా డాక్టరుగారు వాడమన్న మందులు వాడాము.

మమ్మల్నందరినీ ఆశ్చర్యచకితులను చేస్తూ ఆ మరుసటి రోజు ఉదయం నా బిడ్డ నిద్రనుండి లేచినట్టయి

దరఖాస్తు ఫారం, హాల్‌టికెట్‌తో పరీక్షహాలులో ప్రవేశించింది. మూడురోజులు జరిగిన వివిధ పరీక్షపత్రాలకు క్షుణ్ణంగా జవాబులు ఇచ్చి జిల్లాస్థాయిలో ప్రథమురాలిగా కృతార్థురాలయింది.

దాదాపు అపస్మారక స్థితిలో ఉండి, చదివిన చదువంతా మరచి ఉంటుందన్న మా ఊహలను త్రోసిరాజని గౌరవమైన స్థాయిలో ఉత్తీర్ణురాలైంది. ఆ దేవదేవుడే నా బిడ్డయందు ప్రవేశించి, నడిపి ఉంటాడని ఈనాటికీ మా విశ్వాసం.

ఆ తరువాత మా కుటుంబీకులంతా తిరుమలకు ఏడుకొండలు నడిచి ఎక్కి మా బామ్మ తాతగారు బస చేసిన వసతి గృహంలోనే మకాంచేసి, అందరం తలనీలాలు సమర్పించి ఆ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలనన్నిటిని కళ్లార చూచి కలియదిరిగి ఏడురాత్రులు ఆ కొండపై గడిపి తిరిగి వచ్చాము. పేరులో ఏముందిలే! అన్న నిర్లక్ష్యం ఉదాసీనత నా జీవితంలో ఒక అగ్నిపరీక్షపెట్టి ఒక సవాలుగా నిలిచి నన్ను నిలదీసింది. ఈనాటికీ నా బిడ్డను చూస్తుంటే వారిరువురికి ఇచ్చిన మాట మా చెవుల్లో మారు మ్రోగుతూ ఉంటుంది. మాపాపకు ఆ పేరుపెట్టి పిలుస్తూంటే ఆ వేంకటేశ్వరుని భక్తులైన వారిద్దరూ తిరిగి పలికినట్లు ఆ స్వరమే ప్రతిధ్వనిస్తున్నట్లుంది. నా జీవనపర్యంతం వారిద్దరి మాట నాకెల్లప్పుడు గుర్తుండిపోయింది.

# శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, అప్పలాయగుంట

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు జరుపుతారు. శ్రవణనక్షత్రం నాటికి చక్రస్నానం పూర్తయ్యేట్లుగా 9 రోజుల ముందు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు వారంరోజుల ముందుగా శ్రీస్వామి గర్భాలయంతో సహా మొత్తం ఆలయాన్ని శుభ్రపరుస్తారు. దీనినే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అంటారు. ఇక విష్వక్సేనులవారి ఆధ్వర్యంలో మృత్సంగ్రహణయాత్ర జరిగిన తర్వాత బ్రహ్మోత్సవాలకు ముందుగా అంకురార్పణ జరుగుతుంది. ఆ మరుసటి రోజు ధ్వజారోహణం జరుగుతుంది. ఆ రాత్రి పెద్దశేషవాహనం, రెండవనాడు ఉదయం చిన్నశేషవాహనం, రాత్రి హంసవాహనం, మూడవనాడు ఉదయం సింహవాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, నాల్గవనాడు ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం ఆర్జిత కల్యాణం, ఆ రాత్రి సర్వభూపాల వాహనం, అయిదవరోజు ఉదయం పల్లకిలో మోహినీ అవతారం, రాత్రి గరుడసేవ, అటు తర్వాత ఉదయం హనుమంతవాహనం తర్వాత వరుసగా సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజవాహనం తర్వాతిరోజు ఉదయం సూర్యప్రభవాహనం రాత్రి చంద్రప్రభవాహనం, మరుసటి రోజు రథోత్సవం ఆ రాత్రి అశ్వవాహనం,



తొమ్మిదవ రోజు చక్రస్నానం ఆ రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిసి మరుసటి ఏడాదికి సిద్ధమౌతాయి.

బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఊంజల్‌సేవ జరుగుతుంది. ఆ తర్వాతనే రాత్రి వాహనం నిర్వహిస్తారు.

బాలప్రబోధం

# దానగుణం


డా॥ ఎ.సచ్చిదానందమూర్తి

దాతృత్వం అనేది అందరికీ లభించదు. 'అభ్యాసేన లభంతే'- అన్న వాటిలో దాతృత్వం కూడా చేర్చారు.

ఒక ఊళ్ళో ఒక ధనికుడు ఉండేవాడు. అతనికి ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి ఉంది. తను వినడమే కాకుండా నలుగురు వినేటట్లు చేసేవాడు. అందుకనే తరచూ హరిదాసులను పిలిపించి హరికథలను, పౌరాణికులను పిలిపించి పురాణాలను, ప్రవక్తలను రప్పించి ప్రవచనాలను ఏర్పాటు చేసేవాడు. వారిని ఘనంగా సత్కరించి, తృప్తిపరచి ప్రోత్సహించేవాడు. అందుకనే అతను పిలిస్తే కాదనకుండా వచ్చేవారు. ఒకసారి ఒక హరిదాసుని పిలిపించాడు. అతను కథను చాలా బాగా చెబుతున్నాడు. అందరూ ఎంతో ఉత్సాహంగా వింటున్నారు. ఆ రోజు హరిదాసుని సత్కరించాలని సంకల్పించాడు ధనికుడు. ఐదువేల రూపాయల నగదు, ఒక బంగారపు గొలుసు, చక్కని రాళ్ల ఉంగరం, పట్టుబట్టలు ఇచ్చి ఘనంగా సత్కరించాలని అవన్నీ ఒకచోట పెట్టి కథ వినడానికి వచ్చి కూర్చున్నాడు. హరిదాసు చాలా బాగా కథ చెబుతున్నాడు. మధ్యలో ఏవో కథలు సందర్భానుసారంగా చెప్తున్నాడు. అందరూ వింటున్నారు. ధనికుడు ఈ విధంగా ఆలోచించసాగాడు. రొఖ్ఖం ఇస్తున్నాను సరే! సమంజసమే!! బంగారు గొలుసు ఘనంగా ఉంది. అలాంటప్పుడు ఉంగరం కూడా ఎందుకు? అని అనుకున్నాడు. వెంటనే లేచి లోపలికి వెళ్లి ఉంగరం దాచి వచ్చి కూర్చుని కథ వినసాగాడు. కొంతసేపయ్యాక అతనికి ఇంకా ఇలా అన్పించింది. అసలు బంగారం ఇవ్వడం దేనికి? డబ్బు, పట్టువస్త్రాలు చాలు. ఆ గొలుసు వేరే ఎవరికో ఇవ్వవచ్చు. అలా అనుకుని లేచి వెళ్లి, ఆ గొలుసు కూడా దాచి వచ్చాడు.

హరిదాసు ఇలా కథ చెప్పసాగాడు. కర్ణుడు మహాదాత. అందుకనే అతనిని దానకర్ణుడని పిలుస్తారు. అటువంటి కర్ణుడు ఒకసారి భగవంతుణ్ణి ఒక వరం కోరాడట. ఎవరైనా వచ్చి ఏదైనా యాచిస్తే, 'లేదు' అనకుండా తానుండాలనే ఆ వరం. అడిగిన వారికి ఏదైనా ఇచ్చే కర్ణుడికి ఒక సమయం లేదు. దానం ఇవ్వడానికి ఎప్పుడు, ఎక్కడ, ఎవరు, ఏది లేదనకుండా ఈయడమే!

ఒకనాడు కర్ణుడు స్నానం చేయాలని కూర్చున్నాడు. చుట్టూ బంగారుగిన్నెలలో వివిధ సుగంధపరిమళద్రవ్యాలు, రకరకాల సువాసన భరిత తైలపాత్రలు, అతను ఒక బంగారు గిన్నెలో తైలాన్ని ఎడమచేతితో పట్టుకొని వంపడానికి పూనుకునే సరికి ఎవరో యాచకుడు వచ్చాడు. వెంటనే కర్ణుడు ఆ చేతి పాత్రని అలాగే దానం ఇచ్చాడట. వెంటనే అక్కడ కొందరు ఎడమచేతితో దానం ఇవ్వకూడదని అది తప్పని చెప్పారట.



అప్పుడు కర్ణుడు 'ఏమో! పాత్ర ఎడమచేతిలోంచి నా కుడిచేతిలోకి మారేటప్పటికి నా బుద్ధి ఎలా మారుతుందో అందుకని ఇవ్వాలి అనుకోగానే ఇచ్చేశాను' అన్నాడు.

చూశారా! అంత దానకర్ణుడి మనస్సే అంత చంచలమై మారిపోతే మనలాంటి వాళ్ల సంగతేమిటి? అందుకనే మీకు ఎప్పుడైనా ఎవరికైనా ఏదైనా ఇవ్వాలనిపిస్తే వెంటనే ఇవ్వండి. మరి ఆలోచించకండి. ఏమో ఆలోచిస్తే మీ మనసు ఎలా మారుతుందో అన్నాడు.

వెంటనే ధనికుడు ఇలా అనుకున్నాడు, నిజమే కదా! కొంచెం విరామం దొరికే సరికి తన మనస్సు ఇలా మారిపోయింది. వెంటనే ఇచ్చి ఉంటే! అదే దానలక్షణం. వెంటనే అతను లేచి వెళ్లి, దాచి ఉంచిన వస్తువులు తిరిగి తెచ్చి ఇవ్వడానికి సంకల్పించిన వాటిలో పెట్టి మధ్యలో హరిదాసుని సత్కరిస్తున్నట్లు ప్రకటించి వెంటనే సత్కరించి అవన్నీ సమర్పించాడు.

గృహలక్ష్మి

# వైదిక వాఙ్మయం స్త్రీలు

శ్రీమతి ఎస్. పద్మజ

వైదికకాలంలో కేవలం మహర్షులే కాదు స్త్రీలు కూడా తపస్సంపన్నులై, శాస్త్రవాదాలలో పాల్గొని చరితార్థు లైనారు. వారిని గురించి తెలుసుకోవడం ముఖ్య కర్తవ్యం.

## గార్గి

గార్గి వచక్నుమహర్షి పుత్రిక. చిన్ననాటి నుండి ఆమెలో ఆత్మస్థైర్యము, ఆధ్యాత్మిక, విద్యానురక్తి, మోక్ష జిజ్ఞాస, ఋషుల తపస్సులు వంటి విషయాలపై ఆసక్తి కలిగాయి. ఇది తపోధనులను ఆశ్చర్యం కల్గించింది. జనకుని కొలువులో యాజ్ఞవల్క్యుడు సామశ్రవునితో వాదనలు జరిపింది. ఈమెను విద్యాస్వరూపిణిగా భావించారు.

సర్వస్వతీ సారూప్యమన్నారు, తపస్సు స్త్రీ రూపం దాల్చిందన్నారు. వేదమాత అన్నారు. అప్పుడు యాజ్ఞ వల్క్యుడు వాచుక్నుని కుమార్తెగా అందరూ ఆమెను గుర్తిం చారు. అటు తర్వాత ఆమె యాజ్ఞవల్క్యునితో సంభాషణలు జరిపి తన సందేహాలు తీర్చుకుంది. గార్గి పేరు దశదిశలా వ్యాపించింది. ఆమె మేధస్సును పండితులు మెచ్చుకున్నారు.

తండ్రి వాచక్ను మహర్షి, దేవర్షి నారదుని ధర్మో పదేశాన్ని అనుసరించి శృంగవంతుడనే మునిని వివాహ మాడింది. బృహదారణ్యక ఉపనిషత్తులో శాశ్వతస్థానం సంపాదించుకున్న బ్రహ్మవాదినులలో గార్గి ఒకతె.

## దధిమతి

ఋగ్వేదమునందలి 116 సూక్త పదమూడవ మంత్రద్రష్ట 'దధిమతి'. ఆమె తన ఆరాధన ద్వారా సర్వదా తన్మయురాలై ఆమె దృఢ చిత్తముతో అశ్వినీకుమారులను ఆరాధించెను. ఆమె ఆరాధించిన అశ్వినీకుమారులు ఆహుత శిష్యులుగా ఆమె స్తోత్రమును వినుచుండేవారు. సాధా రణంగా భగవదుపాసన నిత్యపారాయణంలో ముఖ్యమైనది. ఇది తెలిసివారు ఋగ్వేదమునందలి ప్రథమ మండలము 131వ సూక్తమునందు పాపద్వేషులై పతీపత్నులు గోధనాభి వృద్ధికై ధృతాహుతి ప్రధాన పూర్వకముగా దృఢచిత్తముతో ఇంద్రుని ఆ వేళలో స్తుతిస్తారు. ఇందుకనే భారతీయ మహిళలు దేవారాధనతో బాటు విపత్తుల నుండి ముక్తుల య్యేందుకు జాగ్రత్తగా ఉండేవారు.

## రోమశా

ఋగ్వేదమునందలి 1-126-7 మంత్రము రోమశ ద్వారా తెలుస్తున్నది. ఆమె శరీరము రోమావళితో నిండి ఉండేది. అందువలన ఆమె పతి అపహసించుచూ ఏహ్య భావాన్ని ప్రకటించేవాడు. అయినా 'రోమశ' పతి ఎడల ఏ మాత్రము ద్వేషభావములు ప్రదర్శించలేదు. శారీరక సౌందర్యము శాశ్వతమైనది కాదు. నేను అంగవికలురాలు కాదని, సర్వాంగ పరిపూర్ణులైన మీరు నన్ను ఉపేక్షించతగ దని తెలియజేసెను.

అయితే, భారతీయ వైదిక స్త్రీలు శారీరక సౌందర్య మును ఉపేక్షించి అంతఃకరణ విశుద్ధియే ఉత్తమమని భావించేవారు. పూర్వము పార్వతీదేవి తన మనోనిగ్రహము ద్వారా ఉగ్రతపమాచరించి మహేశ్వరుని అనుగ్రహాన్ని పొంద గల్గింది. ఈ విధంగా వైదిక వాఙ్మయస్త్రీలు తమ పాత్రి వ్రత్యము ద్వారా సర్వకామితార్థములు పొందగలిగారు.

## అపాలా

ఋగ్వేదమునందలి 6వ అష్టకము నందు బ్రహ్మ వాదిని అత్రి కన్యయైన అపాల గాథ కలదు. ఈ సూక్తమునకు ఆమెయే ద్రష్ట.

శౌనకుడు సాయణుడు మొదలగు వారీమెను గురించి వ్యాఖ్యానించి ఉన్నారు. అపాల చర్మరోగస్తురాలు అయినందున పతి పరిత్యక్త. అపాల తన తండ్రి గృహము నందు నివసించి పరమేశ్వరుని (ఇంద్రుని) గురించి తపము గావించెను. తపము ద్వారా సోమరసాన్ని పొంది ఇంద్రునికి దానిని అర్పించెను. అందుకు తన చర్మరోగము తొలగించ మని వేడుకొనెను. తన దృఢ చిత్తముతో ధ్యేయమును తీర్చు కొని పతి అనురాగాన్ని పొందెను.

## వాక్

ఋగ్వేదము నందలి 10-20వ సూక్తాలలో ఈమె ప్రసక్తి కన్పించుచున్నది. ఈమె బ్రహ్మ సాక్షాత్కారము పొంది శక్తిసాధనకు మూలమైన దేవి సూక్తమనే నామముతో ప్రసిద్ధి గాంచింది. ఆత్మ అఖండ అదితి స్వరూపం. అదితి శబ్దము అఖండమునకు బోధకము. ఆ జ్యోతి ఋగ్వేదమునందలి దేవీసూక్తముల ద్వారా సుపరిచతమైనది.

ఈ విధంగా వేదాలను తరచి చూస్తే, ఋగ్వేద 4-42 లో సూక్తిలో రాజు పురుకుత్సుడు కారాగారంలో ఉన్నప్పుడు రాజపత్ని సప్తర్షులను ఆరాధించింది. వారి అనుగ్రహంతో పతిని, ప్రజలు సుఖశాంతులను పొంద గలిగారు. ఇటువంటి అనేక గాథలు వేదములందు ఉన్నాయి.

భారతీయ ఉపాసనలో ముఖ్యంగా భగవంతుని మాతాపితబంధురూపంలో ఉపాసిస్తారు. ఇందుకు ఎన్నో మంత్రాలు ఉదాహరణగా ఉన్నాయి. పరమేశ్వరుడు సర్వ జీవులందు విరాజమానుడు. అందువలన వారు సర్వజీవుల సర్వమాతల గర్భమందు జీవరూపంలో విరాజిల్లుచున్నారు.



భారతీయులకు పరమపవిత్రమైన వేదంలో మంత్ర ద్రష్టలైన స్త్రీలు ఉన్నారు. వారినే ఋషీకలంటారు. ప్రాచీన కాలంలో ఘోష, విశ్వవర, ఆత్రేయి, లోపాముద్ర, ఇంద్రాణి, వైవస్వతి, యమి, పౌలోమి, సూర్య, స్వస్తి, శిఖండిని, ఊర్వశి, శచి వంటి ప్రతిభావంతులున్నారు.

వేద, ఉపనిషత్తుల అధ్యయనము వలన స్త్రీలు కూడా బ్రహ్మజ్ఞానవాదోప వాదములందు పాల్గొనేవారని తెలుస్తున్నది. వారి సాధన, దార్శనికత, రాజనీతిజ్ఞత ఎన్నదగినది. నేటి స్త్రీలు కూడా వైదిక స్త్రీలను అనుసరించి సమాజంలో వేదనిష్ఠా తులై సమాజానికి ఉపయోగపడుదురు గాక!

# తిరుపతి
# శ్రీ గోవిందరాజస్వామివారి
# జ్యేష్ఠాభిషేక మహోత్సవము













తిరుమల నాదనీరాజన మండపంలో సుందరకాండ పఠనం ప్రారంభం

## లోకకల్యాణం కోసం తిరుమల ధర్మగిరి వేద విజ్ఞానపీఠం నందు నిర్వహించిన మహాసుదర్శన సహిత విశ్వశాంతి మహాయాగం


















## తిరుపతి
## శ్రీగోవిందరాజస్వామివారి
## బ్రహ్మోత్సవం





## అప్పలాయగుంట
## శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం








తి.తి.దే. ధర్మకర్తలమండలి
ఎక్స్‌అఫిషియో సభ్యులుగా
27-05-2020 నాడు
నియమితులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర
దేవాదాయశాఖ కమిషనర్
శ్రీ అర్జున్‌రావు, ఐ.ఏ.ఎస్., గారికి
శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న
తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి
శ్రీ ఎ.వి. ధర్మారెడ్డి గారు



తి.తి.దే. నూతన
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి
(విద్య, ఆరోగ్యం) గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే
నియమితులైన
శ్రీమతి ఎస్. భార్గవి, ఐ.ఏ.ఎస్., గారు
20-05-2020 న
బాధ్యతలు స్వీకరించిన దృశ్యం

# దివ్యక్షేత్రం... తిరుమల 10

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

*గత సంచిక తరువాయి భాగం...*

## నాగుల చవితి - పెద్దశేషవాహనం

ప్రతిసంవత్సరం కార్తికమాసం శుద్ధచవితి అనగా– “నాగులచవితి” రోజున సాయంత్రం తిరుమల శ్రీస్వామి వారికి “పెద్దశేషవాహనం” జరుపబడుతుంది.

## పారువేట ఉత్సవం

ప్రతి సంవత్సరం కనుమ పండుగ నాడు శ్రీస్వామి వారికి పారువేట ఉత్సవం జరుగుతుంది. శ్రీమలయప్ప



స్వామివారు శంఖం, చక్రం, గద, ఖడ్గం, ధనుస్సు ఈ పంచాయుధాలను ధరించి వేటకు బయలుదేరి పారువేట మండపం చేరుకుంటారు. ఆ స్వామి వెంట వేరొక పల్లకిలో శ్రీకృష్ణస్వామి వెళ్తారు.

అక్కడ శ్రీ స్వామివారు తాళ్లపాకవారి, సన్నిధిగొల్ల వారి సేవలందుకుంటారు.

సాయంత్రంవరకు పారువేట వేడుకల్లో పాల్గొన్న తర్వాత శ్రీస్వామి వారు, కృష్ణస్వామివారు ఊరేగింపుగా ఆలయం చేరుకొంటారు.

అధికమాసం వచ్చిన సం॥లో శ్రీస్వామివారికి రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మొదటి దాన్ని “వార్షిక బ్రహ్మోత్సవం” అనీ, రెండవమారు జరిగే దాన్ని “నవరాత్రి బ్రహ్మోత్సవం” అంటారు. ఇలా రెండు బ్రహ్మోత్సవాలు జరిగిన సందర్భంలో రెండవ బ్రహ్మోత్సవం పూర్తి అయిన మరునాడు తిరుమలేశునికి **“పారువేట ఉత్సవం”** జరుపబడుతుంది.

## రథసప్తమి

ప్రతి సంవత్సరం మాఘమాసంలో శుద్ధ సప్తమి “సూర్యజయంతి”నాడు “రథసప్తమి” పేరుతో తిరుమలలో ఉత్సవం జరుగుతుంది.

ఆ రోజు శ్రీవేంకటేశ్వరస్వామివారు సూర్యోదయం మొదలు రాత్రి చంద్రోదయంవరకు ఏడువాహనాల్లో విహరిస్తారు. సూర్యప్రభ, చిన్నశేషవాహనం, గరుడ వాహనం, హనుమద్వాహనం, కల్పవృక్షవాహనం, సర్వ భూపాలవాహనం, చంద్రప్రభవాహనం ఇలా ఏడు వాహనాలలో శ్రీమలయప్పస్వామివారు దర్శనమిస్తారు.



మధ్యాహ్నం శ్రీస్వామిపుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది. రథసప్తమి నాటి వేడుకలను **'అర్ధబ్రహ్మోత్సవం'** అనీ, ఒక రోజు బ్రహ్మోత్సవం అని అంటారు.

## తెప్పోత్సవాలు

ప్రతి ఏటా ఫాల్గుణ పూర్ణిమకు పూర్తి అయ్యేట్లుగా ఐదురోజుల పాటు తెప్పోత్సవాలు శ్రీ స్వామి పుష్కరిణిలో జరుగుతాయి. 15వ శతాబ్దంలో ఆగిపోయిన తెప్పోత్స వాలను దేవస్థానం 1921 నాటి నుంచి పునరుద్ధరించింది.

ఈ తెప్పోత్సవాల్లో మొదటిరోజు శ్రీసీతారామ లక్ష్మణులు, రెండవరోజు రుక్మిణీ శ్రీకృష్ణులు, చివరి మూడు రోజులు శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీమల యప్పస్వామి వారు పాల్గొంటారు.

పైన పేర్కొన్నవే గాక, ధనుర్మాసంలో– తిరుప్పావై, వైకుంఠఏకాదశి, ప్రణయకలహోత్సవం, అధ్యయనోత్స వాలు, నరసింహజయంతి, శ్రీవరాహజయంతి, అనంత పద్మనాభ చతుర్దశి, చక్రతీర్థముక్కోటి, కైశికద్వాదశి, కార్తికదీపోత్సవం, క్షేత్రపాలక ఉత్సవం, శ్రీవారిబాగ్ సవారి ఉత్సవం, పురిశైతోటఉత్సవం, తణ్ణీరముదు ఉత్సవంవంటి వార్షిక ఉత్సవాలు తిరుమలక్షేత్రంలో నిర్వహింపబడుతూనే ఉన్నాయి.

ఆనందనిలయుడు ఉత్సవ ప్రియుడట! అంతకంటె భక్త ప్రియుడట! ఆ స్వామివారికి ఉన్న భక్తప్రియత్వం అంతా ఇంతా కాదు. తనను చేరవచ్చిన భక్తులచేత ఉత్సవాలు చేయించుకుంటాడు. దర్శింపజేసుకుంటాడు. మొక్కులు చెల్లింప చేసుకుంటాడు. ఒక వేళ ఉత్సవాలు చేయించకపోయినా పర్వాలేదట! ఆ కొండలరాయని కొండంత ఉత్సవ వైభవాన్ని దర్శిస్తే చాలు! పాపాలు పోతాయి. కోరికలు తీరుతాయి. జీవితం ప్రశాంతత పొందుతుంది. అంతులేని ఆనందం కలుగుతుంది.

## 7. తిరుమలేశుని సేవలో తరించిన భక్తులు

తిరుమలక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన నాటినుండి ఎందరెందరో భక్తులు ఎన్నోవిధాలుగా సేవలు చేస్తూ తరించారు. వారిలో కొందరి భక్తుల దివ్య గాథలను సంగ్రహంగా తెలుసుకుందాం.

### తొండమానుడు - భీముడు

తొండమానుడు చక్రవర్తి. భీముడు కుమ్మరివాడు. వీరు ఇద్దరూ శ్రీవేంకటేశ్వరస్వామికి పరమభక్తులు.

తిరుపతికి దగ్గర్లో నారాయణవనం అనే క్షేత్రం ఉంది. పూర్వం పెద్దనగరంగా ఉన్న రోజుల్లో దాన్ని ఆకాశరాజు పాలించేవాడు. ఈ రాజుగారి కూతురే పద్మావతి. ఆకాశరాజు ఆమెను వేంకటేశ్వరునికి ఇచ్చి పెళ్లి చేశాడు. ఈ రాజు తమ్ముడే తొండమానుడు. చిన్న మామే, కాక పరమభక్తుడైన తొండమానురాజు తిరుమలలో **'ఆనందనిలయం'** అనే పేరుగల బంగారు భవనాన్ని కట్టించి శ్రీనివాసునికి ఇచ్చాడు.

ఒకప్పుడు తొండమానునికి బ్రహ్మహత్యా పాపం చుట్టుకొంది. దానికి కారణం ఒక విప్రకుటుంబం. ఒక విప్రుడు కాశీయాత్రకు పోతూ తన భార్యా పిల్లలను తొండమానురాజుకు అప్పజెప్పి, తాను తిరిగి వచ్చేవరకు వాళ్లను రక్షించమని చెప్పాడు. సరే! అన్నాడు రాజు. కాని ఆ తర్వాత వారి సంగతే పూర్తిగా మరచిపోయాడు. పాపం వాళ్లు తిండీ, తిప్పలు లేక మరణించారు. కొంత కాలానికి కాశీనుండి తిరిగి వచ్చిన విప్రుడు తన భార్యా పిల్లల సంగతిని అడిగాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చిన తొండమానుడు వాళ్లు మరణించిన సంగతిని తెలుసుకొని బాధపడ్డాడు. కాని వాళ్లందరూ వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమల కొండకు వెళ్లారు. రేపు వస్తారని అసత్యం పలికాడు. వెంటనే తిరుమల కొండకు వెళ్లి శ్రీనివాసుని కాళ్లమీద పడ్డాడు. ఎలాగైనా వాళ్లని బ్రతికించమని ప్రాధేయ పడ్డాడు. శ్రీనివాసుడు ఆ కుటుంబాన్ని బతికించాడు. కాని ఆ పాపం పోవడానికి వేయి బంగారు పువ్వులతో తనకు సహస్రనామార్చన చెయ్యమని స్వామి రాజును ఆదేశించాడు.

వేంకటేశ్వరుడు ఆనతి ఇచ్చినట్లుగా ప్రతిరోజు బంగారుపూలతో అర్చన చేయించేవాడు తొండమానుడు. ఆ రాజుకు చుట్టుకొన్న బ్రహ్మహత్యాపాపం పోయింది.

(ఇంకా ఉంది)

# హృషీకేశ్

## ఒక ప్రముఖ దేవభూమి

- డా॥ ఎస్.వేంకటకుమార్


ఉత్తరాఖాండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ జిల్లాలోని ప్రఖ్యాత పుణ్యస్థలం 'హృషీకేశ్'. కాలగమనంలో హృషీకేశ్–ఋషీకేశ్‌గా మారింది. దీనినే 'దేవభూమి'గా కూడా పిలుస్తారు. పవిత్రమైన గంగానది తీరాన ఉన్న ఈ పుణ్యక్షేత్రం హిందువులకు పరమ పవిత్రమైనది. ఇది హిమాలయాలకు దిగువభాగంలో ఉంది. శ్రీరాముడు రావణసంహారం తరువాత బ్రహ్మహత్యా పాతకం పోగొట్టుకోవడానికి ఇక్కడ పరిహారాల కర్మలాచరించినట్లు పురాణ కథనం. శ్రీరాముడు ఇక్కడ తపస్సు చేశాడని కూడా చెప్తారు. ఋషీకేశ్ హరిద్వార్‌కు 25కి.మీ. దూరంలో ఉంది. ఋషీకేశ్ గుండా పవిత్రగంగానదీ ప్రవహిస్తుంది. గంగానది హిమాలయాలలోని శివాలిక కొండలను దాటి ఉత్తర భారత మైదానాలలో ప్రవేశించే ప్రదేశమే ఋషీకేశ్.

ఋషీకేశ్‌లోని గంగాతీరంలో అనేక పురాతన దేవాలయాలు ఉన్నాయి. ఋషీకేశ్ పరిసర ప్రాంతంలో గంగానదీ తీరంలో ఉన్న ఋషివాటికలు కారణంగా ఆ ఊరికి 'ఋషీకేశ్' పేరు వచ్చినట్లు విశ్వసిస్తున్నారు.

### ఋషీకేశ్‌లోని ఆంధ్రాశ్రమం

హిమాలయ పర్వతమైదానంలో ఉన్న ఋషీకేశ్‌లోని ఆంధ్రాశ్రమము తి.తి.దేవస్థాన ఆధీనంలో ఉంది. ఈ ఆశ్రమంలో శ్రీవేంకటేశ్వర ఆలయంతో బాటు వివిధ దేవాలయాలున్నాయి. ఇక్కడ ఉన్న చంద్రమౌళీశ్వర, వేంకటేశ్వరస్వామివారలకు నిత్యపూజలు, నైవేద్యాలు, ఉత్సవాలు, పండగలు తి.తి.దేవస్థానం నేతృత్వంలో జరుగుచున్నది. తిరుమల ఆలయంలో జరిగేటు వంటి ఉత్సవ వైభవాలు పూజా పునస్కారాలు ఇక్కడ కూడా జరిగేటట్లు ఏర్పాటు చేయడం జరిగింది.

1930 ప్రాంతంలో సచ్చిదానంద స్వామివారు ఇక్కడికి దర్శనార్థమైవచ్చి దక్షిణాది నుండి హిమాలయక్షేత్ర సందర్శనార్థం వచ్చేయాత్రికుల కోసం ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాలని భావించారు. తి.తి. దేవస్థానం ఇచ్చిన విరాళాలు, ఇతరచందాలు సేకరించారు. శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాల ప్రతిష్ఠాపనతో బాటు ఉత్సవమూర్తులను తయారు చేశారు. ప్రారంభదశలో ఈ ఆంధ్రాశ్రమం ధర్మకర్తలమండలి సలహాలతో జరిగేది. తర్వాత ఆశ్రమంతో సహా తి.తి.దేవస్థానానికి అప్పగించడం జరిగింది.



### ప్రత్యేకాంశాలు

శివాలికశ్రేణిలో 13 అతి ముఖ్యమైన దేవతలలో ఒకరైన 'సతీదేవత' యొక్క కున్జపురి ఇక్కడ ఉంది. పురాణం ప్రకారం శివుడు తన భార్య అయిన సతీదేవి శరీరాన్ని కైలాస పర్వతానికి తీసుకువెళుతుండగా ఆమెయొక్క పై



భాగం ఇక్కడ పడిందని కథనంగా చెప్తారు. ఈ దేవాలయం ఆమె శరీరభాగం పడిన ప్రదేశంలోనే నిర్మితమైనది. ఋషీకేశ్‌లో ఉన్న యోగా శిక్షణాలయాలు భక్తులను ఆకర్షిస్తుంది. యోగా శిక్షణాలయాలు భక్తులను ఆకర్షించడానికి ప్రధాన కారణం పవిత్ర గంగాస్నానం, ఋషీకేశ్‌లో ధ్యానం భక్తులకు మోక్షం కలిగిస్తుందని భక్తుల విశ్వాసం.

ఋషీకేశ్‌లో 120 సంవత్సరాల క్రితం స్థాపించబడిన కైలాష్ ఆశ్రమ బ్రహ్మ విద్యాపీఠం ఉంది. ఇక్కడ విద్యార్థులకు ప్రాచీన వేద విద్యలో శిక్షణ ఇస్తారు.

## సందర్శించవల్సిన ఆలయాలు

### కున్జపురి ఆలయం

కున్జపురి ఆలయం ఋషీకేశ్ పట్టణంనుండి 15 కి.మీ. దూరంలో ఒక చిన్న కొండమీద ఉంది. ఈ ఆలయం వద్ద సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాలు చాలా బాగుంటాయి. ఈ ఆలయం శివాలిక్ పర్వతశ్రేణిపంక్తులో ఉన్న 13 ప్రముఖాలయాలలో ఒకటిగా చెప్పుకోవచ్చు.

### భారత్‌మందిర్

భారత్‌మందిరం ఆదిశంకరాచార్యులవారిచే పవిత్ర గంగానది ఒడ్డున స్థాపించబడిన పురాతన విష్ణుమూర్తి ఆలయం. ఆలయంలో ఉన్న విష్ణువిగ్రహం సాలిగ్రామరాయి యొక్క ముక్కను ఉపయోగించి తయారు చేశారు. ఈ రాయిని హిందువులు పవిత్రమైదిగా భావిస్తున్నారు. మరియు ఇది విష్ణువును సూచిస్తుంది. ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్న తొమ్మిది త్రిభుజాలతో కూడిన ఒక అందమైన శ్రీయంత్రం ఆలయం లోపల చూడవచ్చు. 'బసంత్ పంచమి' అనే ప్రముఖ హిందూపండుగ ఈ ఆలయంలో ఉత్సాహంతో జరుపుకుంటారు.

### లక్ష్మణ్ ఆలయం

ఋషీకేశ్‌లో ఉన్న ప్రధాన ఆకర్షణలలో ఒకటిగా చెప్పబడే ఈ లక్ష్మణ్ ఆలయం పట్టణానికి 5 కి.మీ. దూరంలో ఉంది. లక్ష్మణ్ ఆలయం రాముని సోదరుడైన లక్ష్మణుడికి అంకితం చేయబడిన ఒక పురాతన ఆలయం. ఈ ఆలయం పవిత్ర గంగానది ఒడ్డున ఉన్నది. ఆలయగోడలపై నగిషీలు చెక్కిన చిత్రాలను చూడవచ్చు.

### నీలకంఠమహాదేవ ఆలయం

నీలకంఠ మహాదేవ ఆలయం ఋషీకేశ్ దగ్గర సముద్రమట్టానికి 1330 మీటర్ల ఎత్తులో కొండ మీద ఉన్న మందిరం. ఇక్కడ నుండి అద్భుతమైన విష్ణుకూట్, బ్రహ్మకూట్ కొండలను చూడవచ్చు. ఈ ఆలయం శివుడికి అంకితం చేయబడింది. భక్తులు వేలసంఖ్యలో శ్రావణ మాసంలో శివరాత్రి రోజున ఈ ఆలయాన్ని సందర్శిస్తారు.

### గీతాభవన్

గీతాభవన్ గంగానది ఒడ్డున ఉన్న పురాతన నిలయం. ఇక్కడ మహాభారతం మరియు రామాయణంకు సంబంధించిన చిత్రాలు గోడలపై కన్పిస్తాయి. భక్తులు పవిత్ర గంగానదిలో స్నానం చేసి గీతాభవన్‌లో ధ్యానం చేసుకోవచ్చు మరియు సాధువుల బోధనలను వినవచ్చు. దైవవిగ్రహాలను చెక్కడంలో మరింత ప్రత్యేకతను చూడవచ్చు.

### ఓంకారానంద ఆశ్రమం

ప్రముఖ హిందూ తత్త్వవేత్త, మహర్షి, రచయిత అయిన ఓంకారానంద సరస్వతి 1967వ సం॥లో పవిత్ర గంగానది ఒడ్డున ఓంకారానంద ఆశ్రమం స్థాపించారు. ఈ ఆశ్రమంలో ఆధ్యాత్మిక కార్యకలాపాలు, యోగశిక్షణ తరగతులు మరియు యజ్ఞాలు నిర్వహిస్తుంటారు.

### పరమార్థ నికేతన్

హిమాలయాల నడుమ ఉండే ఈ ఆశ్రమంలో ఆయుర్వేదచికిత్సలను అందిస్తుంటారు. ప్రజలు యోగా, ధ్యానం మరియు ఇతర పద్ధతులను నేర్చుకోవడానికి ఈ ఆశ్రమంకు తరచు వస్తుంటారు. ప్రతి సంవత్సరం జరిగే అంతర్జాతీయ యోగాఉత్సవాలను వీక్షించడానికి పెద్ద ఎత్తున పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు.

### శివానంద ఆశ్రమం

ఆశ్రమం పూర్తిగా ఆధ్యాత్మికసేవలను మాత్రమే అందిస్తుంది. ఇక్కడ ఆయుర్వేద ఫార్మసి, యోగ వేదాంత అకాడమి మరియు కంటి ఆసుపత్రి వంటి సంస్థలను ఈ ఆశ్రమం నడుపుతుంది.

## వసిష్ఠ గుహ

వసిష్ఠ గుహ ధ్యానం చేయటం కోసం యోగులు సాధువులు ఉపయోగిస్తారు. ఇక్కడ ప్రముఖమైన మర్రి చెట్లు గుబురుగా పెరిగిన వృక్షాల మధ్య ఉంది. హిందువులు పవిత్రంగా భావించే శివలింగం గుహ సమీపంలో ఉంది.

## రామ్ ఝూలా

స్వర్గ ఆశ్రమంను శివానంద ఆశ్రమంతో కలిపి ఈ రాంఝూలా ఋషీకేశ్ ప్రధాన ఆకర్షణ వంతెనగా చెప్ప వచ్చు. ఇది లక్ష్మణ్ ఝూలా కంటే పెద్దది. ఇది రామాయణ కాలాన్ని మనకు గుర్తింపచేస్తుంది.

## లక్ష్మణ్ ఝూలా

లక్ష్మణ్ ఝూలా 450 అడుగుల వేలాడే గొలుసు వంతెన. ఇక్కడ ఉన్న దేవాలయాలు మరియు ఆశ్రమాలు ప్రత్యేకమైన వీక్షణను కలిగిస్తాయి. రాముని తమ్ముడు అయిన లక్ష్మణుడు ఒకప్పుడు గంగానదిని దాటటానికి ఈ వంతెనను ఉపయోగించాడని అక్కడివారి విశ్వాసం. అందువల్ల ఈ వంతెనను 'లక్ష్మణ్ ఝూలా' అని పిలుస్తారు.

## త్రివేణీ ఘాట్

గంగా, యమునా మరియు సరస్వతి నదుల సంగమ ప్రదేశమే త్రివేణి ఘాట్. దేవాలయాలను సంద ర్శించే ముందు భక్తులు ఈ సంగమంలో మునిగితేలుతారు. సాయంకాలం భక్తులు మహాహారతికోసం ఘాట్‌కి వస్తారు.

## ఋషికుండ్

ఋషికుండ్ త్రివేణి ఘాట్ వద్ద ఉన్న పవిత్రమైన చెరువు. ఈ చెరువులో రాముడు మరియు సీతకు అంకితం చేయబడిన రఘునాథ్ ఆలయ ప్రతిబింబాన్ని చూడవచ్చు. ఇది ఆలయంలో ప్రత్యేకమైంది.

పవిత్రక్షేత్రమైన ఋషీకేశ్ సందర్శించడానికి భారతదేశం నలుమూలల నుండి భక్తులు అనేకులు వస్తుంటారు.



# ప్రాతఃస్మరణీయుడు మరీచి మహర్షి!!

**ఈ చరాచర సృష్టికే ఆలవాలమైన ఎందరో మహా ఋషుల పాదస్పర్శతో పునీత మైంది ఈ భారతావని. బ్రహ్మ దేవుని మానసపుత్రులలో ఒకరైన మరీచిమహర్షి , దైవసంప న్నుడు, తేజోమూర్తి, ప్రాతఃస్మరణీయుడు. సాక్షాత్ నారయాణాంశగా అవతరించారు.**

**ఈ అనంత సృష్టి నిర్మాణంకోసం ఉదయించిన ప్రజాపతులలో మరీచి మొదటి వాడు, అంతేగాదు, మొదటి మన్వంతరంలోని సప్తఋషులలో మరీచి మహర్షి ఒకరు, శ్రీవిఖనో మునీంద్రుల అంతరంగ శిష్యులలో ఒకరైన మరీచిమహర్షి వైఖానస సంప్రదాయ అభ్యుదయానికి ఎన్నో గ్రంథాలను అందించారు. వాటిలో ఆనందసంహిత ప్రధానమైనది. ఈ గ్రంథంలో అనంతరూపుడైన ఆ శ్రీమన్నారాయుణుడిని గురించిన అర్చన, పూజావిధానము మొదలైన ఎన్నో వైదికవిషయాలను తెలియజేసిన ఘనత ఈ మహాఋషికే దక్కింది.**

**ఒకానొక సమయంలో, వేదసారం అర్థంగాక, ఏ భగవంతుని కొలవాలని, సత్వాది గుణములే లక్షణములుగా కలవాడగు, అవ్యక్తుడగు, సర్వాత్మకుడును, నిర్గుణుడును, అయన పరంధాముడెవ్వడని, శ్రుతి, స్మృతీతిహాసాదులచేత ఏకగ్రీవముగ కొనియాడబడే ఒకే ఒక దేవుడెవ్వడు, అని సంశయాత్ముకులైన సువ్రతుడు మొదలైన మునులకు, వారి సంశయా లను తీరుస్తూ, వైఖానస ప్రాశస్త్యాన్ని ఈ విధంగా చెప్పాడు మరీచిమహర్షి- 'దేవతలలో శ్రేష్ఠుడగు దేవుడు హరినారాయణ పరశబ్దములచే పిలువబడుతున్నారు, ఇందుకు శ్రుతియే ప్రమాణం, ఆ నారాయణుడు పరబ్రహ్మము' ఆయనే అవ్యయుడు, అంతేగాక, దేవతలందరిలో విష్ణువే ప్రథముడు, అగ్ని కడపటివాడు, ఈ మధ్య అధికారంలో తక్కిన దేవతలందరు ఉంటారు. అందుకే వేదం చెపుతుంది, సర్వం విష్ణుమయం జగత్, హరిమయం ఈ విశ్వమంతా'. సాక్షాత్ విష్ణు దర్శనుడైన మరీచిమహర్షి ఎంతటి భాగ్యశాలో కదా!!**

బాలవాక్కు

# నిజమైన 'రత్నం'

సాయంవేళ ఊరు అవతల బావి వద్ద ఆడ వాళ్లందరూ నీళ్లు తోడుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. పశువులు ఇళ్ళకి తిరిగి వస్తున్నాయి. పశువుల కాపరులు వాటిని జాగ్రత్తగా ఇంటికి తోలుకొని వస్తున్నారు. పక్షులు గూటికి చేరుకుంటున్నాయి.

ఆడవాళ్లందరూ ఉత్సాహంగా వాళ్ల వాళ్ల పిల్లల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. వాళ్లకు దగ్గరిలో ఒక ముసలి రైతు కూర్చుని ఏదో పని చేసుకుంటూ వీళ్ల కబుర్లు వింటున్నాడు.

ఆడవాళ్లందరిలో ఒక ఆమె అంటున్నది 'నా కొడుకు చాలా బాగా పాడుతాడమ్మా! విన్నవాళ్ళు అందరూ ఒప్పుకున్నారు'. అవునమ్మా! నీ కొడుకు గొప్ప గాయకుడు, ఎంత గొప్పగా పాడతాడు అది వినే వాళ్ళకి సమయమే తెలియదు అని అన్నారు. నీ కొడుకు 'రత్నం' అన్నారు.

ఇంకొక ఆమె అన్నది 'నా కొడుకు చక్కని కవి. అందరూ ఒప్పుకున్నారు'. అవునమ్మా! నీ కొడుకు ఎంత గొప్పగా కవిత్వం చెప్తాడో! అతను కవిత్వం చెబుతూ ఉంటే ఎంత బాగుంటుందో.. చిన్నపిల్లలకి కూడా అర్థమయ్యేలా రాస్తాడు అని వాళ్లందరూ అన్నారు. నీ కొడుకు 'రత్నం' లాంటి కొడుకు అని ఒప్పుకున్నారు.

వేరొక ఆమె అన్నది 'నా కొడుకు వస్తాదు. చుట్టు పక్కల మల్లయుద్ధంలో వాడిని ఓడించే వారెవరూ లేరు' అన్నది. అందుకు అందరు అవునమ్మా నీవు చెప్పింది నిజం. చుట్టుప్రక్కల గ్రామాల్లో ఎవ్వరూ అతనిని ఓడించలేరు. అంతేకాకుండా, అతను మన గ్రామంలోను చుట్టు పక్కల గ్రామాలలోనూ ఉన్న యువకులకు కత్తిసాము, కఱ్ఱసాము వంటి విద్యలు నేర్పిస్తున్నాడు. 'రత్నమేనమ్మా! నీ కొడుకు' అని అక్కడివారు అన్నారు.

అప్పుడు అందరూ మౌనంగా ఉన్న ఇంకొక ఆమె వైపు చూసి 'ఏవమ్మా! నువ్వేమి నీ కొడుకు గురించి చెప్ప లేదే!' అన్నారు. అందుకు ఆమె 'నా కొడుకు సామాన్యు డమ్మా! అతడికే విద్యలు తెలియవు. అతడు మంచివాడు అన్నది.

ఇంతలో పాటలు పాడే కొడుకు అటుగా వచ్చి ఏదో పాడుకుంటూ వెళుతున్నాడు. అక్కడ తల్లిని చూసి 'ఏమిటి నువ్వు ఇంకా ఇక్కడే తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ ఉన్నావా? నాకు ఈ రోజు రాత్రి కచేరీ ఉన్నది కదా! నువ్వు ఇంటికి వెళ్ళేది ఎప్పుడు? వంట చేసేదెప్పుడు, నేనెప్పుడు తిని కచేరీకి వెళ్ళాలి' అని విసుక్కున్నాడు. ఆమె చిన్నబుచ్చు కుని గబగబా బిందె తీసుకుని వెళ్లిపోయింది.


ఇంతలో కవిత్వం చెప్పే కొడుకు అటువైపుగా వచ్చాడు. 'ఏమిటమ్మా! ఇక్కడే.. తీరుబాటుగా కబుర్లు చెప్పు కుంటున్నావా? పద పద వేగంగా వంట చెయ్యి! నేను కవిత్వం రాసుకోవాలి' అని కసిరాడు. ఆమె మాట్లాడకుండా పరుగువంటి నడకతో బిందెతో వెళ్ళిపోయింది.

ఇంతలో వస్తాదు వచ్చాడు 'ఏమమ్మా! నేను భోజనం చేసి బయటికి వెళ్ళాలి అని తెలిసి కూడా నువ్వు ఇంకా ఇక్కడే ఉన్నావా?' అని గద్దించాడు. ఆమె బరువైన బిందె పట్టుకొని భయపడుతూ నడవసాగింది.

ఇంతలో సామాన్యమైన యువకుడు వచ్చాడు. తల్లి చేతిలో ఉన్న బిందె తీసుకున్నాడు. గబగబా నీళ్లన్ని తోడి బిందెలు నింపాడు. తల్లి వారిస్తున్నా వినకుండా.. 'నేనుం డగా.. నీకు ఎందుకమ్మా! శ్రమ. నిన్ను కష్టపెట్టను? పద, నువ్వు హాయిగా నడువు. నాతో కబుర్లు చెప్పు. ఇంటికి వెళ్లాక కూడా నువ్వు శ్రమపడటానికి వీల్లేదమ్మా! నేను ఒప్పుకోను నేను నీకు నీ పనులలో సాయం చేస్తాను. పొలం పనులు వేగంగా పూర్తి చేసుకొని వచ్చానమ్మా! నువ్వు ఎక్కడ




మాస్టర్ యు. భరత్‌శర్మ,
9వ తరగతి,
భారతీయవిద్యాభవన్ శ్రీవేంకటేశ్వరవిద్యాలయ,
తిరుపతి.



నీళ్లు పట్టుకు వెళ్తావో.. అనుకున్నాను. ఇంకా నయం ఆ బరువు నీవు మోయలేదు' అన్నాడు.

ఇదంతా చూస్తున్న ఆ ముసలి రైతు ఇలా అన్నాడు. వాళ్లందరూ వాళ్ల కొడుకుల్ని రత్నాలు అన్నారు. కానీ, 'నీ కొడుకమ్మా! నిజమైన 'రత్నం' అని ప్రశంసించాడు.

నిజమే! కవిత్వాలు, పాటలు పాడితే ఏమి? కుస్తీలు పడితే ఏమి? ఎన్ని ప్రతిభాపాటవాలు ప్రజ్ఞాపాటవాలు ఉంటే ఏమిటి? తల్లిదండ్రుల కష్టం అర్థం చేసుకొని, వారిని ప్రేమగా చూసే వారే నిజమైన 'రత్నాలు'.

# శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు - గరుడసేవ

డా॥ పి.టి.జి. రంగరామానుజాచార్య

పురాణములలో స్వామివారికి స్వయంగా బ్రహ్మదేవుడే బ్రహ్మోత్సవాలను జరిపినట్లు ప్రసిద్ధి. తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, పెద్దశేషవాహనం, చిన్నశేషవాహనం, ముత్యపు పందిరి వాహనం, కల్పవృక్షవాహనం, సర్వభూపాలవాహనం, పల్లకీఉత్సవం,గరుడసేవ, హనుమంతవాహనం, గజవాహనం, సూర్యప్రభవాహనం, చంద్రప్రభవాహనం, అశ్వవాహనం, చక్రస్నానం అన్ని వాహనాలు ప్రధానమైనవే. అయితే, ఇందులో శ్రీగోవిందరాజస్వామివారికి గరుడసేవ ప్రత్యేకమైనది.

శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజున సాయంత్రం అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నది గరుడసేవ. ఆనాటి సాయంత్రం స్వామివారు, పుండరీకవల్లిఅమ్మవార్లకు అత్యంత వైభవంగా ఊంజల్‌సేవ అయిన తర్వాత స్వామివారు మాత్రం వాహనమండపంలో వేంచేసి, అచట స్వామివారు గరుడ వాహనంలో పట్టు పీతాంబరములతో సుపుష్పమాలికలతో విశేషాభరణములతో రాత్రి 8.00 గం॥ ప్రాంతములో తిరుమాడవీథులలో వేంచేపు చేస్తారు.



ఇక్కడినుండే దివ్యప్రబంధపారాయణ ప్రారంభమౌతుంది. స్వామివారు ప్రదక్షిణ చేసేవేళ ఎందరో భక్తులు దర్శించుకొని, కర్పూరహారతులు పండ్లు పువ్వులు ఇచ్చి వైకుంఠంనుండి భువికి దిగి వచ్చిన గోవిందుడని అత్యంత పరమానందంతో తమ జన్మ చరితార్థమైందని భావించుకుంటారు. ఇలా స్వామివారు భక్తులను అనుగ్రహించి గంగుండ్ర మండపంలో వేంచేపు చేయడం జరుగుతుంది. తెరనువేసి శ్రీవారికి సడలింపు అయి లోపల వేంచేసిన భాష్యకార్ల సన్నిధివద్ద శాత్తుమొఱ జరుగుతుంది. తర్వాత శ్రీవారు కల్యాణమండపంలో వేంచేసి భాష్యకారుల సన్నిధిలో 'ఇయల్‌శాత్తు' అయిన పిమ్మట స్వామివారికి ఏకాంతసేవ జరుగుతుంది.

'వేదాత్మావిహగేశ్వరః' అన్నట్లు మూర్తీభవించిన వేదాత్మయే గరుడుడు. విష్ణుదేవునికి ధ్వజాది దేవత గరుడుడే. ఇట్టి మహాతిశయముచే ఈ విహగరాజు శ్రీవారికి మిక్కిలి అనుంగుడు.

బ్రహ్మోత్సవ ఆరంభంలో బలిపీఠం వద్ద నైవేద్య ప్రసాదాలు ఉంచి గరుత్మంతుడున్న వస్త్రాన్ని కొడిస్తంభానికి ఎక్కించడం ద్వారా స్వామివారికి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న వర్తమానాన్ని ముక్కోటి దేవతలకు తెలియజేస్తారు. ఈ విధంగా గరుడుడు ఈ మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

రండి.. గరుడసేవ దర్శించండి... గోవిందరాజస్వామి అనుగ్రహం పొందండి!!

# స్వామిసేవలో...
# తిరుమలనంబి

– శ్రీ పి.కృష్ణబాలాజి

తిరుమలక్షేత్రంలో జన్మించి, సాక్షాత్తు శ్రీమద్రామానుజులంతటి వారిని శిష్యునిగాపొంది, తన జీవిత కాలమంతా శ్రీవారిసేవకే అర్పించారు తిరుమలనంబి. ఆ ధన్యజీవి జీవితవిశేషాలను ఇప్పుడు పరికిద్దాం...

## తిరుమలకు ఆగమనం

పదవశతాబ్దంలో, ప్రసిద్ధ వైష్ణవదివ్యక్షేత్రమైన శ్రీరంగంలో యామునాచార్యులవారు శ్రీరంగనాథస్వామికి కైంకర్యసేవలు కొనసాగిస్తూ, తన శిష్యులకు శ్రీవైష్ణవ సంప్రదాయబోధ కావించేవాడు. ఒకనాడాయన శిష్యులతో సంభాషిస్తూ, "శ్రీవేంకటాచలక్షేత్రంలో శ్రీనివాసునికి అభిషేక, తీర్థ, పుష్పకైంకర్యాది సపర్యలు చేయటం భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్యంగా నమ్మాళ్వార్ పేర్కొన్నారు. అయితే, అతికొద్ది కాలం మాత్రమే తాను ఆ కైంకర్యాలు చేయగలిగాననీ, మీలో ఎవరైనా, వేంకటాచలం మీద స్థిరంగా ఉండి శ్రీవారికి సేవా కైంకర్యాదులు నిర్వహిస్తే, స్వామివారి కృపకు పాత్రులౌతారని, గురుతుల్యుడైన నమ్మాళ్వార్ ఆదేశం శిరసావహించినట్లవుతుందని" వారు తెలిపారు.

యామునాచార్యుని ప్రియశిష్యుడు– మనుమడు అయిన శ్రీశైలపూర్ణుడు, వారి ఆదేశానుసారం– తిరుమలలో స్థిరనివాస మేర్పరుచుకుని, శ్రీవారికి నిత్యసేవలందించే లక్ష్యంతో, గురువు ఆశీర్వాదంతో వేంకటాచలక్షేత్రానికి చేరుకుంటాడు. తిరుమలలో నివాసం ఏర్పరుచుకోవడం వల్ల ఆయన **తిరుమలనంబి**గా ప్రసిద్ధి కెక్కాడు.


## పాపవినాశన తీర్థం

ఆయన అనునిత్యం స్వామివారి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు సేవాకైంకర్యం చేయడానికి ప్రతిరోజూ, శ్రీవారి ఆలయానికి ఆరుమైళ్ళ దూరంలో ఉన్న పాపవినాశనం వెళ్ళి, పవిత్ర తీర్థజలాన్ని ఒక మట్టికుండలో నింపుకుని, భగవన్నామ సంకీర్తన చేస్తూ, ఆ జలాన్ని అర్చకులకు పూజాదికాలకు సకాలంలో అందించేవాడు.

## బోయవాని రూపంలో శ్రీవారు

పెక్కు సంవత్సరాల పాటు, అత్యంత నిష్ఠతో, భక్తి తత్పరతతో, శ్రద్ధతో అందిస్తున్న ఈ సేవకు శ్రీవారు తిరుమలనంబి యెడ సంతుష్టుడై, పరీక్షింపదలచి ఒక రోజు యథాప్రకారం, అభిషేకజలం నెత్తిన పెట్టుకుని, ఆలస్యం కాకుండా ఆలయానికి చేరుకోవాలనే ఆతృతతో నడుస్తున్న శ్రీశైలపూర్ణుణ్ణి– విల్లంబులు ధరించి, యువకుడైన బోయవాని రూపంలో శ్రీవేంకటేశ్వరుడు వెంబడిస్తారు. "తాతా!, తాతా!!" అని పిలుస్తూ తాను చాలా దప్పికతో ఉన్నాననీ, ఆ కుండలోని నీళ్ళతో తన దాహం తీర్చమని ఆ బోయవాడు తిరుమలనంబిని వేడుకొంటాడు. అయితే, శ్రీవారిసేవకు ఉపయోగించే పవిత్రజలాన్ని ససేమిరా ఇవ్వనంటాడు తిరుమలనంబి. ఇప్పటికే ఆలస్యమైనందున, తన దారికి అడ్డురాక దూరంగా వెళ్ళమని, ఆ బోయవాణ్ణి కసురుకుంటాడు.

తనను కాదని వేగంగా నడక సాగించిన తిరుమలనంబిని అనుసరిస్తున్న ఆ బోయవాడు తన బాణ ప్రయో



గంతో కుండకు రంధ్రం చేసి, ధారగా వస్తున్న నీటితో దాహం తీర్చుకుంటాడు. కొంతసేపటికి కుండ తేలిక పడడంతో వెనుదిరిగిన తిరుమలనంబి కోపోద్రిక్తుడై, బోయ వానితో పరుషంగా మాటలాడి, సమయానికి అభిషేకజలం సమకూర్చలేని తన అశక్తతను మన్నించమంటూ, శ్రీవారిని క్షమాభిక్ష అర్థిస్తాడు.

## ఆకాశగంగ ఆవిర్భావం

అంత ఆ బోయవాడు, "తాతా! నువ్వెంత మాత్రం విచారించకు. నా వెంట వస్తే దగ్గరలోనే ఉన్న మరో పవిత్ర తీర్థాన్ని చూపిస్తాను" అంటూ తిరుమలనంబిని ప్రక్కనే ఉన్న ఓ లోయలోనికి తీసుకువెళతాడు. ఆ బోయవాడు తన పదునైన బాణంతో ఒక కొండరాతిని ఛేదించగా, స్వచ్ఛమైన జలం పెల్లుబికింది. ఇకనుండి ఈ జలాన్నే అభిషేకానికి ఉపయోగించమని శెలవిచ్చి బోయవాని రూపంలో ఉన్న శ్రీవేంకటేశ్వరుడు అంతర్ధానమవుతాడు. అదే తర్వాతి కాలంలో, తిరుమలలోని సుప్రసిద్ధ తీర్థాల్లో ఒకటైన ఆకాశగంగగా వినుతి కెక్కింది. అదే సమయంలో శ్రీవారు "ఇక నుండి శాశ్వతంగా తిరుమలనంబి తెచ్చే ఆకాశగంగ తీర్థాన్నే తన అభిషేక జలంగా ఉపయోగించాలని తన అర్చకులను" ఆదేశిస్తాడు.

## శ్రీపాదములు

తిరుమలనంబి శ్రీవారి మహాభక్తుడే కాకుండా విద్వాంసుడు, వేదవేదాంగపారంగతుడు కూడా!!

భగవద్రామానుజులవారు తిరుపతిలో ఉన్న సంవత్సర కాలంలో, తిరుమలనంబి వద్ద శ్రీమద్రామాయణం లోని రహస్యాలను పదహారుసార్లు పదహారు రకాల భాష్యంతో, పునరావృతం గాకుండా, రామానుజులవారికి అవగతం చేశారు.

## తోళప్పాచార్యుల కైంకర్యం

ఇప్పటికీ, తిరుమలనంబి వంశీకులు ప్రతి శుక్ర వారం ఉదయం ఒంటిగంటకు రక్షకసిబ్బంది వెంటరాగా, దివిటీల వెలుగులో, కాలి నడకన అడవిబాటలో మూడు మైళ్ళు ప్రయాణించి మూడు బిందెలతో ఆకాశగంగతీర్థం నుంచి అభిషేకజలాన్ని తెచ్చి మేళతాళాలతో ఆలయప్రవేశం చేస్తారు. దారి మధ్యలో ఉన్న బాటగంగమ్మకు మ్రొక్కి ఆ దేవత ఆశీర్వచనం తీసుకుంటారు. ఆకాశగంగ తీర్థాన్ని, ఆ తీర్థానికి వెళ్ళే అరణ్యమార్గంలో బాటగంగమ్మ ఆలయాన్ని ఈనాడు కూడా చూసి తరించవచ్చు.

## తిరుమలనంబి ఆలయం

శ్రీవారిఆలయానికి దక్షిణమాడవీథిలోని మహా ప్రదక్షిణ మార్గంలో, సంపంగి వృక్షాలనీడలో, తిరుమలనంబి ఆలయాన్ని మనం చూడవచ్చు. అందులో తిరుమలనంబి మూలమూర్తి ఉత్సవమూర్తులతో బాటుగా, రామానుజా చార్యుల వారిని కూడా దర్శించుకోవచ్చు. మలయప్పస్వామి మాడవీథుల్లో ఊరేగుతున్నప్పుడు ఈ ఆలయం ఎదురుగా నీరాజనం అందుకుంటారు. ఈ ఆలయంలో తిరుమలనంబి వంశీయులే ఇప్పటికీ అర్చకత్వం వహిస్తూంటారు.

శ్రీవేంకటేశుడు తిరుమలనంబిని తాతా! అని పిలవడం వల్ల ఆ వంశస్థులందరూ "తాతాచార్యులు"గా పిలువబడుతున్నారు. అంతే కాకుండా, శ్రీవారు తిరుమల నంబిని "తోళన్"గా సంబోధించడం వల్ల ఈ వంశం వారిని "తోళప్పాచార్యులు"గా కూడా పేర్కొంటారు. తమిళంలో "తోళన్" అంటే స్నేహితుడని అర్థం. ప్రస్తుతం– తిరుమలలో కైంకర్యం నిర్వహిస్తున్న తిరుమలనంబి వంశీయులను "తోళప్పాచార్యులు" గానూ; కాంచీపురంలోని తిరుమలనంబి వారసులను "తాతాచార్యులు" గానూ వ్యవహరిస్తారు.

వైకుంఠ ఏకాదశికి పదకొండు రోజుల ముందుగా ప్రారంభమై, ఇరవయ్యొదు రోజులపాటు సాగే అధ్యయనోత్స వాల్లో చివరిరోజున తిరుమలనంబిని బోయవాడు తాతా! అంటూ ఆప్యాయంగా పిలిచి, నీళ్ళు త్రాగిన రోజుకు గుర్తుగా **'తణ్ణీరముదు'** అనే ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

అన్నమయ్య ఈ భక్తుణ్ణి కూడా, "..మచ్చిక దొలక తిరుమలనంబితోడుత, నిచ్చనిచ్చ మాటలాడి నచ్చినవాడు" అంటూ తన పదబంధనంతో సంకీర్తించాడు.

తరాలు మారినా, యుగాలు మారినా వేంకటేశుడు తనభక్తుల కష్టనష్టాలను అనుక్షణం గమనిస్తూ, అడగకనే కడగండ్లు తీరుస్తూ ఆపద్బాంధవుడిగా తోడుగా ఉన్నాడన డానికి తిరుమలనంబి వృత్తాంతమే నిలువెత్తు నిదర్శనం!!!

*గోవిందా! గోవిందా!! గోవిందా!!!*

భాగవత కథాసాగరం

# భగవంతుడు సమదర్శి

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్

భగవంతుడు ఇంద్రపక్షపాతియైనట్లు వర్తించడం, దానవులను వధించడము విని పరీక్షిన్మహారాజు అసలు నారాయణుడు పక్షపాతియా లేక నిష్పక్షపాతియా అంటూ శ్రీశుకదేవగోస్వామిని ప్రశ్నించాడు. భగవంతుడు పరమా నందనిధి కాబట్టి దేవతల పక్షాన్ని స్వీకరించడము వలన ఆతనికి కలిగే లాభమేమిటి? దాని వలన ఆతడు సాధించే ప్రయోజనమేమిటి? నిర్గుణుడైన ఆతనికి అసురుల వలన భయమెందులకు? వారి పట్ల ఆతడు వైరాన్ని ఎలా చూప గలుగుతాడు? ఈ ప్రశ్నలు పరీక్షిన్మహారాజును చాలా వేధిం చాయి. అందుకే వాటిని అతడు శుకదేవగోస్వామిని అడి గాడు.

పరీక్షిత్తు ఈ విధంగా ప్రశ్నించినపుడు వ్యాసనంద నుడైన శుకదేవగోస్వామి ఈ విధంగా సమాధానం చెప్పారు. ఈ సంవాదము భాగవతంలోని సప్తమస్కంధంలో వస్తుంది.

"ఓ పరీక్షిన్మహారాజా! పూర్వము రాజసూయయాగ సమయంలో ధర్మరాజు అడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తరంగా శ్రీల నారదముని ఒక ఇతిహాసాన్ని దృష్టాంతముగా చెప్పారు. ధర్మరాజు చేసిన రాజసూయ యజ్ఞస్థలిలో శిశుపాలుడు శ్రీకృష్ణుని చక్రాయుధంతో వధించబడి సాయుజ్యముక్తిని పొందాడు. అది చూసిన ధర్మరాజుకు ఆశ్చర్యం కలిగింది. ఋషుల సమక్షంలో అతడు తన సందేహాన్ని నారదమునిని అడిగాడు."

శిశుపాలుడు శ్రీకృష్ణుని పట్ల పరమ ద్వేషాన్ని కలిగి యుండేవాడు. అయినప్పటికీ అతనికి సాయుజ్యముక్తి లభించడము పరమాశ్చర్యకరము. దమఘోషసుతుడైన శిశు పాలుడు స్పష్టముగా మాట్లాడలేనట్టి చిరుతప్రాయము నుండే శ్రీకృష్ణుని నిందించడము మొదలు పెట్టి మరణపర్యంతము తన పాపస్వభావాన్ని కొనసాగించాడు.

అతని సోదరుడైన దంతవక్త్రుడు కూడ అదే పద్ధతిని కొనసాగించాడు. శిశుపాల దంతవక్త్రులు మాటిమాటికి భగవన్నిందకు పాల్పడినప్పటికీ స్వస్థతతోనే ఉన్నారు. వారి నాలుకలకు శ్వేతకుష్ఠు రాలేదు. వారికి నరకవాసం కలుగ లేదు. చివరికి వారు మహనీయుల సన్నిధిలో శ్రీకృష్ణునిలోనే ప్రవేశించారు. ఈ విషయం ధర్మరాజును అబ్బురపరచింది. పాండుసుతుడైన ధర్మరాజు సందేహాన్ని నివారించడానికి నారదముని ఈ విధంగా సమాధానం చెప్పారు.

"రాజా! నిందాస్తుతులు, సత్కార తిరస్కారములు అజ్ఞానము వలననే కలుగుతాయి. మాయ ద్వారా భౌతిక జగత్తులో దుఃఖాన్ని అనుభవించడానికే బద్ధజీవుని దేహము భగవంతునిచే రచింపబడింది. దేహాత్మబుద్ధి కలిగిన బద్ధ జీవుడు దేహమే తానని, దేహసంబంధముతో గల సమస్తము తనదని భావిస్తాడు. ఈ వైషమ్యము వలననే ప్రశంస, దండనము వంటి ద్వంద్వాలు కలుగుతాయి.


కాని, పరమాత్మునికి శత్రుమిత్రులు లేరు. దాన వులను ఆతడు దండించడము వారి మంచి కొరకే అవు తుంది. భక్తుల స్తుతులను స్వీకరించడము కూడ వారి మంచి కొరకే అవుతుంది. నిందాస్తుతులచే ఆ దేవదేవుడు ప్రభా వితుడు కాడు.

కాబట్టి వైరము, భక్తి, భయము, స్నేహము లేదా కామము వంటి అన్నింటి చేత గాని, వానిలో ఏ ఒక్కదాని చేత గాని బద్ధజీవుని మనస్సు భగవంతుని పైన లగ్నమైతే ఒకే రకమైన ఫలము లభిస్తుంది. భగవంతుడు నిత్యానంద స్థితుడు. అందువలన తన పైన చూపే శత్రుత్వ మిత్రత్వముచే ఆతడు ప్రభావితుడు కాడు."

"ధర్మరాజా! గోపికలు కామము వలన, కంసుడు భయము వలన, శిశుపాలాదులు ద్వేషము వలన, యాద వులు బంధుత్వము వలన, మీరు (పాండవులు) స్నేహము వలన, మేము భక్తి వలన కృష్ణ కరుణను పొందడము జరిగింది. కాని ఈ ఐదు ఉపాయాలలో దేని ద్వారా కూడ

వేనుని వంటివారు భగవంతుని తలచనందున మోక్షాన్ని పొందలేకపోయారు. కాబట్టి మైత్రితో గాని, వైరంతో గాని మనిషి శ్రీకృష్ణునే స్మరించాలి **(తస్మాత్ కేనాప్యుపాయేన మనః కృష్ణ నివేశయేత్)**. నీ పినతండ్రి కుమారులైన శిశుపాల దంతవక్త్రులు పూర్వము విష్ణుపార్షదులు. కాని బ్రాహ్మణ శాపంవలన వారు వైకుంఠము నుండి పతనం చెంది భౌతిక జగత్తుకు వచ్చారు".

"ధర్మరాజా! బ్రహ్మతనయులైన సనకసనందన సనాతన సనత్కుమారులు సకలలోక సంచారం చేస్తూ విష్ణులోకానికి కూడ వెళ్ళారు. నిజానికి వారు మరీచాదుల కంటే వయస్సులో పెద్దవారే అయినప్పటికీ ఐదేండ్ల వయస్సు కలిగిన బాలురుగా కనిపిస్తారు. నగ్నంగా ఉన్నట్టి పిల్లలు వైకుంఠములోనికి ప్రవేశించబోగా ద్వారపాలకులైన జయ విజయులు వారిని అడ్డగించారు. అది బ్రహ్మసుతులకు కోపాన్ని కలిగించింది. అసురజన్మలను పొందండని వారు వెంటనే శపించారు. ఆ విధంగా శపితులై భౌతిక జగత్తుకు పతనం చెందుతున్న జయ విజయులపై సనకాదులకు కనికరం కలిగింది. మూడుజన్మల తరువాత ద్వారపాలకులు తిరిగి తమ స్వస్థానాలను పొందుతారని వారు శాపోపశమనాన్ని చెప్పారు. మూడుజన్మలలో శాపము పరిసమాప్త మౌతుందని వారు తెలియజేసారు."



"రాజా! ఆ విష్ణుపార్షదులే (జయవిజయులు) దితి గర్భంలో మొదట హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షులుగా జన్మించారు. దేవదేవుడైన శ్రీహరి నృసింహదేవుని రూపంలో హిరణ్యకశిపుని వధించాడు. ధరణిని గర్భోదక సముద్రము నుండి ఉద్ధరించే సమయంలో హిరణ్యాక్షుడు అడ్డగించగా యజ్ఞవరాహమూర్తి ఆ దానవుని వధించాడు. హిరణ్యకశిపుని తనయుడు భక్త ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు భగవత్తేజముచే సదా రక్షింపబడిన కారణంగా అతనిని హిరణ్యకశిపుడు చంపడానికి ఎంత యత్నించినప్పటికీ సఫలీకృతుడు కాలేదు. ధర్మరాజా! జయవిజయులే ఆ తరువాత కేశిని గర్భంలో రావణకుంభకర్ణులుగా జన్మించి లోకజనులకు తాపకారకులయ్యారు. వారిద్దరు శ్రీరామచంద్రుని చేతిలో నిహతులయ్యారు. ఇక మూడవజన్మలో వారు క్షత్రియ కులంలో నీ పినతండ్రి కుమారులుగా జన్మించారు. శ్రీకృష్ణుని చక్రాయుధంతో నిహతులైన వీరి శాపము పూర్తిగా తీరిపోయింది కాబట్టి తిరిగి తమ లోకానికి వెళ్ళిపోయారు."

నారదుని ఈ వివరణము ధర్మరాజులో మరొక సందేహాన్ని కలుగజేసింది. హిరణ్యకశిపునికి, అతని పుత్రుడైన ప్రహ్లాదునికి వైరమెట్లా కలిగిందో అతడు తెలిసికోవా

లనుకున్నాడు. ప్రహ్లాదుడు అంతటి ఘనమైన భక్తుడు ఏ విధంగా కాగలిగాడో తెలుసుకోవాలని ధర్మరాజుకు ఉత్సాహం కలిగింది. అదే విషయాన్ని అతడు నారదమునిని అడిగాడు. ధర్మరాజు అడిగిన ప్రశ్న వలన భక్తప్రహ్లాదుని కథను నారదముని వర్ణించడము మొదలుపెట్టారు.

ఈ విధంగా ప్రహ్లాద చరిత్రము ఇరువురు భాగవతుల నడుమ, సాక్షాత్తుగా శ్రీకృష్ణభగవానుని సమక్షంలో చర్చించబడి ఒక మహోన్నత స్థానాన్ని పొందింది. శ్రీల నారదముని ఆ చరితాన్ని అద్భుతంగా వివరించారు.

విష్ణుభగవానుడు వరాహరూపంలో హిరణ్యాక్షుని వధించినపుడు హిరణ్యకశిపుడు మిక్కిలి క్రుద్ధుడై త్రిశూలాన్ని చేపట్టి రాక్షసులు చేయవలసిన తక్షణ కర్తవ్యాన్ని బోధించాడు. “ఓ దైత్యదానవులారా! అందరూ సావధానంగా నా మాటలను వినండి. తరువాత నేను చెప్పిన విధంగా ఆచరణ చేయండి. అల్పులైన దేవతలందరు ఒక్కటియై నా ప్రియతముడైన హిరణ్యాక్షుని వధించారు. కాబట్టి మీరు ధరిత్రిపై తపస్సు, యజ్ఞము, వేదాధ్యయనము, వ్రతపాలనము, దానము వంటి పుణ్యకార్యాలలో నెలకొనిన జనులను నశింపజేయండి. బ్రాహ్మణులను వధించండి. బ్రాహ్మణులు లేకపోతే యజ్ఞనిర్వహణ ఉండదు. యజ్ఞనిర్వహణ లేకపోతే దేవతలు అప్రయత్నంగానే మరణిస్తారు”.

ఈ విధంగా హిరణ్యకశిపుని మాటలు దైత్యదానవులలో తీవ్రమైన ఉత్సాహాన్ని కలుగజేసాయి. ఆ క్షణమే వారు హిరణ్యకశిపుని ఆదేశానుసారము విధ్వంసకరకార్యాలలో నెలకొన్నారు. హిరణ్యకశిపుని అనుచరులచే కలిగిన ఈ ఉత్పాతాలకు జనులు కలతచెంది వైదిక కర్మలను నిలిపివేసారు. అందువలన దేవతలకు యజ్ఞఫలము లభించలేదు. వారు కూడ కలతకు గురి అయ్యారు. తత్కారణముగా వారు స్వర్గాన్ని విడిచి దానవులకు కనబడకుండగ ధరణిపై సంచరించడము మొదలుపెట్టారు.

అనుచరులకు ఆదేశం ఇచ్చిన తరువాత హిరణ్యకశిపుడు తన సోదరునికి శ్రాద్ధ తర్పణ కర్మలను నిర్వహించాడు. పిమ్మట సోదరుని పత్నిని, పుత్రులను, తన తల్లియైన దితిని ఓదార్చడానికి ప్రయత్నించాడు. జ్ఞానోదయం కాగానే వారు శోకాన్ని విడిచిపెట్టారు. దితి కూడ తన పుత్రశోకాన్ని విడిచింది.

## రాముడు దర్శించిన వేంకటాద్రి

**ఋష్యమూక పర్వతం నుంచి వానర సైన్యంతో సహా రావణసంహారార్థం వెడుతూ శ్రీరామచంద్రుడు శేషాచలం సమీపానికి వచ్చాడు. అప్పుడు ఆంజనేయుడి తల్లి అయిన అంజనాదేవి రాముని సమీపించి నమస్కరించి, అక్కడ కొంతసేపు ఆగి తనను, అక్కడి మునులను అనుగ్రహించవల్సిందని ప్రార్థించింది. 'ఇపుడు త్వరగా వెళ్ళవలసి ఉంది. కనుక తిరుగుప్రయాణంలో తప్పక వస్తాన'న్నాడు రాముడు. ఆంజనేయుడు జోక్యం చేసుకొని వానరసైన్యం అంతా అలసి ఉంది. కనుక ఫలపుష్పాలతో చెట్లతో సెలయేళ్లతో రుచికర మైన కందమూలాలతో, మంచితేనె పట్టులతో ఉన్న ఈ ప్రాంతంలో కొద్దిసేపు విశ్రమించి వెళ్లాలన్న ఆకాంక్షలను వ్యక్తపరిచాడు. శ్రీరాముడు అందుకు అంగీకరించాడు.**

**శ్రీరాముడు వేంకటాద్రిని ఎక్కుతూ, తన రాక కోసమే ఎదురుచూస్తూ తపమాచరిస్తున్న తపస్వి పూజ స్వీకరించి, అతడిని బ్రహ్మలోకానికి పంపించి, అక్కడి నుంచి ఆకాశగంగను సమీపించి, అంజనాదేవి ఆశ్రమంలో పూజలందుకొని స్వామిపుష్కరిణికి చేరాడు. లక్ష్మణునితో, వానరప్రముఖులతో కలిసి అందులో స్నానంచేసి పుష్కరిణికి దక్షిణభాగంలో పర్ణశాలను ఏర్పరుచుకొని సైన్య సమేతంగా రుచికరమైన పళ్లు తేనె సేవించి సేదదీరాడు. వేంకటాద్రిని దిగి లంకకు పోయి రావణుని సంహరించి సీతను పొంది అయోధ్యకు వెళ్లి, స్వామి పుష్కరిణీ మాహాత్మ్యం వల్లనే రాజ్యాన్ని పొంది పట్టాభిషిక్తుడయ్యాడు.**

**(శ్రీ వేంకటాచల మాహాత్మ్యం)**



# శ్రీజగన్నాథ దర్శనం

- ఆచార్య రాధాగోవిందత్రిపాఠి

సప్త మోక్షక్షేత్రాలలో ఒకటైన పూరీజగన్నాథ క్షేత్రాన్ని జీవితంలో ఒకసారైనా దర్శించాలని ప్రతి భక్తుడు కోరుకుంటాడు. 10 ఎకరాల విస్తీర్ణంలో జగన్నాథుని ఆలయంలో సుమారు 120 ఉపాలయాలు ఉన్నాయి. నీలాద్రిగా పిలిచే స్వామివారి విమానగోపురం ఎత్తు 214 అడుగులు. ఆలయంపై నుంచి చూస్తే శంఖాకారంలో కని పిస్తుంది. ఈ ఆలయాన్ని 1174 సంవత్సరంలో కళింగ రాజు అనంగ భీముడు నిర్మించాడని శాసనాల ద్వారా తెలుస్తున్నది. ఇక్కడ ఎన్ని తుఫానులు వచ్చినప్పటికీ ఆలయం చెక్కుచెదరలేదు.

ఈ క్షేత్రాన్ని గురించి పురాణాలు వర్ణిస్తున్నాయి. ఇది పురుషోత్తమ క్షేత్రమని పేర్కొంటున్నాయి. మత్స్య, విష్ణు, పద్మ, స్కాంద, అగ్ని, పురాణాలలో; కపిలసంహిత, నీలాద్రి మొదలైన తంత్రగ్రంథాలలో; మహాభారతంలో ఈ క్షేత్ర మహిమను బహుధా ప్రస్తావించారు.

## నీలచక్ర ఆలయశిఖరం

జగన్నాథుని ఆలయశిఖరంపై కనిపించే సుదర్శన చక్రానికి 'నీలచక్ర' అని పేరు. దాదాపు 214 అడుగుల



ఎత్తులో ఉన్న గోపురంపై 900 కిలోలతో ఉన్న దీన్ని ఎలా ప్రతిష్ఠించారనేది ఆశ్చర్యాన్ని గొలిపే విషయం. అష్టధాతువు లతో నిర్మితమైన నీలచక్రం ఎత్తు 11 అడుగులు, ఈ చక్రం మనం ఎటువైపు నుండి చూసినా మన వైపు తిరిగి చూసినట్లు అనిపిస్తుంది.

ఈ నీలచక్రానికి అనుసంధానంగా ప్రతిరోజు పతాకాన్ని ఎగురవేస్తారు. దీని దర్శనం మూలమూర్తులతో సమానమని భావిస్తారు. పతాకం మార్చని రోజు 18 ఏళ్ల పాటు ఆలయాన్ని మూసి వేయాలన్నది క్షేత్ర నిబంధన. అందుకే ఈ నియమం ఇప్పటికీ పాటింపబడుతోంది.



విచ్చేసి నాలుగు దారువులను (కర్రలను) నాలుగుమూర్తులుగా విశ్వకర్మ మలుస్తాడని తెలియజేశాడు. ఆ మాట ప్రకారవే సముద్రజలాల ద్వారా వచ్చిన కర్రదుంగలను విశ్వకర్మ హరి ఆనతి మేరకు అద్భుతశిల్పంగా మలచాడు.

విష్ణువు 'జగన్నాథుని'గా, ఆదిశేషుడు 'బలభద్రుని'గా, పరాశక్తి 'సుభద్ర'గా చక్ర దేవత 'సుదర్శనమూర్తి'గా ఆవిర్భవించారు.

## నీలమాధవుడు

సృష్ట్యాది నుంచి ఉన్న అత్యంత ప్రాచీన క్షేత్రం 'పూరీ' అని శాస్త్రగ్రంథాలు వర్ణిస్తున్నాయి. ఆదిగా బ్రహ్మ దేవునకు, ఈ క్షేత్రంలో నీలాచలంపై మాధవుడు నీలా మాధవునిగా దర్శనమిచ్చాడు. ఇక్కడి వటవృక్షం ప్రళయ కాలంలో కూడా నశించనిది. ఒక కల్పాంతంలో జగమంతా ఏకార్ణవమైనపుడు ఇక్కడి వటవృక్ష పత్రంపై బాలకృష్ణుడు మార్కండేయమునికి గోచరించినట్లుగా పురాణగాథ.

## విగ్రహాల తయారి

జగన్నాథుని మూలవిరాట్టులు కొయ్యతో చేసినవి. ప్రతి 18 ఏళ్ళకొకసారి 'నవకళేబర' ఉత్సవాన్ని నిర్వహించి, పాత విగ్రహాల స్థానంలో కొత్త విగ్రహాలు అమరుస్తారు. ఈ సంప్రదాయం పూరీక్షేత్ర ప్రత్యేకం. పాతవిగ్రహాలను ఆలయ ప్రాంతంలోనే ఖననం చేస్తారు. మూలవిరాట్టును తయారు చెయ్యడానికి కేవలం వేపచెట్టు దివ్యవృక్షాలకు చెందిన దారువులను (కొయ్యను) మాత్రమే ఉపయోగిస్తారు.

## విగ్రహాల నిర్మాణము

నారదుని ప్రేరణతో ఇక్కడికి వచ్చిన ఇంద్రద్యుమ్నుడికి దర్శనమిచ్చిన నారాయణుడు తన సంకల్పంతో

## నృసింహమంత్రం

జగన్నాథుని విగ్రహాలను ప్రతిష్ఠించేటప్పుడు నారదుడు నృసింహమంత్రాలతోనే ప్రతిష్ఠ చేశాడని పురాణాలు చెబుతున్నాయి. కనుక, పూరీ నృసింహక్షేత్రం కూడా.

అనంతతత్త్వానికి సంకేతానికి నల్లని వర్ణమే జగన్నాథుని వర్ణం. శుద్ధ సత్త్వగుణమే బలభద్రుని తెల్లని ఛాయ. ఐశ్వర్యశక్తికి సంకేతం సుభద్రాదేవి పసుపురంగు.

బలభద్రుడు ఋగ్వేదస్వరూపుడు.
జగన్నాథుడు సామవేదస్వరూపుడు.
సుభద్ర యజుర్వేద స్వరూపం.
సుదర్శనుడు అథర్వణ వేదస్వరూపుడు.

అని బ్రహ్మదేవుడు స్వయంగా పేర్కొన్నాడు.

## అద్భుతాలు

పూరీ ఆలయంలోనికి ప్రవేశించే సింహద్వారానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆలయం బయటనుండి వినబడే సముద్రపు అలలు సింహద్వారం మెట్టు ఎక్కగానే అసలు వినిపించవు. పూరీ ఆలయంపై ఇంతవరకు ఏ పక్షులు ఎగర లేదట. మూగజీవాలు సైతం జగన్నాథునిపై భక్తితో ఆలయం పైనుంచి ఎగరవని ఇక్కడి భక్తుల విశ్వాసం.

## జగన్నాథుని వంటగది- మహాప్రసాదాలు



శ్రీమహావిష్ణువు ప్రతినిత్యం రామేశ్వరంలో స్నానం, బద్రినాథ్ క్షేత్రంలో ధ్యానం, పూరీలో భోజనం, ద్వారకలో నిద్రచేస్తాడని పురాణ కథనం. అందుకే పూరీ క్షేత్రంలో మహాప్రసాదానికి అంతటి ప్రఖ్యాతి.

ఇక్కడ నైవేద్యంసిద్ధం చేయడంలో ఎన్నో ఆచారపరమైన జాగ్రత్తలు తీసుకుంటారు. జగన్నాథుని వంటశాలలో ప్రతి వంటకాన్ని మహాలక్ష్మీదేవి అదృశ్య రూపంలో పర్యవేక్షిస్తుందని నమ్ముతారు.

## మహాప్రసాదాలు

జీవితంలో ఒక్కసారైనా రుచి చూడాలి పూరీ జగన్నాథుని నైవేద్యం. ప్రతిరోజు ఆరుసార్లు జగన్నాథునికి నివేదనలు చేస్తారు. నివేదన సమయాలు వాటి వ్యవహార నామాలు.

| | |
|---|---|
| ఉ. 8. 30గం॥లకు | – గోపాలవల్లభభోగ్ (అల్పాహారం) |
| ఉ. 10 గం॥లకు | – సకలధూప్ భోగ్(షోడషోపచారపూజ) నైవేద్యం |
| ఉ. 11 గం॥లకు | – గోపాలవల్లభభోగ్ (అల్పాహారం) |
| ఉ. 12. 30గం॥లకు | – మధ్యాహ్నధూపభోగ్ మహానైవేద్యం 40 రకాల వంటకాలు |
| సా. 6. 30గం॥లకు | – సంధ్యాధూప భోగ్ |
| రా. 11 గం॥లకు | – బడా సింగార్ భోగ్ |

'పురుషోత్తమాఖ్యం సుమహత్ క్షేత్రం పరమపావనం!
యత్రాస్తే దారవతనుః శ్రీశో మానుషలీలయా!
దర్శనాన్ముక్తిదః సాక్షాత్ సర్వతీర్థ ఫలప్రదః'

(స్కాందపురాణం)

పురుషోత్తమనామంతో పరమపావనమైన గొప్ప మహిమ కల క్షేత్రమిది. లక్ష్మీపతి మానవులను అనుగ్రహించే లీలతో కట్టలతో చేసిన రూపాలను పొందాడు. దర్శన మాత్రం చేత సాక్షాత్తు ముక్తిని సర్వతీర్థఫలాన్ని ఇచ్చే క్షేత్రమిది.



## విశేషాంశాలు

ప్రపంచంలో అన్నదమ్ములు, సోదరిలకు ప్రత్యేక దేవాలయం బలభద్రుడు, శ్రీకృష్ణుడు, సుభద్ర వెలసిన పూరీ జగన్నాథాలయం. ప్రపంచంలోనే అతి పెద్దపాకశాల పూరీలోనే ఉంది. రోజు 56 రకాల మహానైవేద్యాలు స్వామికి సమర్పించబడతాయి.

## ప్రత్యేకత

ఎప్పటికప్పుడు తయారు చేసే మూడు దారురథాలపై ఊరేగే వేదవేద్యుని దర్శనం ఒక దివ్యానుభూతి. **'నందిఘోష'** అనే రథంపై జగన్నాథుడు, **'తాళధ్వజరథం'**పై బలభద్రుడు, **'దర్పదళన రథం'**పై సుభద్రాదేవి ఊరేగే రథ యాత్ర, ఇలా ఈ క్షేత్రం ఎన్నో ప్రత్యేకతలకు ఆలవాలం.

పూరీక్షేత్ర సందర్శనం సర్వపాపహరణం.

జై జగన్నాథ!!!



# హరిదాస వాఙ్మయంలో... 3
# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

## దాస్యభక్తి

"దాసరెందరే పురందరదాసరయ్య" అని నాటి తమ గురువులైన వ్యాసరాయలచే పొగడించుకొనినవారు పురందరదాసులు. అనగా 'దాసులంటే పురందరదాసులే' ఇట్లు పొగడించుకొనినను వారికి తృప్తిలేక తానింకను హరిదాసుడు కాలేదని శ్రీహరితో అంతరంగనివేదనము చేసుకొంటూ –

"దాసనెంతాగువెను ధరె యోళగెనాను" దాసుడను ఎట్లవుతాను ఈ భూమిపై అని పరితపిస్తూ- ఈ క్రింది లక్షణములను దయతో ప్రసాదించి ఆపై దాసునిగా నన్ను గుర్తించి స్వీకరించమంటారు శ్రీవేంకటాచలధీశునితో-

దుర్బుద్ధిగళనెల్ల బిడిసో నిన్న
కరుణ కవచ వెన్న హరణక్కె తొడిసో।
చరణసేవే యనగె కొడిసో। అభయ।
కరపుష్పవ ఎన్నశిరదల్లిముడిసో॥

దుర్బుద్ధిని విడిపించు స్వామి. నీ కరుణ కవచమును నా జీవనమునకు తొడిగించుము, నీ చరణసేవను ప్రసాదించుము. నీ అభయ హస్తమనెడి పుష్పమును నా శిరస్సు నందుంచుము స్వామి అని అంటూ వేంకటాచల మాహాత్మ్యంలోని వృషభాచల, అంజనాచల, శేషాచల, వేంకటాచల పర్వత కథావృత్తాంతములను స్ఫురింప చేసినారు.

ధృఢభకుతి నిన్నల్లిబేడి। నా ।
అడిగెరగువెనయ్య అనుదినపాడి।
కడెగణ్ణిలే కెన్న నోడి। బిడువె ।
కొడునిన్నధ్యానవమనశుచిమాడి ॥

ధృఢభక్తిని నీయందు వేడుచున్నాను. నీపాదములపై పడి సదా పాడుచున్నాను. నాపై సంపూర్ణదృష్టిని ఉంచి నాకు నీ ధ్యానమును ప్రసాదించి త్రికరణశుద్ధిని కల్గించుము.

మొరెహొక్కవరకాయ్య బిరుదు । ఎన్న ।
మరెయదె రక్షణెమాడయ్య పొరెదు ।
దురితగళెల్లవ తరిదు । సిరి।
పురందర విఠలవెమ్మనున్నను పొరెదు ॥

భక్తవత్సలుడవనె బిరుదును పొందిన హే స్వామి మరువకుండ నన్ను రక్షించి కాపాడుము. దురితములను పారద్రోలి నన్నుద్ధరింపుము.

"దాసన మాడికో ఎన్న స్వామి।
సాసిర నామద వేంకటరమణ"

### వైకుంఠపాళి
### :: 54- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 తే | | 2 శ్యా | మ | 3 లా | దే | 4 వి | | |
| జో | | లి | | క్షా | | త్తం | | 5 ధ |
| 6 వ | హ్ని | | 7 స్వ | గృ | హం | | 8 వే | ర |
| తి | | 9 దో | | హం | | 10 మా | | ణి |
| | 11 త | ప | తి | | 12 య | యా | తి | |
| 13 మ | | రి | | 14 ద | | వి | | 15 మ |
| 16 ది | వి | | 17 ఆ | మ | ని | | 18 పో | రు |
| ర | | 19 శ | | యం | | 20 తా | | ద్వ |
| | | క్తి | | తి | | 21 వి | త | తి |

దాసుని చేసుకో స్వామి। వేనామాల వేంకటేశ్వర॥– అని అంటూ సూక్ష్మంగా ఆలోచిస్తే కశ్యపాది ఋషుల యజ్ఞము మొదలు పద్మావతి పరిణయము వరకు కథా సన్నివేశములను పైరెండు చరణములలో స్ఫురింపజేసినారు.

దాస్యభక్తిని గూర్చి ఇంకను విస్తారముగా శ్రీవిజయ దాసులవారు తెలుపుతూ శ్రీవేంకటేశ్వరుని ఇట్లు ప్రార్థించి నారు.

దాస దాస దాసర దాస్యవకొడు।
దోషరాశిగళనళిదు
శ్రీశధీశ సురేశ సర్వేశ్వర।
భాసుర గుణగణ భవ్యచరితహరే॥

దాస దాస దాసర దాస్యవ– ఇక్కడ మూడుసార్లు దాసశబ్దమును పునరావృత్తమును చేసి– ఆ దాసులయందు దాస్యభక్తి ప్రసాదించమని అంటున్నారు. ఇక్కడ ముగ్గురు దాసులనగా శ్రీహరి, వాయుదేవుడు, పురందరదాసులవారని చెప్పవచ్చును.

ఇక మొదటిచరణము "చిత్త నిన్న చింతెయొళిరలి ... ... ..." చిత్తమెల్లప్పుడు, నీ చింతయందే యుండి ఇతర (అచటినుండి) చింతలు నాలో తొలగిపోని, తద్వార అంతరంగమందు ఆనందముండి అహంకారము తొలగిపోని.

అట్లే సంతతము నీ పాదాల నాశ్రయించాలనే పట్టుదలతో కూడిన మార్గమున పయనింపజేయుము. అంతేకాక అరిషడ్వర్గములనే అడవిని నీ దయాఖడ్గముచే నరికి ఆనందమందు నిలుపుము. దుర్మార్గుల సంగమును, దుర్మతిని దూరము చేయుము. ఎల్లప్పుడు వదలక ఎంతో సంభ్రమముతో సజ్జనులలో ఉంచి కాపాడుము స్వామి అని అన్నారు.

ఈ విధముగా హరిదాసులు దాస్యభక్తిని ప్రసాదించమని భగవంతుని అర్థిస్తూ, దాస్యభక్తి లక్షణములను తెలిపియున్నారు. అంతేగాక "నహిజ్ఞానేన సదృశం పవిత్ర మిహవిద్యతే", "ప్రియో హి జ్ఞానినోత్యర్థం అహం స చమమ ప్రియః" అన్న గీతాచార్యుని వాక్యానుసారం "మధ్వమతవు మతవే సకలశృతి సమ్మతవు" మధ్వాచార్యులవారి వారి అనుయాయులవారి గ్రంథములు ముఖ్యముగా మూలమైన ముప్పై ఏడు గ్రంథముల అవగాహన తద్వార పొందు అనుభూతి సద్భావమే శ్రీహరి దాస్యభక్తి అయివున్నది.

*(ఇంకా ఉంది)*

# శరవణభవ

తన శక్తి ద్వారా ప్రేరేపింపబడి బహిర్గతమైన శివతేజస్సు పృథివి, అగ్ని, జలం, కృత్తికలు ద్వారా వహింపబడి బ్రహ్మ నిర్మించిన తపోగ్ని జనితమైన తెల్లుతుప్ప (శరవనం) ద్వారా స్పష్టమైన ఆకృతికి వ్యక్తమయిందని పురాణకథ బోధిస్తోంది. ఆ తెల్లుతుప్ప షట్కమలాల సంయుక్తరూపం. లేదా యజ్ఞాగ్ని కుండం. మనశరీరంలో ఆజ్ఞాచక్రస్థానం అక్కడ వ్యక్తమయ్యే ఈశ్వర చైతన్యమే (శరవణభవుడు).

ఈ స్థితిని అందుకున్నవాడే సహస్రారాన్ని చేరుకో గలడు. అందుకే ఈ స్థితి తల్లిదండ్రులకు దగ్గరైన కుమారస్థితి.

యజ్ఞంలో స్థాపింపబడిన అగ్ని ఊర్ధ్వముఖం. అదే ఊర్ధ్వముఖ త్రికోణ(△). దానిని జ్వలింపజేసే రసం (సోమం) అధోముఖత్రికోణం(▽). ఈ రెండుకలిపితే షట్కోణం(✡). ఇది సుబ్రహ్మణ్య స్వరూపం. శివశక్తుల ఏకరూపం.

ఇలా సమగ్రయజ్ఞతత్త్వం సుబ్రహ్మణ్యారాధనలో ఇమిడి ఉంది. ఆరుతత్త్వాల మంత్రస్వరూపమే 'శరవణభవ' అనే అక్షరాలు. ఈ నామాన్ని స్మరిస్తూ స్వామిని ఆరాధించే వారికి యజ్ఞ, యోగ, జ్ఞాన, విజ్ఞాన రహస్యాలన్నీ స్పష్ట మౌతాయి. బహుముఖాలైన మేధాశక్తి కూడా సుబ్రహ్మణ్యుని రూపం. అన్ని వైపుల నుండీ వికసించే అద్భుతప్రతిభయే షణ్ముఖుని ప్రతిభ. సమగ్రమైన సుబ్రహ్మణ్యోపాసన వల్ల బుద్ధి శక్తి జాగృతమౌతుందని ఉపాసకుల శాస్త్రవాక్యం.

సుబ్రహ్మణ్యచరిత్ర రామాయణంలో, మహాభారతంలో, పురాణాలలో విశదపరచారు.

మొత్తంగా– సుబ్రహ్మణ్యతత్త్వం అనేకరహస్యాలతో భావిస్తూ అనేక ప్రయోజనాలను ఏకకాలంలో కలిగించ గలిగే ఆశ్చర్యకర విజ్ఞానం అని గ్రహిస్తే చాలు.

# సూర్యధ్యానం

డా॥ ఎన్.వి.శ్రీనివాసరావు

సూర్యభగవానుడు జ్యేష్ఠమాసంలో 'మిత్ర' అనే నామంతో పిలువబడతాడు. అప్పుడు అత్రి అనే ఋషి, తక్షకుడు అనే సర్పము, పౌరుషేయుడు అనే రాక్షసుడు, మేనక అనే అప్సరస, హాహా అను పేరు గల గంధర్వుడు, రథస్వనుడు అనే పేరుగల యక్షుడు ఆయనతో కూడి ఉంటారు. ఈ జ్యేష్ఠమాసంలో చేసే సూర్యోపాసనకు అత్యంత మహిమ ఉంటుంది. ఈ మాసంలో ప్రతి ఆదివారము **'మిత్రాయనమః'** అని అర్ఘ్యమివ్వాలి. ఈ మిత్రాదిత్యుని ఉపాసించడం వల్ల ఆరోగ్యం చేకూరుతుంది.

## సాంబాదిత్యుని కథ

శ్రీకృష్ణునికి అనేకమంది పుత్రులున్నారు. సాంబుడు అందరికంటే అందమైనవాడు. దేవర్షి నారదుడు శ్రీకృష్ణుని దర్శించటానికి ద్వారకానగరానికి వెళ్లాడు. ఒక్క సాంబుడు తప్ప మిగిలిన కృష్ణుని కుమారులందరు నారదమహర్షికి నమస్కరించారు. తన సౌందర్య గర్వంతో సాంబుడు నారదుని పరిహసించాడు. నారదుడు ఈ విషయాన్ని శ్రీకృష్ణుని దృష్టికి తీసుకువచ్చాడు.

కొన్నాళ్లకు మరోసారి నారదమహర్షి ద్వారకకు శ్రీకృష్ణదర్శనార్థం వెళ్ళాడు. ఆ సమయంలో సాంబుడు బైట ఆడుకుంటున్నాడు. నారదుడు అతణ్ణి పిలిచి శ్రీకృష్ణునికి తన రాకను తెలియపరచమని పంపాడు. అయితే సాంబునికి ఇంతకుముందే నారదునితో అయిన అనుభవం గుర్తుకు వచ్చింది. అందువల్ల నారదమునికి కోపం తెప్పించదలచ లేదు. ఇది ఒక వంక అయితే మరో వంక తన భార్యలతో ఏకాంతంలో ఉన్న తండ్రి శ్రీకృష్ణుని వద్దకు వెళ్లటమూ అనుచితముగా ఉంటుంది. వెడితే తండ్రికి కోపం, వెళ్లక పోతే మునికి కోపం. వెళ్లాలా? వద్దా? అని సందిగ్ధంలోపడి చివరికి తండ్రి వద్దకు వెళ్ళి నారదాగమనం విన్నవించడానికే నిశ్చయించుకున్నాడు. తండ్రి గనుక తనను తప్పకమన్నిస్తా డన్న భావంతో, సాంబుని వెనువెంట నారదమహర్షి కూడా శ్రీకృష్ణుదున్న ప్రదేశానికి వెళ్లారు.

అక్కడ కొందరి గోపికల మనస్సులు సాంబుని అందానికి వ్యామోహం చెంది వికలమైనాయి. సాంబుడు ఇతర స్త్రీలను కూడా తమ తల్లి జాంబవతిలాగా చూసు కుంటున్నప్పటికి వారి మనస్సులు చలించాయి. దీనికంత టికి సాంబుని అందమే కారణంగా భావించి శ్రీకృష్ణుడు సాంబుని "కుష్టురోగివికమ్మని" శపించాడు. సాంబుడు భయంకర రోగం గురించి మథనపడి శ్రీకృష్ణుని ప్రార్థిం చాడు. అతని నిర్దోషిత్వాన్ని గ్రహించిన కృష్ణుడు సాంబుని కాశీనగరం వెళ్లి సూర్యుని ఆరాధించమని ఆదేశించాడు.

సాంబుడు కాశీనగరం వెళ్లి సూర్యుని ప్రతిమను ప్రతిష్ఠించి ఆరాధించాడు. అక్కడ ఒక సరస్సును నిర్మిం చాడు. ఆ సరస్సులో స్నానము చేసి సూర్యుని నిరంతరం ఆరాధించడం వలన అతని కుష్టురోగము నివారింపబడినది. ప్రతి ఆదివారం ఆ సరస్సులో స్నానము చేసి ఎవరైతే సాంబాదిత్యుని ఆరాధిస్తారో వారు సర్వరోగ విముక్తులౌ తారు.

మాఘశుక్లపక్ష సప్తమికి దగ్గరలో వచ్చే ఆదివారం సూర్యగ్రహం సమానమైన మహాపర్వంగా భావిస్తారు. ఆ రోజు ప్రాతఃకాలంలో సాంబాదిత్యుని పూజించటంలో విశేష మాహాత్మ్యం ఉంది.

సాంబాదిత్యుని మందిరం కాశీ సూరకుండ్ వీధిలో సరస్సు ఒడ్డున ఉన్నది.

ప్రాతఃకాల సూర్యోపాసన మంత్రంలో మిత్రశబ్దం వాడబడింది.

**'మిత్రస్య చర్షణీ ధృతః శ్రవో దేవస్య సానసిం**
**సత్యం చిత్రశ్రవస్తమం, మిత్రో జనాన్ యాతయతి ప్రజానాన్**
**మిత్రోదాధార పృథివీముతద్యాం, మిత్రః కృష్టీర నిమిషాభి చష్టే**
**సత్యాయ హవ్యం ఘృతవద్విధేమ, ప్రసమిత్ర మర్తో౽స్తు..'**

– అని సూర్యోపాసనా మంత్రము.

ఆయుర్వేదం

# ప్రకృతిమాత ప్రసాదించిన దివ్యౌషధం... 'కలబంద'

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

కలబంద అత్యంత సర్వసాధారణంగా అన్ని ప్రాంతాలలో సులువుగా లభ్యమవుచు ఆరోగ్యపరిరక్షణకు, సౌందర్య పరిరక్షణకు ఉపయోగపడే ఔషధమొక్క. ఈ మొక్కను మన ఇళ్ళలో కుండీలలో, గృహ ఆవరణలలో, పొలం గట్లపైన ఉద్యాన వనాల్లోను పెంచుకోవచ్చు.

ఒక గుత్తిలాగ మొక్క మొదలు నుండి పత్రాలు వచ్చే బహువార్షిక మొక్క ఇది. ఈ మొక్క ఆకుల అంచులు ముళ్ళ వంటి దంతాలు కలిగి ఉంటాయి. పైగా ఆకులు కోలగా, దళసరిగా, మందంగా ఉండటం వల్ల 'స్థూల దళ' అని, స్త్రీల అనారోగ్య సమస్యలని అద్భుతంగా పరిష్కరించడం వలన 'కుమారి' అని, దీని 'గుజ్జు' పేరిన నెయ్యిలా ఉండుటచే 'ఘృతకుమారి' అనే పేర్లతో సంస్కృతంలో వ్యవహరిస్తారు.

'అగావేసి' అను వృక్ష కుటుంబానికి చెందిన ఈ కలబంద శాస్త్రీయ నామం 'అలోవీర'.

ఈ కలబందని వివిధవ్యాధుల్లో ఎలా ఉపయోగించుకుని ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

## చర్మ సమస్యలకు..

**దెబ్బలు, గాయాలు, పుండ్లకు-** రోజు ఒకట్రెండు సార్లు కలబంద గుజ్జులో తగినంత పసుపుపొడి కలిపి పట్టిస్తుండాలి.

**చీము గడ్డలు పగిలేందుకు-** కలబంద గుజ్జులో తగినంత ఉప్పు, పసుపుపొడి కలిపి గడ్డలపై పెట్టి కట్టుకడుతూ ఉంటే అవి త్వరగా పగిలి నొప్పి తగ్గి పుండు కూడా మానుతుంది.

**సొరియాసిస్-** కలబంద గుజ్జును మిక్సిలో వేసి రసం తీసి సమానంగా కానుగ నూనె కలిపి ఒంటికి పట్టించి ఒక ట్రెండు గంటలు ఆగి స్నానం చేస్తుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

**కాలిన వ్రణాలకు-** రోజు రెండు సార్లు కలబంద గుజ్జుని పూస్తు ఉండటం వలన మంట తగ్గడమే కాకుండా బొబ్బలు ఎక్కకుండా ఉంటాయి. అలోవీరాలో ఉండే టి.ఎక్స్. ఎ.టి.-2 అనే రసాయనం నొప్పిని తగ్గించడమే కాకుండా మృతకణాల స్థానంలో కొత్త కణాలు ఉత్పత్తికి దోహదం పడడం వలన చర్మం త్వరగా సాధారణ స్థితిని సంతరించుకుంటుంది.

**అధిక వేడికి-** రోజు ఒకట్రెండు సార్లు పూటకు ఒక టీ స్పూన్ కలబంద గుజ్జుని 5 సార్లు నీటిలో ముంచి విదిలించి తగినంత పంచదారలో అద్ది మింగుతుంటే అధిక వేడి తగ్గుతుంది.

**కళ్ళ సమస్యలకు-** తగినంత కలబంద గుజ్జుని నీటితో కడిగి, బట్టలో వేసి మూట కట్టి కళ్ళపై పెట్టుకుంటు ఉంటే కళ్ళ మంటలు, కళ్ళ నుండి నీరు కారడం, పుసులు కట్టడం, కళ్ళు ఎర్రగా తయారవటం, కళ్ళకలక తగ్గుతాయి.



**కడుపు, ప్రేగుల్లో వచ్చే అల్సర్లకు-** 50 గ్రాముల సోంపు గింజల మెత్తటి చూర్ణాన్ని 200 మి.లీ. కలబంద గుజ్జు రసంలో కలిపి బాగా ఎండించి నిలువ వుంచుకొని రెండు పూటలా పూటకు 2-3 గ్రాముల ప్రమాణంలో 50-100 మి.లీ. నీటిలో కలిపి సేవిస్తు ఉంటే కడుపు ప్రేవుల్లో ఉండే

పుళ్ళు, వ్రణాలు, కడుపు ఉబ్బరం, కడుపులో వికారం తగ్గుతాయి. పరిశోధనలో కూడా అలోవీరా గుజ్జుకు అల్సర్‌ను నయం చేసే గుణం ఉందని శాస్త్రీయంగా కనుగొన్నారు.

**అరికాళ్ళు, అరిచేతుల మంటలకు-** ఒక భాగం జీలకర్ర చూర్ణాన్ని, నాల్గు భాగాల కలబంద గుజ్జులో కలిపి మెత్తగా నూరి అరికాళ్ళకు, అరి చేతులకు మర్దన చేసి అరగంట ఆగి కడుగుతూ ఉండాలి.

**కీళ్ల నొప్పులకు-** అర కిలో కలబంద గుజ్జుని, పావుకిలో గోధుమ పిండిని విడివిడిగా నేతితో దోరగా వేయించి ఉంచుకోవాలి. పావు కిలో పటిక బెల్లం పొడిలో కొద్దిగా నీరు కలిపి పొయ్యిపై పెట్టి తేనె పాకం వచ్చేలా వండి పిదప అందులో కలబంద గుజ్జు, గోధుమ పిండి, పావుకిలో ఆవు నెయ్యి కలిపి సన్నని మంటపై కొద్దిసేపు వేడి చేసి దించి చల్లార్చి నిలువ వుంచుకొని ఉదయం, సాయంత్రం పూటకి ఒక టీ స్పూన్ వంతున సేవిస్తూ ఉండాలి.

**శిరోజాల పెరుగుదలకు హెయిర్ ఆయిల్-** కలబంద గుజ్జుని మిక్సిలో వేసి రసం తీసి పావు కిలో తీసుకొని అరకిలో కొబ్బరినూనెలో కలిపి సన్న మంటపై రసం అంతా ఇగిరి నూనె మాత్రమే మిగిలేలా మరిగించి దించి చల్లార్చి వడగట్టి కేశతైలంగా ఉపయోగిస్తూ ఉంటే తలవెంట్రుకలు అందంగా, ఆకర్షణీయంగా, మృదువుగా పెరగటమేకాక తలలో దురద, చుండ్రు తగ్గుతాయి.

**గర్భాశయ వ్యాధులకు-** జీలకర్రను వేయించి చేసిన చూర్ణం 50 గ్రాములు, పసుపుపొడి 50 గ్రాములు, పటిక బెల్లం 50 గ్రాములు కలిపి నిల్వ ఉంచుకోవాలి. రోజు రెండు పూటలా పూటకు ఒక టీ స్పూను కలబంద గుజ్జును ఏడు సార్లు నీటిలో ముంచి విదిలించి పై విధంగా తయారు చేసుకున్న పొడిని 2 గ్రాములు తీసుకొని ఈ గుజ్జును ఆ పొడిలో అద్దుకొని మింగుతుండాలి. ఈవిధంగా సేవించడం వల్ల బహిష్టు హెచ్చు తగ్గులు రావడం, బ్లీడింగ్ సరిగా కాక పోవడం, తక్కువగా బ్లీడింగ్ కావడం, ఫైబ్రాయిడ్స్ లాంటి గర్భాశయ గడ్డలు మొదలగు వ్యాధులలో చక్కటి ప్రయోజనం కలుగుతుంది.

కలబంద గుజ్జును ఎండించి ఒక ప్రత్యేక పద్ధతి ద్వారా తయారుచేసిన ఔషధాన్ని ముసాంబ్రం అంటారు. ఈ ముసాంబ్రం పచారి కొట్లలోను, ఆయుర్వేద ఔషధ విక్రయ శాలలోను చౌక ధరకే లభ్యమవుతుంది. ఇది కూడా వివిధ వ్యాధుల్లో చక్కగా ఉపయోగపడుతుంది.

**వాత నొప్పులకు-** ముసాంబ్రాన్ని నీటితో నూరి గంధంలా చేసి పట్టిస్తుండాలి. ఇలా వాడటం వల్ల కీళ్ల నొప్పులు, దెబ్బల వల్ల కలిగే నొప్పులు తగ్గుతాయి.

**పసిబిడ్డలకు విరేచనం కాకుంటే-** ముసాంబ్రాన్ని పొడి చేసి తగినన్ని వేడి నీటిలో చిక్కగా కలిపి చల్లార్చి తమలపాకుపై పూసి కడుపుపై ఆ తమలపాకు వుంచితే పసిబిడ్డలకు విరేచనం అయ్యి కడుపు ఉబ్బరం తగ్గుతుంది.

**మొలల వ్యాధికి పై పూతకు- (తాళపత్ర గ్రంథాలలో లిఖిత యోగం)-** ముసాంబ్రం పొడి, హారతి కర్పూరం, పచ్చ కర్పూరం సమభాగాలుగా కలిపి సన్నమంటపై ఉడికించి దించి, చల్లార్చి మెత్తగా నూరి రోజు నీటితో నూరి మొలల వ్యాధి పిలకలపై లేపనం చేస్తుండాలి.

**బహిష్టు నొప్పికి-** ఒకటిన్నర గ్రాము ముసాంబ్రం, ఒకటిన్నర గ్రాము పాత బెల్లం కలిపి నీటితో నూరి మూడు మాత్రలు చేసి ఎండించి ఉంచుకొని బహిష్టు సమయంలో పరగడుపున రోజుకు ఒకటి చొప్పున మూడు రోజులు సేవించాలి. ఇలా ప్రతి బహిష్టు సమయంలో మూడు రోజుల చొప్పున మూడు బహిష్టుల వరకు సేవించాలి.

**ఆస్తమా వ్యాధికి-** ముసాంబ్రాన్ని నీటితో నూరి బఠాణి గింజంత మాత్ర చేసి ఎండించి వుంచుకొని ఉదయం, సాయంత్రం ఒక మాత్ర చొప్పున మింగి కప్పు గోరువెచ్చని నీరు సేవిస్తు ఉంటే ఆస్తమాలో చక్కటి ఫలితం కలుగుతుంది.

కలబంద మరియు ముసాంబరాలను గర్భవతులు వాడితే గర్భస్రావం కావచ్చు. బాలింతలు వాడితే పాలు త్రాగే పిల్లలకు ఎక్కువ సార్లు విరేచనం అయ్యే అవకాశం ఉంది.


రజః ప్రవర్తినీవటి, కుమార్యాసవ లాంటి ఆయుర్వేద ఔషధాల తయారీలో కలబందను ఉపయోగిస్తారు.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్

## संयुक्ताक्षराणि (సంయుక్తాక్షరాలు)

| | | | |
|---|---|---|---|
| घ् + घ = घ्घ | ఘ్ + ఘ = ఘ్ఘ | ज् + ज = ज्ज | జ్ + జ = జ్జ |
| घ् + द = घ्द | ఘ్ + ద = ఘ్ద | ज् + झ = ज्झ | జ్ + ఝ = జ్ఝ |
| घ् + ध = घ्ध | ఘ్ + ధ = ఘ్ధ | ज् + ञ = ज्ञ | జ్ + ఞ = జ్ఞ |
| घ् + न = घ्न | ఘ్ + న = ఘ్న | ज् + ब = ज्ब | జ్ + బ = జ్బ |
| घ् + म = घ्म | ఘ్ + మ = ఘ్మ | ज् + भ = ज्भ | జ్ + భ = జ్భ |
| घ् + य = घ्य | ఘ్ + య = ఘ్య | ज् + म = ज्म | జ్ + మ = జ్మ |
| घ् + र = घ्र | ఘ్ + ర = ఘ్ర | ज् + य = ज्य | జ్ + య = జ్య |
| घ् + व = घ्व | ఘ్ + వ = ఘ్వ | ज् + र = ज्र | జ్ + ర = జ్ర |
| ङ् + क = ङ्क | ఙ్ + క = ఙ్క | ज् + व = ज्व | జ్ + వ = జ్వ |
| ङ् + ख = ङ्ख | ఙ్ + ఖ = ఙ్ఖ | झ् + य = झ्य | ఝ్ + య = ఝ్య |
| ङ् + ग = ङ्ग | ఙ్ + గ = ఙ్గ | झ् + र = झ्र | ఝ్ + ర = ఝ్ర |
| ङ् + घ = ङ्घ | ఙ్ + ఘ = ఙ్ఘ | झ् + व = झ्व | ఝ్ + వ = ఝ్వ |
| च् + क = च्क | చ్ + క = చ్క | ञ् + च = ञ्च | ఞ్ + చ = ఞ్చ |
| च् + च = च्च | చ్ + చ = చ్చ | ञ् + छ = ञ्छ | ఞ్ + ఛ = ఞ్ఛ |
| च् + छ = च्छ | చ్ + ఛ = చ్ఛ | ञ् + ज = ञ्ज | ఞ్ + జ = ఞ్జ |
| च् + ञ = च्ञ | చ్ + ఞ = చ్ఞ | ञ् + झ = ञ्झ | ఞ్ + ఝ = ఞ్ఝ |
| च् + य = च्य | ఛ్ + య = చ్య | ट् + क = ट्क | ట్ + క = ట్క |
| च् + र = च्र | చ్ + ర = చ్ర | ट् + ट = ट्ट | ట్ + ట = ట్ట |
| च् + व = च्व | చ్ + వ = చ్వ | ट् + य = ट्य | ట్ + య = ట్య |
| छ् + य = छ्य | చ్ + య = ఛ్య | ट् + र = ट्र | ట్ + ర = ట్ర |
| छ् + र = छ्र | ఛ్ + ర = ఛ్ర | ट् + व = ट्व | ట్ + వ = ట్వ |
| छ् + व = छ्व | ఛ్ + వ = ఛ్వ | ट् + ष = ट्ष | ట్ + ష = ట్ష |



# కరోనా విజృంభణం

– విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

సీ॥ కలియుగాంతపు వేళగాదు; "కరోనా" వి
జృంభణమ్మును మాన్పవేల? స్వామి!
పంచాయుధములకు పనులు గల్పింపక
సొమ్ములవలె దాల్ప సొగసటయ్య?
నీ గుడికిం జేరు నిఖిల మార్గమ్ములు
మూయింపగా నీకు న్యాయమయ్య!
కలియుగ ప్రత్యక్ష ఘనదైవమను భక్త
జనుల నమ్మిక వమ్ము సలుపకయ్య!

తే॥ ఈ మహామారి ఆగడమింక పెరగ
కుండ నీ భక్తజనముల గుండెదడలు
మాన్పి శ్రీవేంకటేశ! నిన్ మరల మరల
కాంచు భాగ్యంబు మాకు కల్గించుమయ్య!

## గ్రంథసమీక్ష

## హనుమ

రామాయణంలోని అన్ని పాత్రల కంటే హనుమంతుని పాత్ర ప్రధానమైనది. హనుమంతుని రంగప్రవేశంతోనే రామాయణకథ కొత్త పుంతలు తొక్కింది. శ్రీరామవిజయంలో హనుమపాత్ర అద్వితీయమైనది. త్యాగానికి, ధైర్యానికి, కార్యసాధనకు, నమ్మకానికి, దక్షతకు హనుమపాత్ర అమోఘమైనది. అలాంటి హనుమంతుని గూర్చి నోరిహనుమచ్ఛాస్త్రిగారు చక్కని గ్రంథం వ్రాశారు.

ఈ గ్రంథంలో హనుమ–ఓంకారము, హనుమంతుని జన్మవృత్తాంతము, కిష్కింధకాండలో హనుమంతుడు, సుందరకాండలో హనుమంతుడు, యుద్ధకాండలో హనుమంతుడు అనే అంశాలు ఉన్నాయి. అనుబంధంలో సీతామాత రసాతల ప్రవేశము, శ్రీరాముడు పరధామమునకు వెళ్లుట, హనుమంతులవారు శివస్వరూపులు, పంచముఖ ఆంజనేయస్వామి గాయత్రి, హనుమంతుని అధిరోహించిన వేంకటేశ్వర స్వామివంటి అంశాలు వివరించబడ్డాయి.

హనుమంతుని లీలా విశేషాలను సమగ్రంగా తెలుసుకోవాలనుకునే వారికి ఈ గ్రంథం కల్పవృక్షం వంటిది. ప్రతి హనుమద్భక్తుడు చదవదగిన ఉత్తమ ఆధ్యాత్మిక గ్రంథం ఈ 'హనుమ'.

– డా॥ కె.రెడ్డెప్ప.

రచయిత- నోరిహనుమచ్ఛాస్త్రి, సైజు-1/8 డెమ్మీ సైజు, పుటలు-272, వెల- రూ.180/-,
ప్రతులు దొరుకుచోటు - నోరిహనుమచ్ఛాస్త్రి, శ్రీగిరి, ప్లాట్ నెం.1, శ్రీసాయినగర్,
మన్సురాబాద్, హైదరాబాదు-500068, ఫోన్-24110533

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2. కావలసిన భాష :**

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3. సంవత్సర/జీవిత చందా :**

రూ.60/- ☐ రూ.500/- ☐

**4. చందా పునరుద్ధరణ :**

(అ) చందా నెంబరు :

(ఆ) భాష :

**5. చెల్లించిన మొత్తం :**

డి.డి.నెం. :

తేది :

(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# 54 వైకుంఠపాళి




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)వరుణుని భార్య(5); 6)మిత్రవిందకు శ్రీకృష్ణుని వల్ల పుట్టిన కుమారుడు(2); 7)సొంత ఇంటిని ఇలా అంటారు(3); 8)హద్దు(2); 11)సూర్యుని కూతురు(3); 12)దేవయాని భర్తయైన చంద్రవంశపురాజు(3); 16)ఆకాశం, స్వర్గం అను అర్థాలనిచ్చే పదం(2); 17)వసంతఋతువు(3); 18)యుద్ధం(2); 21)సమూహం(7)

### నిలువు

1)అగ్నిదేవుని ముఖ్యపట్టణము(4); 2)'మఅదలు'కుగల మరియొక పేరు(2); 3)లక్కతో నిర్మించిన ఇల్లు(4); 4)ధనం(2); 5)దక్షుని భార్య(3); 9)దోపిడిదొంగ(3); 10)మయుని పెద్దకొడుకు(3); 13)వసుదేవుని భార్యల్లో ఒకతె(3); 14)నలుని భార్య(4); 15)దక్షుని కూతురు(4); 19)వశిష్ఠుని పెద్దకొడుకు(2); 20)పరిమళము(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

# భక్తుల సేవలో....



శ్రీ వై.వి. సుబ్బారెడ్డి,
అధ్యక్షులు,
తి.తి.దేవస్థానములు

## శేషాద్రివిభుని సేవలో ధర్మకర్తల మండలి నిర్ణయాలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీవై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిగారి ఆదేశాలతో కరోనా వైరస్ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల మండలి 2020, మే 28న తిరుమల అన్నమయ్యభవన్‌లో ధర్మ కర్తలమండలి అధ్యక్షులు శ్రీవై.వి.సుబ్బారెడ్డి గారు, ప్రత్యేక ఆహ్వానితులైన శ్రీభూమన కరుణాకరరెడ్డి, శ్రీచెవిరెడ్డి భాస్కర రెడ్డి, శ్రీమేడా మల్లికార్జునరెడ్డిగారలు మరియు తి.తి.దే. కార్యనిర్వహణాధి కారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్. గారు ఇతర సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై పలు విషయాలపై చర్చించి తీర్మానాలు చేశారు. అందులో ముఖ్యమైనవి.



టిటిడికి భక్తులు కానుకల రూపంలో ఇచ్చిన ఆస్తులు అమ్మకాన్ని పూర్తిగా నిషేధించాలని తీర్మానం చేశారు. భక్తులు కానుకల ద్వారా ఇచ్చిన ఆస్తులు దురాక్రమణ పాలైనా, ఉపయోగకరంగా లేక పోయినా వాటిని భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఎలా ఉపయోగించాలనే విషయంపై నిర్ణయం తీసుకోవడానికి బోర్డు సభ్యులు, స్వామీజీలు, భక్తులు, మేధావులతో కమిటీ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ఏ నిర్ణయం తీసుకోవాలో చర్చిస్తామన్నారు.

రాష్ట్రం విడిపోయాక ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ చిన్న పిల్లల ఆసుపత్రి లేక అప్పుడే పుట్టిన పిల్లలు ఇబ్బంది పడుతున్నారని బర్డ్ ఆసుపత్రిలో గానీ, స్విమ్స్ ఆసుపత్రిలో గానీ ఎక్కడ అవకాశముంటే అక్కడ వెంటనే చిన్నపిల్లల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని తీర్మానించారు.



భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయంపైనా బోర్డు సమా వేశంలో సమీక్ష చేశారు. లాక్‌డౌన్ ముగిశాక రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకుని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తాం. కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో భౌతిక దూరం పాటిస్తూ తగిన జాగ్రత్తలతో భక్తులకు ఏ విధంగా దర్శనం కల్పించవచ్చనే అంశంపై అధికారులు కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ పద్ధతి ప్రకారం ప్రభుత్వ సూచనలమేరకు జూన్ 8వ తేది నుండి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు.



Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Asst. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.





తిరుచానూరు
శ్రీపద్మావతీఅమ్మవారి
వసంతోత్సవ సందర్భంగా
స్నపనతిరుమంజనం









శ్రీనివాసమంగాపురం
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి
వసంతోత్సవం





SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 30-06-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020



తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి
పుష్పయాగ మహోత్సవం